teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 159 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | బుధవారం | 2 అక్టోబర్ 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## వర్షాకాల సీజన్ ముగిసినట్లు ప్రకటించిన ఐఎండీ

### గతంలో కంటే ఈ సారి వర్షాలు ఎక్కువేనంటూ వెల్లడి

తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 01 (తీన్మార్ న్యూస్): వర్షాకాల సీజన్ ముగిసిందని ఐఎండీ ప్రకటించింది. గతంలో కంటే తెలుగు రాష్ట్రాల్లో ఈ సారి వర్షాలు ఎక్కువే పడ్డాయని వెల్లడించింది. తెలంగాణలో 962.6 మి.మీ వర్షపాతం నమోదయ్యిందని తెలిపింది వాతావారణ శాఖ. తెలంగాణలో అక్టోబర్ 15 వరకు ఓ మోస్తారు వర్షాలు పడే అవకాశం ఉందని వెల్లడించింది. తుఫాన్లు వస్తేనే వర్షాలు పడే అవకాశం ఉంది కానీ సాధారణ వర్షాలు కురిసే

మిగతా 2 లో




# నేటి నుంచి దసరా సెలవులు

### అక్టోబర్ 2 నుంచి 14వరకు విద్యార్థులకు హాలీడేస్

### ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

### ఆదేశాలు పాటించని స్కూళ్లపై కఠిన చర్యలు

హైదరాబాద్, అక్టోబర్ 01 (తీన్మార్ న్యూస్): పాఠశాలలకు దసరా సెలవులు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది తెలంగాణ విద్యాశాఖ. బతుకమ్మ, దసరా పండుగలు ఉన్నందున తెలంగాణలో అక్టోబర్ 2నుంచి 14వ తేదీవరకు విద్యార్థులకు దసరా సెలవులు ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలలతోపాటు ప్రైవేట్ స్కూళ్లకు సెలవులు ఇవ్వాలని స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆదేశాలిచ్చారు. అక్టోబర్ 15న పాఠశాలలు పునప్రారంభం అవుతాయి. విద్యాశాఖ ఆదేశాలు పాటించకుండా స్కూళ్లు నడిపితే యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ అధికారులు చెప్పారు. అక్టోబర్ 1న పాఠశాలల్లో బతుకమ్మ సెలబ్రేషన్స్ నిర్వహించారు. కాగా తెలంగాణలోని అన్ని కాళేజీలకు అక్టోబర్ 6 నుంచి దసరా సెలవులు ప్రకటించారు.




## మాజీ వీసీ తాటికొండ రమేష్ అక్రమాలపై

# విజిలెన్స్ విచారణ

### రిజిస్ట్రార్ ఛాంబర్లో అన్ని ఫైల్స్ పై ఆరా



హన్మకొండ కేయు, అక్టోబర్ 01 (తీన్మార్ న్యూస్): కాకతీయ యూనివర్సిటీ మాజీ వీసీ తాటికొండ రమేష్ అక్రమాలపై అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ (ఎకేయూటి) బాధ్యులు ప్రభుత్వానికి, విజిలెన్స్ అధికారులకు వేరు వేరుగా ఇచ్చిన ఫిర్యాదులపై ప్రభుత్వం స్పందించి విజిలెన్స్ విచారణకు ఆదేశించిన నేపథ్యంలో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఏఎస్పీ బాలు కోటి, సీ.ఐ రాకేష్, ఇతర విజిలెన్స్ అధికారుల బృందం కేయూ పాలన భవనం చేరుకొని విచారణ జరుపుతున్నారు. ప్రస్తుత ఇన్చార్జి రిజిస్ట్రార్ నరసింహ చారీ, వర్సిటీ

మిగతా 2 లో

# సర్పంచ్‌గా పోటీ చేసే ఆశావాహులకు శుభవార్త

### ఇద్దరు పిల్లలు మించకూడదనే నిబంధన తొలిగింపు

### ఎంతమంది పిల్లలున్నా సర్పంచ్ ఎన్నికకు అర్హులు : కేబినెట్ నిర్ణయం




గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ లాంటి స్థానిక సంస్థలకు జరిగే ఎన్నికల్లో పోటీ చేయడానికి అభ్యర్థికి ముగ్గురు బిడ్డలు ఉంటే అనర్హులు అవుతారనే ప్రధానమైన నిబంధన ఉండేది. కానీ సర్పంచ్‌గా పోటీ చేసే ఆశావాహుల నుంచి వినతులు పెద్ద ఎత్తున రావడంతో ఈ నిబంధనలకు రేవంత్ అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో వెసులుబాటు కల్పించారు. ఈ మేరకు సర్పంచ్‌గా పోటీ చేయాలనుకునే ఆశావాహులకు రేవంత్ ప్రభుత్వం శుభవార్త తెలిపింది.

హైదరాబాద్, అక్టోబర్ 01 తీన్మార్ న్యూస్): ఇదివరకు సర్పంచ్‌గా పోటీ చేయాలి అంటే ఇద్దరు పిల్లలు మించి ఉండకూడదనే నిబంధన ఉండేది. కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆ నిబంధనను తొలగిస్తూ ముగ్గురు లేదా ఆపై ఎంతమంది పిల్లలున్నా కూడా సర్పంచ్ ఎన్నికల్లో పోటీకి అర్హులు అవుతారని రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తెలిపారు. ముగ్గురు పిల్లలు ఉండి సర్పంచ్‌గా పోటీ చేయాలి

మిగతా 2 లో



# సహాయకులు లేకుండా సర్వే చేసేదెలా..?

### సహాయ నిరాకరణపై ప్రభుత్వం నుంచి స్పష్టత కరువు

### మాస్ లీవ్ కు ఏఈఓల జెపీసీ నిర్ణయం

### జిల్లా వ్యవసాయ అధికారికి ఏఈవోల వినతి

ములుగు జిల్లా, అక్టోబర్ 01 (తీన్మార్ న్యూస్): డిజిటల్ సర్వేకు సహాయకులను ఇస్తేనే సర్వే అంటూ ములుగు జిల్లాలోని ఏఈవోలు మంగళవారం అల్టిమేట్, ఇప్పటికే తలకు మించిన పనులంటూ అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న డిజిటల్ పంట సర్వే సందిగ్ధంలో పడింది. సహాయకులు లేకుండా సర్వే ఏలా చేసేదంటూ

మిగతా 2 లో

## హైదరాబాద్ ముషీరాబాద్‌లో

# తీవ్ర ఉద్రిక్తత



### మూసీ వద్ద కొనసాగుతున్న కూల్చివేతలు.. ఓ వైపు ఆందోళనలు

### మద్దతు తెలిపేందుకు వచ్చిన కేటీఆర్ ను అడ్డుకున్న కాంగ్రెస్ నేతలు

.. వివరాలు 2లో

## హైదరాబాద్‌లో డీజేపై నిషేధం

### నిషేధిస్తు హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ ఉత్తర్వులు జారీ



.. వివరాలు 2లో



# హైడ్రా, మూసీ అభ్యంతరాలపై మంత్రి ఆసక్తికరమైన వ్యాఖ్యలు

### శుభ్రమైన నీరు, వాయువు అందించడమే లక్ష్యం

### మంత్రి శ్రీధర్ బాబు వాఖ్యలు

హైదరాబాద్, అక్టోబర్ 01 (తీన్మార్ న్యూస్): హైడ్రా కూల్చివేతలు, మూసీ సుందరీకరణ కోసం చేపడుతున్న మార్కింగ్ ప్రక్రియపై బాధితులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంపై మంత్రి శ్రీధర్ బాబు ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. శుభ్రమైన నీరు. వాయ-ువు అందించడమే మూసీ ప్రాజెక్ట్, హైడ్రా లక్ష్యాలని చెప్పారు. బీఆర్ఎస్ నేతలు వారు తీసుకున్న నిర్ణయాలను మరిచిపోయి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. 2017లో బీఆర్ఎస్ హయాంలోనే మూసీ రివర్ ఫ్రంట్

మిగతా 2 లో



## వరద ప్రభావిత రాష్ట్రాలకు కేంద్రం నిధులు విడుదల

### నష్టపోయిన 14 రాష్ట్రాలకు రూ. 5,858.60 కోట్లు

## దసరా పండుగ సమీపిస్తోన్న వేళ డబుల్ బెడ్‌పై తీపి కబురు



### పండుగలోపే అర్హులకు ఇల్లు మంజూరు చేస్తామని హామీ

### మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడి

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 01 (తీన్మార్ న్యూస్): దసరా పండుగ సమీపిస్తోన్న వేళ డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

మిగతా 2 లో

## స్థానిక ఎన్నికలకు సిద్ధమవుతున్న రాష్ట్ర ఎన్నికల సంఘం


### వార్డుల వారీగా ఫైనల్ ఓటర్ లిస్టులను ప్రదర్శనలు

### రాష్ట్రంలో పంచాయతీ ఓటర్ల సంఖ్య 1,67,33,585

### నేడో, రేపో తుది ఓటరు జాబితా విడదల చేసే చాన్స్

తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 01 (తీన్మార్ న్యూస్): గ్రామ పంచాయతీ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధమవుతున్నది. ఇందుకోసం జిల్లా, గ్రామస్థాయిలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నది. 33

మిగతా 2 లో






.. వివరాలు 2లో

## దీపావళికి సింగరేణి కార్మికులకు బోనస్ ప్రకటన

### ఈసారి రూ. 93,750 చెల్లింపు

### లాభాల్లో 33 శాతం చెల్లింపుకు సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం

### 42 వేల మంది కార్మికులకు వర్తింపు

# సర్పంచ్‌గా పోటీ చేసే ఆశావాహులకు శుభవార్త

మొదటి పేజీ తరువాయి

అనే వారికి రేవంత్ ప్రభుత్వం ఊరట కల్పించిందని అన్నారు.

ఈసారి పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే ఆశావాహులకు పిల్లల సంఖ్య బెడద తప్పింది. గతంలో ఇద్దరు పిల్లలు ఉన్న వారికి మాత్రమే పోటీ చేసే అవకాశం ఉండేది. ముగ్గురు అంతకన్నా ఎక్కువమంది పిల్లలు ఉంటే పోటీకి అనర్హులు. కానీ, 2019 మున్సిపల్ చట్ట ప్రకారం పిల్లలు ఎంతమంది ఉన్నా ఈ సారి పంచాయతీ ఎన్నికల్లో పోటీకి ఆటంకాలు లేవని రేవంత్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే అభ్యర్థులకు ఏఏ సందర్భాల్లో ఇందులో మినహాయింపులతో కూడిన వెసులుబాట్లు లభిస్తాయి అన్న విషయంపై రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టమైన వివరణ ఇవ్వాల్సి ఉంది. కాగా, గతంలో పంచాయతీ ఎన్నికలకు పోటీ చేసే అభ్యర్థికి ముగ్గురు పిల్లల విషయంలో అనర్హతకు సంబంధించిన చట్టం 1994 మే 30 నుంచి అమల్లోకి వచ్చింది. ఈ తేదీకి ముందు ఎంత మంది పిల్లలున్నా అర్హులవుతారు. చట్టం అమల్లోకి వచ్చిన ఒక సంవత్సరంలోగా అంటే 1995 మే 29 లోగా మూడో బిడ్డ పుట్టినా అనర్హులు కాకుండా కూడా మినహాయింపు ఉంది. 1995 మే 30 ఆ తర్వాత జన్మించే పిల్లలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. దత్తత తీసుకున్న పిల్లలతో సహా ఇద్దరికి మించినట్లయినా అర్హులే అవుతారు. దత్తతకు సంబంధించిన పిల్లలు అసలు తల్లిదండ్రుల లెక్కలోనే ఉంటారు. ఈ మేరకు 2006లో హైకోర్టు కూడా ఈ తీర్పు ఇచ్చింది. అదే విధంగా అభ్యర్థికి ముగ్గురు పిల్లలు ఉండి ఒకరిని దత్తత ఇచ్చేసినా అనర్హులే అవుతారు. అభ్యర్థి మొదటి భార్య ద్వారా ఇద్దరు పిల్లలను కలిగి రెండో భార్య ద్వారా మరో బిడ్డను జన్మనిస్తే అనర్హుడి కిందే లెక్క. అయితే మొదటి భార్య ఒక బిడ్డను మాత్రమే జన్మనిస్తే రెండో భార్యకు మాత్రం అనర్హత వర్తించదు. నామినేషన్ వేసే నాటికి ముగ్గురు పిల్లలు ఉండి, పరిశీలన జరిగే రోజుకు అందులో ఒకరు చనిపోయినా కూడా అర్హుడవుతారు. ఇదివరకే ఇద్దరు పిల్లలు కలిగి ఉండి మూడోసారి గర్భం ధరించినా.. అధికారులు పిల్లల లెక్క పరిశీలన కోసం వచ్చే తేదీ నాటికి ఇద్దరే పిల్లలున్నందున అర్హులు అవుతారు. 1995 మే 29 నాటికి ఒక బిడ్డ మాత్రమే ఉండి ఆ తర్వాత ఇద్దరు కవలలు పుట్టినా అర్హుడేఅవుతారు. ఆ తేదీతో నిమిత్తం లేకుండా మొదటి కాన్పులో ఒక బిడ్డ కలిగి తర్వాత కవలలు జన్మించినా అర్హులే అవుతారు. అయితే మొదటి కాన్పులో కవలలు కలిగిన తర్వాత మరో బిడ్డ జన్మనిస్తే అనర్హుడవుతారు. అదే విధంగా ఒకే కాన్పులో ముగ్గురు పుట్టినా పోటీ చేయడానికి అనర్హత వర్తించదు.

# హైదరాబాద్ ముషీరాబాద్ లో తీవ్ర ఉద్రిక్తత

హైదరాబాద్, అక్టోబర్ 01 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ ముషీరాబాద్ లో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. మూసీ నది వద్ద కొనసాగుతున్న కూల్చివేతలను పరిశీలించడంతో పాటు ఆందోళన చేస్తున్న వారికి మద్దతు తెలిపేందుకు బయలుదేరిన కేటీఆర్ ను కాంగ్రెస్ నేతలు అడ్డుకున్నారు. కాన్వాయ్ ముందుకు కదలకుండా ఆందోళన చేపట్టారు. గో బ్యాక్ కేటీఆర్ అంటూ నినాదాలు చేశారు. మంత్రి కొండా సురేఖ బీఆర్ఎస్ సోషల్ మీడియాలో అనుచితంగా పోస్టులు రావడంపై క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అంబర్పేట, ముషీరాబాద్లో కేటీఆర్ కాన్వాయ్ ను అడ్డుకోవడంతో ఆయా ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది.

**అండగా ఉంటాం: కేటీఆర్ భరోసా**

అంబర్ పేట నియోజకవర్గం, గోల్నాక డివిజన్లోని లంక తులసి రామ్ నగర్ ప్రాంతంలో మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్ కారణంగా నివాసాలు కోల్పోతున్న బాధితులను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కలిశారు. అండగా ఉంటామని మీ తరఫున పోరాటం చేస్తామని భరోసానిచ్చారు. కేటీఆర్ వెంట మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, ఎల్బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మా రెడ్డి, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, బీఆర్ఎస్ కీలక నేతలు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, పట్లోల్ల కార్తిక్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# దసరా పండుగ సమీపిస్తోన్న వేళ డబుల్ బెడ్ పై తీపి కబురు

మొదటి పేజీ తరువాయి

శుభవార్త చెప్పారు. రాష్ట్ర సచివాలయం వేదికగా మంగళవారం అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పండుగ లోపే అర్హులకు ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డులు అందజేస్తామని అన్నారు. అంతేకాదు సన్న, దొడ్డు రకాల ధాన్యం కొనుగోలుకు వేర్వేరుగా కేంద్రాలు ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన వరద ఏరియాల్లో మరమ్మతులు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కాగా, రాష్ట్రంలోని ప్రజలందరికీ డిజిటల్ హెల్త్ కార్డులను జారీ చేయాలని ప్రభుత్వం భావిస్తున్న విషయం తెలిసిందే. రాష్ట్రంలోని నాలుగు కోట్ల మంది ప్రజల ఆరోగ్య సమస్యల వివరాలను ఆ డిజిటల్ హెల్త్ కార్డులో నిక్షిప్తం చేసేలా హెల్త్ ప్రొఫైల్ సిస్టమ్ ఉనికిలోకి వస్తున్నదని ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

# తెలంగాణలో అంగన్ వాడీలకు ప్రభుత్వం గుడ్ న్యూస్

*అంగన్ వాడీ టీచర్లకు, హెల్పర్లకు వెసులుబాటు*

*మంత్రి సీతక్క ఆదేశాల మేరకు సర్క్యులర్ జారీ*



తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 01 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో అంగన్ వాడీలకు ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. అక్టోబర్ 2 నుంచి బతుకమ్మ సంబరాలు మొదలు కానున్న నేపథ్యంలో వేడుకల్లో పాల్గొనేందుకు అంగన్ వాడీ టీచర్లకు, హెల్పర్లకు వెసులుబాటు కల్పించింది. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు సర్క్యులర్ జారీ చేసింది. మధ్యాహ్నం 2 గంటల వరకు అంగన్ వాడీలో విధులు నిర్వర్తించిన తర్వాత బతుకమ్మ వేడుకల్లో పాల్గొనవచ్చని పేర్కొంది. బతుకమ్మ సంబరాలు అక్టోబర్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం కానున్నాయి. కొన్ని ప్రాంతాల్లో సెప్టెంబర్ 30నే ప్రారంభం అయ్యాయి. తొమ్మిది రోజులు పాటు బతుకమ్మ సంబురాలు జరగనున్నాయి.

# దీపావళికి సింగరేణి కార్మికులకు బోనస్ ప్రకటన

హైదరాబాద్, అక్టోబర్ 01 (తీన్మార్ న్యూస్): ప్రతి ఏటా దీపావళికి సింగరేణి సంస్థ పీఎల్ఆర్ (పర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డ్) కింద కార్మికులకు ఇచ్చే బోనస్ ఈ ఏడాది రూ. 93,750 చెల్లించేందుకు నిర్ణయించారు. దీంతో సంస్థలోని 42 వేల మంది కార్మికులకు వర్తించనుంది. గత నెల 29న ఢిల్లీలో జాతీయ కార్మిక సంఘాలతో కోల్ ఇండియా అధికారులు చర్చలు జరిపారు. ఇందులో భాగంగా కార్మికులకు పండుగ బోనస్‌గా రూ.లక్ష చెల్లించాలని కార్మిక సంఘాలు పట్టుబట్టాయి. అయితే గతేడాది రూ.85,500 బోనస్ గా ఇచ్చారు. కాగా ఈసారి అదనంగా రూ.8,250 కలిపి మొత్తంగా రూ.93,750 చెల్లిస్తామని యాజమాన్యాలు అంగీకరించాయి. దీంతో కార్మికులకు అదనంగా లబ్ధి చేకూరనుంది. కోల్ ఇండియా పరిధిలోని కార్మికులకు దసరా పండుగకు ముందుగానే చెల్లిస్తారు. సింగరేణి కార్మికులకు మాత్రం దీపావళికి ముందు చెల్లించడం ఆనవాయితీగా వస్తోంది. త్వరలోనే కార్మికులకు బోనస్ చెల్లించే తేదీలను ప్రకటించి వారి ఖాతాల్లో సింగరేణి నగదు జమ చేయనుంది.

**సింగరేణి లాభాల్లోనూ వాటా చెల్లింపు.**

సింగరేణి సంస్థ లాభాల వాటాను కూడా చెల్లించేందుకు యాజమాన్యం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది సంస్థ సాధించిన లాభాల్లో 33 శాతం చెల్లించేందుకు ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి ఓకే చెప్పారు. దీంతో ఈనెల 7న కార్మికుల ఖాతాల్లో జమ చేయనున్నారు. మరోవైపు దసరా పండుగ సందర్భంగా రూ. 25 వేలు పండుగ అడ్వాన్స్‌గా కార్మికులకు ఏటా సింగరేణి చెల్లిస్తోంది. అలా ఇచ్చిన సొమ్మును తిరిగి వేతనాల నుంచి ప్రతి నెలా కొంత రికవరీ చేసుకుంటుంది. వచ్చే నెల వేతనాలతో కలిపి అడ్వాన్స్‌కూడా ఇవ్వనుంది.

# మాజీ వీసీ తాటికొండ రమేష్ అక్రమాలపై విజిలెన్స్ విచారణ



మొదటి పేజీ తరువాయి

అడిట్, స్టేట్ లోకల్ ఆడిట్ వారిని రిజిస్ట్రార్ ఛాంబర్ కు పిలిపించుకొని అన్ని ఫైల్స్ గురుంచి ఆరా తీస్తున్నట్లు సమాచారం.

**మాజీ వీసీ రమేష్ సీనియర్ ప్రొఫెసర్ ప్రమోషన్ పై ఆరా**

గతంలో నాలుగు సార్లు విజిలెన్స్ అధికారులు వర్సిటీ రిజిస్ట్రార్ కు నోటీసులు ఇచ్చినా కూడా వాటికి సంబంధిత ఫైల్స్ ఇప్పటి వరకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించినట్లు సమాచారం. సీనియర్ ప్రొఫెసర్ ప్రమోషన్ కు సంబంధించిన సెలెక్షన్ కమిటీ ప్రొసీడింగ్స్, ఈసీ మినట్స్ గురుంచి ఇన్చార్జి రిజిస్ట్రార్ ను ప్రశ్నించినట్లు తెలిసింది. ఫార్మసీ, ఇంజనీరింగ్ లలో జరిగిన పీ.ఎచ్.డీ అక్రమాలపై కూడా సమాచారం అడిగినట్టు సమాచారం. పీ.ఎచ్.డీ అడ్మిషన్లు చేసిన డీన్ లను పిలిపించి ప్రశ్నించే అవకాశం వున్నట్లు తెలుస్తోంది. పాత సర్వీసు ను అక్రమంగా కలుపుకొని రిజిస్ట్రార్ ఆర్డర్ ద్వారా ప్రమోషన్లు పొందుతున్న వారితో బాటు పాత పెన్షన్ విధానలోకి మారిన వారి గురుంచి ఆరా తీస్తున్నట్లు సమాచారం



# సహాయకులు లేకుండా సర్వే చేసేదెలా..?




మొదటి పేజీ తరువాయి

ఏఈవోలు సహాయ నిరాక నిరాకరణకు దిగగా ప్రభుత్వం నుంచి స్పష్టత కరువైంది. కమిషనరేట్ నుంచి ఒత్తిడి ఎదురైతే ముకుమ్మడిగా మాస్ లీవ్ పెట్టాలని ఏఈఓల జాయింట్ యాక్షన్ కమిటీ నిర్ణయించింది. ఈనెల 24న సర్వే ప్రారంభం కావలసి ఉండగా ఏఈఓల పైనే మొత్తం భారం మోపడం విచిత్రంగా ఉందని వాపోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం పంటల సర్వే బాధ్యతను ఏఈఓలకు అప్పగించింది. శిక్షణ యాప్ ను ఏఈఓలకు అందించింది. పని ఒత్తిడి సిబ్బంది కొరత కారణాలతో సర్వే చేయలేమంటూ ఏఓలు చేతులెత్తిస్తున్నారు. వ్యవసాయ శాఖలోని 49 రకాల పనులు చేస్తూనే డిజిటల్ సర్వే ఎలా చేయగలమని పంటల సాగు విస్తీర్ణాన్ని బట్టి తమకు సహాయక సిబ్బందిని నియమిస్తే సర్వే చేస్తామని స్పష్టం చేస్తున్నారు. పైలెట్ ప్రాజెక్టులకే నాలుగు నెలలు డిజిటల్ సర్వేకు సంబంధించి జిల్లాలో జమ్మికుంట మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయగా నాలుగు నెలలు పట్టింది సర్వేలో సదురు సర్వే నెంబర్ భూమిలోకి 25 మీటర్ల పరిధిలో వెళ్తేనే యాప్ యాక్సెప్ట్ చేస్తుంది, అందులో ఏ పంట వేశారో ఫోటోతో సహా అప్లోడ్ చేస్తేనే స్వీకరిస్తుంది, ఇదంతా 20 మంది ఏఈఓలు పని చేస్తే పూర్తవగా చాలా చోట్ల సిగ్నల్స్ లేకపోవడంతో ఆఫ్లైన్ ద్వారా నిర్వహించారు. ఇతర రాష్ట్రాలో ఇది పరిస్థితి ఏపీ కర్ణాటకలో 1000 ఎకరాల వరకు ఒక గ్రామ వ్యవసాయ సహాయకుడిని అక్కడి ప్రభుత్వం నియమించింది. గ్రామ స్థాయిలో వివిధ వ్యవసాయ సర్వేలు ప్రభుత్వం పథకాల అమలులో లబ్ధిదారులైన రైతులను గుర్తించడం ధ్రువపత్రాల సేకరణ రైతు సమావేశాల నిర్వహణ వంటి విధులు నిర్వర్తించడంలో వ్యవసాయ విస్తీర్ణ సేవలు అన్నదాతలకు మరింత చేరువయ్యాయి. మహారాష్ట్ర ఒరిస్సాలో టెండర్ ప్రక్రియ ద్వారా ప్రైవేటు కంపెనీలకు డిజిటల్ పంట సర్వే బాధ్యతలు అప్పగించారు. కర్ణాటకలో ఒప్పందం ప్రతిపాదన సిబ్బందిని నియమించే సర్వే చేస్తున్నారు. తమిళనాడులో వ్యవసాయ విద్య అభ్యసించిన వారిని రోజువారి వేతనంతో పని చేయించుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం సూచనల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం గ్రామ వ్యవసాయ సహాయకులను నియమిస్తే సర్వే చేయడానికి సిద్ధమని ఏఈఓల సంఘ రాష్ట్ర జిల్లా నేతలు స్పష్టం చేస్తున్నారు. ఆహార భద్రతకే పంట సర్వే వ్యవసాయ రంగంలో డిజిటల్ పబ్లిక్ ఇ న్ఫ్రా స్ట్రక్చర్స్ డిపిఐ రూపొందించే లక్ష్యంతో డిజిటల్ అగ్రి మిషన్ పథకాన్ని కేంద్రం తీసుకొచ్చింది దీని అమలు రూ 2.817 కోట్ల వెచ్చిస్తుంది. రైతులకు ప్రయోజనం చేకూర్చడానికి వ్యవసాయ సామర్థ్యాన్ని పెంచడానికి ఆధునిక సాంకేతికతను వినియోగించనుంది. రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తుంది. సిబ్బంది కొరతే సమస్య, ప్రతి ఐదు వేల ఎకరాలకు చొప్పున ఒక ఏఈవో ఉండగా ఒక్కొక్కరికి 3 నుంచి 22 గ్రామాలు ఉన్నాయి అయితే రైతు బీమా ధాన్యం కొనుగోలు పిఎం కిసాన్ రుణమాఫీ రైతు భరోసా క్రాబ్ బుకింగ్ వ్యవసాయ యాంత్రికరణ పనులను నిర్వహిస్తున్నారు. మరో పక్షం రోజులు గడిస్తే ధాన్యం కొనుగోలులో బిజీగా ఉంటున్నారు దొడ్డు సన్నారకాలు సర్వేలుగా కొనుగోలు జరగనుండగా ఏది సన్నగ ఏది దొడ్డు రకమో గుర్తించేందుకు వీరి సేవలు అవసరంగా పట్టాదారు పుస్తకాలు లేని రైతుల ధ్రువీకరణ ఏఈవోలు చేస్తున్నారు డిజిటల్ సర్వే అంటే ఎలా చేయగలమన్నది వారి వాదన, గ్రామం వారిగా సహాయకాలు ఉంటేనే చేయగలమని లేదంటే ఇతర రాష్ట్రాల్లో మాదిరిగానే నోడల్ ఏజెన్సీలను ఏర్పాటు చేసి సర్వే చేయాలని కోరుతున్నారు.

# స్థానిక ఎన్నికలకు సిద్ధమవుతున్న రాష్ట్ర ఎన్నికల సంఘం

మొదటి పేజీ తరువాయి



జిల్లాల్లో 12,769 గ్రామాలుండగా రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ మేరకు కొన్ని జిల్లాల్లో పంచాయతీలు, వార్డుల వారీగా ఫైనల్ ఓటర్ లిస్టులను ప్రదర్శిస్తున్నది. ఇప్పటి వరకు రాష్ట్రంలో 1,67,33,585 మంది పంచాయతీ ఓటర్లు ఉన్నట్లు లెక్క తేలింది. ఓటర్ల ముసాయిదా జాబితాను ఈ నెల 13న వెల్లడించగా దానిపై అభ్యంతరాలు స్వీకరించి అన్నింటినీ పరిష్కరించి తుది జాబితాలు రూపొందించారు. కాగా, రాష్ట్ర ఎన్ని కల సంఘం ఓటరు జాబితా సంబంధించిన వివరాలను ఇంకా వెల్లడించ లేదు. నేడో, రేపో తుది ఓటరు జాబితా విడదల చేసే చాన్స్ ఉంది.

**బ్యాలెట్ బాక్సులు సిద్ధం.**

పంచాయతీల ఎన్నికలకు క్షేత్రస్థాయిలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎప్పుడు ప్రకటన వచ్చినా నిర్వహించేందుకు సిద్ధం చేస్తున్నారు. పంచాయతీ ఎన్నికలకు ఎంత మంది పోలింగ్ సిబ్బంది అవసరం. పోలింగ్ కేంద్రాల వివరాలు, ఆర్వో బుక్‌లు, బ్యాలెట్ బాక్సులు రెడీ చేస్తున్నారు. పంచాయతీ ఎన్నికల కోసం మొత్తం 54,660 బ్యాలెట్ బాక్సులు అవసరం కాగా రాష్ట్రంలో 40,260 బ్యాలెట్ బాక్సులు ఉన్నాయి. కర్నాటక నుంచి 9,214, ఆంధ్రప్రదేశ్ నుంచి 9,088 తీసుకొచ్చారు. ప్రస్తుతం 58,562 బ్యాలెట్ బాక్సులు రెడీ గా ఉన్నాయి.


**రిజర్వేషన్లపై ఉత్కంఠ**

కులగణన పూర్తి చేసిన తర్వాతే రిజర్వేషన్లు ప్రకటించి ఎన్నికలకు వెళ్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చెప్పింది. ఈ మేరకు కుల గణనపై కసరత్తు ముమ్మరం చేసింది. రిజర్వేషన్ల ప్రక్రియ కొలిక్కి వస్తే ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమం అవుతుంది. అయితే, ఇప్పటికే గ్రామాల్లో రిజర్వేషన్ల అంశంపై జోరుగా చర్చ నడుస్తుంది. అయితే, గ్రామాల్లో ఏ సామాజిక వర్గానికి రిజర్వేషన్‌వర్తిస్తుందనేది ఆసక్తిగా మారింది. ఒకవేళ తమ సామాజిక వర్గానికే రిజర్వేషన్ అయితే పోటీ చేసేందుకు ఆయా లీడర్లు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ మేరకు గెలిస్తే ప్రజలకు, గ్రామానికి ఏం చేస్తారో కూడా గ్రామంలో కలియతిరుగుతూ వివరిస్తున్నారు. కొంతమంది బాండ్‌పేపరు రాసి ఇవ్వడానికి కూడా సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే విడుదలైన ఓటర్ల జాబితా ప్రకారం పలు జిల్లాల్లో ఓటర్ల **వివరాలు.**

- ఆదిలాబాద్ 4,41,795
- భద్రాది కొత్తగూడెం 6,23,947
- జగిత్యాల 5,93540
- జోగులాంబ గద్వాల 3,88,195
- కరీంనగర్ 5,27,237
- ఖమ్మం 8,52,879
- కుమ్రంభీం ఆసిఫాబాద్ 4,57,117
- మెదక్ 5,12,277
- నాగర్‌కర్నూల్ 6,46,407
- నిర్మల్ 4,40,982
- పెద్దపల్లి 4,07,716
- రాజన్న సిరిసిల్ల 5,46,259
- రంగారెడ్డి 7,94,651
- సిద్దిపేట 6,14,371
- వికారాబాద్ 6,71,940
- వనపర్తి 3,56,752
- వరంగల్ 3,89,052

# హైదరాబాద్‌లో డీజేపై నిషేధం

హైదరాబాద్, అక్టోబర్ 01 (తీన్మార్ న్యూస్): మంగళవారం నుండి హైదరాబాద్‌లో డీజే పై నిషేధం విధించారు. శబ్ద కాలుష్యం వల్ల డీజేను నిషేధిస్తున్నట్లు హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాదులో డయల్ 100కు ఫిర్యాదులు రావటంతో నగరంలోని రాజకీయ పార్టీ ప్రతినిధులు, అన్ని మత పెద్దలతో చర్చ తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు. డీజే, సౌండ్ మిక్సర్, హై సౌండ్ ఎక్విప్‌మెంట్ పరికరాలపై నిషేధాజ్ఞలు విధించబడ్డాయి. రాత్రి పది గంటల నుంచి తెల్లవారుజామున 6 గంటల వరకు నిషేధం విధిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అనుమతి ఉన్న ప్రాంతాల్లో తక్కువ శబ్దంతో అనుమతించనున్నారు. ఆసుపత్రులు, స్కూళ్లు, కాలేజీలు, కోర్టు ప్రాంగణాలకు 100 మీటర్ల దూరంలో నిషేధాజ్ఞలు జారీ అయ్యాయి. మతపరమైన ర్యాలీలలో ఎలాంటి డీజేను ఉపయోగించకూడదని సీపీ సీవీ ఆనంద్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సౌండ్ సిస్టంలను మాత్రం పరిమిత స్థాయిలో అనుమతిస్తామన్నారు. సౌండ్ సిస్టం పెట్టడానికి కూడా పోలీస్ క్లియరెన్స్ తప్పనిసరి అంటూ స్పష్టం చేశారు. నాలుగు జోన్లలో సౌండ్ సిస్టంలో పెట్టడానికి పోలీసులు డెసిబిల్స్‌ను నిర్దేశించారు. జనావాసాల ప్రాంతంలో ఉదయం 55 డెసిబెల్స్‌కి మించి సౌండ్




సిస్టంలో వాడరాదన్నారు. రాత్రి వేళలో 45 డెసిబెల్స్‌కు నుంచి సౌండ్ సిస్టంలో వాడరాదన్నారు. మతపరమైన ర్యాలీలలో బాణాసంచా కాల్చడం పూర్తిగా నిషేధమని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఐదు సంవత్సరాల జైలు శిక్షతోపాటు లక్ష రూపాయల జరిమానా విధిస్తామని పదేపదే నిబంధనలు ఉల్లంఘిస్తే ప్రతిరోజు 5000 రూపాయల జరిమానా విధిస్తామన్నారు.

# హైడ్రా, మూసీ అభ్యంతరాలపై మంత్రి ఆసక్తికరమైన వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి

డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు అయ్యిందని ఆయన ప్రస్తావించారు. కాలుష్య నివారణకు, రివర్ ఫ్రంట్ ఏర్పాటు చేయాలని 2017 కార్పొరేషన్ ఏర్పాటు చేశారని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయంలోనే ఆక్రమణలు, అక్రమ కట్టడాలు ఎన్ని ఉన్నాయో తేల్చాలని చెప్పారు. బఫర్ జోన్ బౌండరీలు నిర్ధారణ చేయాలని ఆదేశించారు. అక్కడ ఉన్నవారిని పంపించాలని తీర్మానించారు. 2020లో కేటీఆర్ మంత్రిగా ఉండగా బఫర్ జోన్ నిర్ధారించి ఇళ్లు కూల్చాలని నిర్ణయించారు. 2021లో మరో మీటింగ్ పెట్టి అక్రమ కట్టడాలు కూల్చాలని ఆదేశించారు. 2022లో మరో మీటింగ్ పెట్టి నిర్వాసితులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని చెప్పారు అని పేర్కొన్నారు. మూసీకి రెండు వైపులా 55 మీటర్లు రోడ్లు వేయాలని, 50 మీటర్లు బఫర్ జోన్‌గా గుర్తించాలని 2016లోనే జీవో 7 తీసుకొచ్చారు. యుద్ధ ప్రాతిపదికన ఇళ్లు కూల్చాలని చెప్పారు. లక్షా 50 వేల క్యూసెక్కుల కంటే ఒక్క క్యూసెక్కు ఎక్కువ వచ్చినా ప్రాణ నష్టం జరుగుతుందని 2019లో ఓ సర్వే తేల్చింది. ఆనాడు మీరు ఆలోచన చేస్తే మంచిది. ఈ రోజు మేము మంచి నీరు, గాలి ఇవ్వాలనుకోవడం తప్పా? మంచి ఆలోచనతో పని చేపడుతున్నాం. సమస్యను జఠిలం చేసేలా బీఆర్ఎస్ రాజకీయం చేస్తోంది. కాళేశ్వరం, మల్లన్న సాగర్ భూ నిర్వాసితుల విషయంలో ఆనాడు మీరు ఎందుకు కనికరం చూపలేదు. అధికారం పోయి ఏం చేయాలో తోచక బురద చల్లుతున్నారు. కింది స్థాయి అధికారులు పొరపాట్లు చేస్తే ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుంటుంది. ఎవరినీ ఇబ్బంది పెట్టే ఉద్దేశ్యం మాకు లేదు అని మంత్రి శ్రీధర్ బాబు క్లారిటీ ఇచ్చారు.

# వరద ప్రభావిత రాష్ట్రాలకు కేంద్రం నిధులు విడుదల

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 01 (తీన్మార్ న్యూస్): వరద ప్రభావిత రాష్ట్రాలకు కేంద్రం నిధులు విడుదల చేసింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు, వరదలకు తీవ్రంగా నష్టపోయిన 14 రాష్ట్రాలకు రూ. 5,858.60 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఇందులో తెలంగాణకు రూ. 416.80 కోట్లు విడుదల చేయగా, ఆంధ్రప్రదేశ్‌కు రూ. 1036 కోట్ల నిధులను కేంద్రం విడుదల చేసింది. రాష్ట్ర విపత్తు నిధికి ఎస్డీఆర్ఎఫ్ నుంచి కేంద్రవాటా నిధులు విడుదలయ్యాయి. అత్యధికంగా మహారాష్ట్రకు రూ. 1432 కోట్లు ఇచ్చింది కేంద్రం. 14 రాష్ట్రాల్లో అత్యధికంగా మహారాష్ట్రకే నిధులు ఎందుకు విడుదల చేయాల్సి వచ్చిందంటే త్వరలోనే ఆ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలోనే మహారాష్ట్రకు భారీగా నిధులు విడుదల చేసినట్లు రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇక ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఇలా నిధుల వరద పారించి, గెలిచే ప్రయత్నం చేయడం ఆ పార్టీకి అలవాటై పోయింది. తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాలను వరద ముంచెత్తిన సంగతి తెలిసిందే. ఉమ్మడి ఖమ్మం జిల్లాను వరదలు, వర్షాలు అతలాకుతలం చేశాయి. ఇప్పటికీ వారు కోలుకోలేని పరిస్థితి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోలేదు. పోని కేంద్రమైనా ఆదుకుంటుంది అనుకుంటే అరకొర నిధులు విడుదల చేసి చేతులు దులుపుకుంది. తెలంగాణ నుంచి 8 మంది బీజేపీలు ఉండి ఇంత తక్కువగా నిధులు విడుదల చేయిస్తారా? అని వరద బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# వర్షాకాల సీజన్ ముగిసినట్లు ప్రకటించిన ఐఎండీ

మొదటి పేజీ తరువాయి

అవకాశం లేదని వెల్లడించింది ఐఎండీ. 2024 రుతు పవనాల సీజన్‌లో రాజస్థాన్, గుజరాత్, పశ్చిమ మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో అధిక వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ తెలిపింది.

**2020 తర్వాత అధిక వర్షపాతం**

ఈ సారి దేశంలో 934.8 మిమీ వర్షపాతం నమోదయ్యిందని తెలిపింది ఐఎండీ. సాధారణం కంటే 7.6 శాతం ఎక్కువ వర్షపాతంత నమోదయ్యింది వెల్లడించింది 2023 రుతుపవనాల సీజన్‌లో 820 మిమీ, 2022లో 925 మిమీ, 2021లో 870 మిమీ, 2020లో 958 మిమీ వర్షపాతం నమోదయ్యిందని తెలిపింది ఐఎండీ.

తీన్మార్
తెలుగు దినపత్రిక

## డీలిమిటేషన్ తో ప్రాధాన్యం తగ్గుతుందా

దక్షిణాది రాష్ట్రాలు రాబోయే డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) వలన తక్కువ లోక్‌సభ స్థానాలు పొందనుండటం, జనాభా నియంత్రణ చేయని ఉత్తరాది రాష్ట్రాలు లోక్‌సభ సీట్ల పెంపులో లబ్ధి పొందనుండటం దురదృష్టకరం. జాతీయ ఆర్థిక అభివృద్ధికి, దేశ అభివృద్ధికి కారణమైన దక్షిణాది రాష్ట్రాలు ఈ డీలిమిటేషన్ విధానం వలన భవిష్యత్తులో ప్రాధాన్యత కోల్పోతాయి. ఫలితంగా స్వంతంత్ర వేర్పాటువాద ధోరణులు హెచ్చరిల్లే అవకాశాలున్నాయి.ఏ రాష్ట్రానికి ఎన్ని ఎంపీ సీట్లు ఉండాలనేది ఆయా రాష్ట్రాల జనాభా ఆధారంగా నిర్ధారణ అవుతుంది. ప్రస్తుతం ఉన్న సీట్లు 1971 జనాభా లెక్కల ప్రకారం విభజించినవి. అయితే, 1971 తరువాత దక్షిణ భారత రాష్ట్రాలు జనాభాను బాగా తగ్గిస్తూ వచ్చాయి. అదే సమయంలో ఉత్తర భారతదేశంలోని చాలా రాష్ట్రాలు జనా భాను పెంచుతూ పోయాయి. దీంతో జనాభా ను నియంత్రించిన దక్షిణ భారత రాష్ట్రాలకు లోక్‌సభలో సీట్ల సంఖ్య తగ్గుతుంది. జనాభాను పెంచిన ఉత్తర రాష్ట్రాలకు లోక్‌సభలో సీట్లు పెరుగుతాయి. అదే జరిగితే దక్షిణాది రాష్ట్రాలన్నీ తీవ్రంగా నష్టపోతాయి. ఇప్పటికీ ఉత్తర భారత ఆధిపత్యంపై అనేక విమర్శలున్నాయి. ఆఖరికి ఎంపీ స్థానాల్లో కూడా దక్షిణాది బలం తగ్గిపోతే, ఇక దక్షిణ భారత్ నామమాత్రం అయిపోతుందనే ఆందోళన వ్యక్తం అవుతోంది.నియోజకవర్గం సరిహద్దులు నిర్ణయించి, ఏ నియోజకవర్గంలో ఎంత మంది జనాభా ఉండా లి, ఏ ఏ గ్రామాలు, మండలాలు ఆ నియోజకవర్గంలో ఉండాలో నిర్ణయించే ప్రక్రియను పునర్విభజన లేదా డీలిమిటేషన్ అంటారు. రాజ్యాంగంలోని 82, 170 ప్రకరణల ప్రకారం జనాభా లెక్కల ఆధారంగా పునర్విభజన జరుగుతుంది. 1952, 1962, 1972, 2002లలో పునర్విభజనలు జరిగాయి. పునర్విభజన జరిగినప్పుడే సీట్ల సంఖ్య పెంచడం, తగ్గించడం కూడా చేస్తారు. జనాభా ఆధారంగా నియోజకవర్గాలను విభజిస్తే దక్షిణ భారతానికి తీవ్ర నష్టం జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. భారతదేశ పౌరులందరి ఓటుకూ ఒకే విలువ ఉండాలని రాజ్యాంగం కోరుకుంటుంది. కానీ ప్రస్తుతం యూపీలో 30 లక్షల జనాభాకు ఒక ఎంపీ ఉంటే, తమిళనాడులో 18 లక్షల జనాభాకు ఒక ఎంపీ ఉన్నారు. అంటే ఇప్పుడు తమిళ ఓటర్ విలువ ఎక్కువ, యూపీ ఓటర్ విలువ తక్కువ అవుతుంది కదా. అలా జరగకుండా ఉ ండటం కోసం జనాభా ఆధారంగా ఎప్పటికప్పుడు నియోజకవర్గాలు పునర్విభజన చేస్తారు. ఒక నియోజవకర్గంలో లక్ష మంది కలసి ఒక ఎంపీని ఎన్నుకుని, మరో నియోజకవర్గంలో పాతిక లక్షల మంది ఒకే ఎంపీని ఎన్నుకోవడం కాకుండా, ప్రతీ ఓటుకీ సమాన విలువ ఉండాలన్న సిద్ధాంతం ప్రకారం ఈ ప్రక్రియ జరిగినప్పుడే అది ప్రజాస్వామ్య పునాదులకు బలాన్ని చేకూరుస్తుంది.1970ల మధ్య నుంచి 1980ల వరకూ భారతదేశం జనాభా నియంత్రణకు చాలా ప్రాధాన్యత ఇచ్చింది. ఆరుగురు, పదిమంది పిల్లలను కనవద్దు ...ఒకరిద్దరు పిల్లల్ని కంటే చాలు అంటూ ప్రభుత్వాలు విరివిగా ప్రచారం చేశాయి. ఆ దిశగా దక్షిణ భారత్‌లో మార్పు వచ్చింది. తక్కువ మంది పిల్లల్ని కన్నారు. ఫలితంగా జనాభా బాగా తగ్గింది. కానీ ఉత్తర భారతంలో చాలా రాష్ట్రాల్లో జనాభా నియంత్రణపై ప్రచారం సరిగా లేనందున జనాభా అలాగే ఉండిపోయింది. తీరా చూస్తే హిందీ రాష్ట్రాల్లో ఇప్పుడు విపరీతమైన జనాభా ఉంది. జనాభా ఎక్కువ ఉంటే ఎక్కువ సమస్యలు, తక్కువ ఉంటే ఎక్కువ లాభాలు అనే ధీమా ఉంది, కుటుంబ నియంత్రణ కారణంగా దక్షిణ భారతం హిందీ రాష్ట్రాల కంటే చాలా విషయాల్లో ముందుండడానికి దోహదపడింది. ఇప్పుడిదే శాపంగా మారబోతోందా? అనే భయం దక్షిణాది ప్రజల్లో బలంగా ఉ ంది.1976 వరకూ, డీలిమిటేషన్ జరిగితే రాష్ట్రాల వారీగా ఎంపీల సంఖ్య మారుతుండేది. అప్పటి వరకూ అన్నిచోట్లా జనాభా పెరుగుదల ఒకేలా ఉండేది కాబట్టి రాష్ట్రాల మధ్య ఒకట్రెండు సీట్లు పెరిగినా, తగ్గినా పెద్ద తేడాలు రాలేదు. సమస్య కాలేదు. కానీ, ఆ తరువాత జనాభా కట్టడి విషయంలో రాష్ట్రాల మధ్య మార్పులు వచ్చాయి అలాగే, 1976లో ఒక రాజ్యాంగ సవరణ ప్రకారం, నియోజకవర్గ సరిహద్దులు ఎలా అయినా మార్చవచ్చు కానీ, ఒక రాష్ట్రానికి ఉన్న ఎంపీల సంఖ్యను మార్చకూడదనేది ఆ సవరణ సారాంశం.అంటే జనాభా పెరుగుదల తగ్గుదలతో సంబంధం లేకుండా ఆయా రాష్ట్రాలకు ఎంపీల సంఖ్య నికరంగా ఉంటుంది. అప్పట్లో దానికి పాతికేళ్ల డెడ్ లైన్ పెట్టారు. అంటే 1976 నుంచి 2001 వరకూ మొదటి డెడ్‌లైన్ పూర్తయింది. 2001 నాటికి భారతదేశంలోని రాష్ట్రాల మధ్య జనాభా అంతరాలు తగ్గిపోతాయను కున్నారు. కానీ అలా జరగలేదు. దీంతో 2001లో మరోసారి ఈ ఫ్రీజింగ్ గడువు మరో 25 ఏళ్లకు పెంచారు. అంటే 2026 అన్నమాట. ఇప్పటి డీలిమిటేషన్‌కు ఒక ప్రత్యేకత ఉంది. ఆ డెడ్ లైన్ ఇప్పుడు పూర్తయిపోతుంది. ఈ డీలిమిటేషన్లో ఆయా రాష్ట్రాలకు వచ్చే ఎంపీల సంఖ్య మార్చే అవకాశం చట్ట ప్రకారం కుదురుతుంది. చట్ట ప్రకారం 2026 తరువాత జనాభా లెక్కలు ఎప్పుడు జరిగితే అప్పుడు, వాటి ఆధారంగా నియోజవకర్గాల పునర్విభజన జరగాలన్న ది మరో నిబంధన. ఇదే దక్షిణాది పార్టీల భయానికి కారణం.బీజేపీ తమ ప్రభుత్వాన్ని సుస్థిరం చేసుకోవడం కోసం, దక్షిణాదిన సీట్లు తగ్గించి, హిందీ ప్రాంతంలో సీట్లు పెంచాలని చూస్తోంది. అందు కోసం 2039 వరకూ ఆగకుండా అంతకుముందే డీలిమిటేషన్ చేయాలన్నది వారి ప్లాన్. అందుకోసం 2021 జనాభా లెక్కలను కోవిడ్ తగ్గి పోయినప్పటికీ, కావాలని ఆలస్యం చేసి 2026 తరువాత జరిగేలా చూసి, అప్పుడు వాటి ఆధారంగా నియోజకవర్గాల పునర్వి భజన చేయబోతోంది. ఇది కొందరు సోషల్ మీడియా వేదికగా చెప్పిన సొంత విశ్లేషణ. ఈ వార్తలే దక్షిణ భారత పార్టీలను కంగారు పెట్టాయి. అధిక జనాభాతో సతమతమ వుతున్న దేశాన్ని కాపాడుకు నేందుకు, జనాభా నియంత్రణ చేసిన దక్షిణాది రాష్ట్రాలు ఇప్పుడు అన్యాయం అవుతున్నాయి. కేవలం 18 శాతం జనాభా కలిగిన దక్షిణాది రాష్ట్రాలు 35% జాతీయ స్థూల జాతీయోత్పత్తికి నిధులు అందిస్తున్నాయి. జాతీయ ఆర్థిక అభివృద్ధికి, దేశ అభివృద్ధికి కారణ మైన దక్షిణాది రాష్ట్రాలు ఈ డిలిమిటేషన్ విధానం వలన భవిష్యత్తు లో ప్రాధాన్యత కోల్పోతాయనే బాధఎక్కువగా ఉంది.రాష్ట్రాల జనాభా ఆధారంగా సీట్లు పెంచ కుండా, ప్రతీ రాష్ట్రానికీ నియమిత శాతం ప్రకారంసీట్లుపెంచేలాచర్యలు ఉండాలనిఎక్కువమంది చెబుతున్నారు. ఉదాహరణకు లోక్ సభలో 30 శాతం సీట్లు పెంచితే, అప్పుడు ఉ త్తరప్రదేశ్‌లోని 80 స్థానాలకు మరో 24 చేర తాయి. అలానే ఆంధ్రాలో 25కి 7 సీట్లు చేర తాయి. అలాంటి పరిస్థితి వల్ల ఇబ్బంది

# వయోవృద్ధులు సమాజానికి అమూల్యమైన సంపద

### వారి హక్కులను గౌరవించడం మన భాధ్యత
### జిల్లా అదనపు కలెక్టర్ సంపత్ రావు



ములుగు జిల్లా, అక్టోబర్ 01 (తీన్మార్ న్యూస్): మహిళ, శిశు, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ములుగు ఆధ్వర్యం లో జిల్లా సంక్షేమ అధికారి శకే. శిరీష అధ్యక్షతన జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలోని ఆడిటోరియంలో అంతర్జాతీయ వయోవృద్ధులు దినోత్సవాన్ని నిర్వహించడం జరిగింది. గౌరవంగా వృద్ధాప్యం: ప్రపంచ వ్యాప్తంగా వృద్ధులకు సంరక్షణ బలోపేతం చేయడం మరియు మద్దతు యొక్క వ్యవస్థల ప్రాముఖ్యత అనే నేపథ్యంతో ప్రభుత్వం నిర్వహించిన అవగాహన మరియు వినోదాల వారం లో భాగంగా (25.09.2024 నుండి 01.10.2024) ఈ ముఖ్యమైన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముందుగా సభాధ్యక్షత వహించినటువంటి జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి కే. శిరీష మాట్లాడుతూ వయోవృద్ధులు అంటే మన సమాజం అనే మహా వృక్షానికి బీజాలు అని, అలాంటి వయో వృద్ధులను సంరక్షించడం, వారిపైన ప్రేమ చూపడం ప్రతీ ఒక్కరూ భాధ్యతగా భావించాలని అన్నారు. అనంతరం మహిళ, శిశు వు, దివ్యాంగులు మరియు వయో వృద్ధుల సంక్షేమ శాఖ ములుగు జిల్లా తరపున వయో వృద్ధుల సంక్షేమానికి చేపడుతున్న వివిధ కార్యక్రమాలను గురించి వివరించారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా అదనపు కలెక్టర్ (%×/జ% స్థానిక సంస్థలు) సంపత్ రావు మాట్లాడుతూ వయోవృద్ధులు మన సమాజానికి అమూల్యమైన సంపద అని, వారి హక్కులను గౌరవించడం మన భాధ్యత అని అన్నారు. వయోవృద్ధుల పట్ల సమాజంలో ఉన్న నిర్లక్ష్యపూరితమైన రకమైన భావజాలాన్ని నిర్మూలించేందుకు ప్రభుత్వం వయోవృద్ధులు సంరక్షణ చట్టాన్ని 2007 సం.లో తీసుకువచ్చిందని, కాలానుగుణంగా వచ్చే మార్పుల ఆధారంగా 2011 మరియు 2022 లలో ఈ చట్టాన్ని మరింత కఠినంగా సవరించడం జరిగిందని అన్నారు. ప్రతీ బిడ్డ తమ తల్లి, తండ్రుల ఆస్తులకు మాత్రమే వారసులు కాదని,



వారి ఆలనా పాలనా చూడటంలో కూడా వారసత్వపు హక్కును కలిగి ఉంటారని తెలిపారు. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ 5జి యుగంలో మనిషి రోబోలా మారి తనకు అసలు మనస్సు ఉ న్నదనే విషయాన్ని మార్చిపోతున్నాడని అన్నారు. సమాజంలో వయోవృద్ధులకు సరైన ఆనందం దక్కాలంటే వారికి తమ కన్న బిడ్డల నుండి ప్రేమ పూర్వకమైన పలకరింపు, వారి ఆరోగ్యం పై శ్రద్ధ చూపడం చాలా ముఖ్యం అని అన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ తల్లితండ్రుల నుండి ఆస్తి ని లాక్కొని వారిని పట్టించుకోని వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ ఈ మధ్యే ఆదేశించినట్లుగా తెలిపారు. వయోవృద్ధుల సంక్షేమ సంఘం ద్వారా అందించిన సలహాలు, సూచనలు అన్నీ తప్పకుండా పాటిస్తామని, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళి వారు కోరిన సౌకర్యాలు కూడా తప్పకుండా కల్పించడం జరుగుతుందని అన్నారు. అనంతరం వయోవృద్ధుల సంఘం నాయకులు జగన్నాథం మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఇంత చక్కటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు జిల్లాలోని వయో వృద్ధుల తరపున ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో వృద్ధులకు ఒక ప్రత్యేక వెల్ నెస్ కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని, జిల్లా కేంద్రం లో రీక్రియేషనల్ క్లబ్ ఏర్పాటు చేయాలని, సుదూర ప్రాంతాల నుండి వివిధ కార్యక్రమాల కొరకు జిల్లా కేంద్రానికి వస్తున్న వయో వృద్ధులకొరకు జిల్లా కేంద్రం లో వెయిటింగ్ హాల్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కస్తూర్బాగాంధీ వృద్ధాశ్రమం నిర్వాహకురాలు సామ్రాజ్యం మాట్లాడుతూ వృద్ధులు తమ పిల్లల పై ఫిర్యాదు చేయడానికి ముందుకు రాకపోవడం బాధాకరం. వారు ఎంత మూగ వేదన అనుభవిస్తున్నప్పటికినీ వారు తమ పిల్లల పరువు ప్రతిష్టల గురించి మాత్రమే ఆలోచిస్తున్నారు. చాలా సంవత్సరాల నుండి స్వచ్ఛందంగా మా సంస్థ తరపున దాదాపు 60 మంది వృద్ధులకు సేవలను అందించడం జరుగుతుంది. అనంతరం విశ్రాంత ఉ పాధ్యాయిని లక్ష్మీ కాంతమ్మ మాట్లాడుతూ కొడుకులు లేదా కోడళ్ళు ఎవరైనా సరే అత్త మామలను కూడా తమ స్వంత తల్లితండ్రుల లాగే చూసుకున్నట్లైతే సమాజంలో వయో వృద్ధులకు ఎలాంటి సమస్యలు ఉండవు. పిల్లలను సత్ప్రవర్తనతో పెంచితే ఏ ఓల్డ్ ఏజ్ హోమ్ లతో పనిలేదు అన్నారు. అనంతరం జిల్లా వైద్య అధికారి అల్లెం అప్పయ్య మాట్లాడుతూ ఈ సమావేశంలో వయోవృద్ధులు సూచించిన విధంగా జిల్లాలోని అన్ని ఆస్పత్రులలో వారికి ప్రత్యేక సేవలు అందిస్తామని అన్నారు. ముఖ్యంగా జిల్లా కేంద్రం లోని ఏరియా ఆస్పత్రిలో వెల్ నెస్ సెంటర్ ని ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తానని అన్నారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి జె. ఓంకార్ వ్యాఖ్యాతగా వ్యవహరించిన వయోవృద్ధుల సంక్షేమ చట్టం – 2007 లోని మౌళికాంశాలను క్లుప్తంగా వివరించారు. అనంతరం అవగాహన మరియు వినోదాల వారంలో భాగంగా 25.09.2024 నుండి 01.10.2024 వరకు జిల్లాలో వృద్ధులకు వివిధ అంశాల్లో నిర్వహించిన క్రీడల్లో ప్రతిభ చూపిన వయో వృద్ధులకు అదనపు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందించడం జరిగింది. అనంతరం వయోవృద్ధుల సంక్షేమం కొరకు పని చేస్తున్న వివిధ సంఘాల నాయకులను శాలువాతో సన్మానించడం జరిగింది. చివరగా వయో వృద్ధుల సంక్షేమానికి కట్టుబడి ఉంటామని ఇట్టి కార్యక్రమానికి విచ్చేసిన వారందరితో ప్రతిజ్ఞ చేయించడం జరిగింది.

# పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత





### ♦ ట్యూస్డే డ్రైడే కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్పర్సన్

ఆత్మకూర్, అక్టోబర్ 01 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డ్ లో వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ట్యూస్డే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి ఆత్మకూరు మున్సిపల్ చైర్పర్సన్ గాయత్రి రవి కుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డ్ లోని డ్రైనేజీల వెంబడి చెత్త చెదారం తొలగించి బ్లీచింగ్ పౌడర్ ను చల్లారు నీటిని ఎక్కువ అందులో ఉంచకూడదని ప్రజలు పరిసరాల పరిశుభ్రతపై తీసుకోవలసిన తగు జాగ్రత్తలు సూచనలు తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగరాజు, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ విజయభాస్కర్ రెడ్డి, వార్డు కౌన్సిలర్ మహేశ్వరి కార్యాలయ సిబ్బంది, ఆర్పీలు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రత అనేది నేరాలను తగ్గిస్తుంది

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. నారాయణ బాబు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, అక్టోబర్ 01 (తీన్మార్ న్యూస్): పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే మానసిక ఆరోగ్యం బాగుంటుందని, మానసిక ఆరోగ్యం బాగుంటే నేరం చేయాలనే ఆలోచన రాదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పి. నారాయణ బాబు అన్నారు. స్వచ్ఛత హై సేవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కోర్టు ప్రాంగణం వద్ద ప్రారంభం అయిన న్యాయ అవగాహన ర్యాలీ అంబెద్కర్ సెంటర్ నుండి తిరిగి జిల్లా ప్రధాన న్యాయస్థానం వరకు సాగింది. న్యాయవాదులు, కోర్టు సిబ్బంది మరియు విద్యార్థులను ఉద్దేశించి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రసంగించారు. జడ్జి మాట్లాడుతూ గౌరవ హై కోర్ట్ వారి ఆదేశాల మేరకు కోర్టు ప్రాంగణాల్లో స్వచ్ఛ్ హై సేవా కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. పరిశుభ్రత అనే సేవను అందరూ చేయాలనీ అప్పుడు దేశం మొత్తం శుభ్రంగా తయారవుతుందని అన్నారు. అను నిత్యం మనందరి కోసం శ్రమిస్తున్న పారిశుద్ధ కార్మికులను గౌరవించాలని జడ్జి సూచించారు. పారిశుద్ధ కార్మికులను జిల్లా ప్రధాన న్యాయమూర్తి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి మరియు న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే. జయరాం రెడ్డి, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్. రామచంద్రా రావు, అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శ్రీ కూనూరి సురేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీ బల్ల మహేందర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఏదులాపురం శ్రీనివాస్, కోర్టు సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ స్కాలర్షిప్, రిబర్స్మెంట్లను విడుదల చేయాలి

### – వేం నరేందర్ రెడ్డికి డిఎస్ఏ ఆధ్వర్యంలో వినతి అందచేత
### – డెమోక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కన్వినర్ కామగోని శ్రావణ్



వరంగల్ జిల్లా, అక్టోబర్ 01 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు ఎనమిది వేల కోట్ల పైగా పెండింగ్ లో ఉన్న ఫ్రీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ లను విడుదల చేయాలని అర్వనపల్లి గ్రామానికి విచ్చేసిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డిని డెమొక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేయడం జరిగింది.

ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రవణ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో విడుదల చేయకుండా ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ల బకాయిలతో కలుపుకుని ఇప్పటి వరకు దాదాపు ఎనమిది వేల కోట్ల పైచిలుకు బకాయిలు పెండింగ్లో ఉన్నాయని, పై చదువులకు వెళ్లే విద్యార్థులకు ఆయా కళాశాలలో సర్టిఫికెట్లు ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తు, ఫీజు కడితేనే సర్టిఫికెట్స్ ఇస్తామని బెదిరింపులకు గురిచేస్తున్నారని, స్కాలర్షిప్ల ఫీజు రీఎంబర్స్మెంట్లు రాకున్నా విద్యార్థులకు సర్టిఫికెట్స్ ఇవ్వాలని హైకోర్టు ఉత్తర్వులు ఉన్న కూడ విద్యార్థులను ఆయా కళాశాలల యజమాన్యాలు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తూన్నరని, స్కాలర్షిప్లు ఫీజు రియంబర్స్మెంట్ లపై ఆధారపడి చదువుతున్న లక్షలాది మంది విద్యార్థులలో బడుగు బలహీన వర్గాలకు చెందిన వారే ఎక్కువ కావడం వలన వారి ఆర్థిక పరిస్థితుల దృశ్య, విద్యార్థుల చదువులు మధ్యలో ఆగిపోకుండా వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ లను విడుదల చేయాలని డెమొక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ తరపున వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో సంఘ బాధ్యులు అభినయ్, షకీల్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..



### మస్తీపురం ప్రాథమిక పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

అమరచింత, అక్టోబర్ 01 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా అమరచింత మండలం మస్తిపురం గ్రామంలోని స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులు తీరొక్క పువ్వులతో బతుకమ్మను అలంకరించి బతుకమ్మ పాటలతో కోలాటాలు వేస్తూ బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. ఇట్టి కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగమణి ఉపాధ్యాయులు ఎస్పీ రాణి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బతుకమ్మ సంబరాలు





### – తిరొక్క పువ్వులతో వెలసిన బంగారు బతుకమ్మలు
### – శ్రీవాణి హైస్కూల్లో సంబరాలు

ఆత్మకూరు, అక్టోబర్ 01 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు కేంద్రంలోని స్థానిక శ్రీవాణి హైస్కూల్లో అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలు జరిగాయి. వేడుకలు భాగంగా పాఠశాల విద్యార్థులు తిరొక్క పువ్వులతో రంగురంగుల హంగులాలతో బతుకమ్మను అలంకరించి పాఠశాల విద్యార్థులు. అనంతరం పాఠశాల ఆవరణంలో పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులు బతుకమ్మ పాటలతో బొడ్డెమ్మలు వేశారు. ఇట్టి కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ లతా, గంగాధర్ పాఠశాల డైరెక్టర్ టీజే విశ్వేశ్వర్, అభిలాష ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల సమస్యల పరిష్కారానికై పోరాడేది కమ్యూనిస్టులే

**- పేదల కోసం ప్రాణాలర్పించిన చరిత్ర కమ్యూనిస్టులది**
**- ఈ దేశానికి కమ్యూనిస్టు విధానాలే ప్రత్యామ్నాయం**
**- సిపిఎం మండల కార్యదర్శి కందగట్ల అనంత ప్రకాష్**



పాలకీడు, అక్టోబర్ 01 (తీన్మార్ న్యూస్): ఈ దేశానికి కమ్యూనిస్టు విధానాలే ప్రత్యామ్నాయం అని,సమస్యల పరిష్కారం కోసం ప్రాణాలర్పించిన చరిత్ర కమ్యూనిస్టులది అని పాలకీడు సీపీఎం మండల కార్యదర్శి అనంత ప్రకాష్ అన్నారు. పాలకవీడు మండల కేంద్రంలో మంగళవారం పాలకవీడు సిపిఎం శాఖా మహాసభ మాజీ సర్పంచ్ మీసాల కాశయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం నికరంగా నిలబడి పోరాడేది ఎర్రజెండా సిపిఎం పార్టీ కమ్యూనిస్టులేనని ఆయన అన్నారు. ప్రజా సమస్యల పరిష్కరించే క్రమంలో జరిగిన పోరాటాలలో ప్రాణాలర్పించిన చరిత్ర కమ్యూనిస్టుల ది అని ఆయన తెలిపారు.పాలకవర్గాలు రాజకీయాలను వ్యాపారమయంగా చేసి ప్రజలను గ్రామంలో ముంచేత్తుతూ పాలను కొనసాగిస్తున్నారని ఆయన వాపోయారు. నేటి రాజకీయాల్లో కార్పొరేట్ శక్తులు డబ్బున్న వారు ప్రవేశించి రాజకీయాన్ని ఒక వ్యాపార కేంద్రంగా మార్చుకుని డబ్బుతో ఓటు కొని అధికార వచ్చిన తర్వాత డబ్బులు కూడా పెట్టుకునే పనుల్లో అవినీతికి పాల్పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కానీ కమ్యూనిస్టులు పదవులు ఉంటే పార్లమెంట్ అసెంబ్లీ వేదికగా ప్రజా సమస్యలపై గళం ఇప్పుతారని పదవులు లేకున్నా బయట ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆందోళనలు చేస్తారని తెలిపారు. పదవులు ఉన్నా లేకున్నా కమ్యూనిస్టులు ప్రజల పక్షమేనని ఆయన అన్నారు. బిజెపి ప్రభుత్వం ఈ దేశాన్ని హిందూ రాజ్యాంగా మార్చడానికి తన రహస్య ఎజెండా అమలుకు ప్రయత్నిస్తున్నదని బిజెపి యొక్క ప్రయత్నాలకు ప్రగతిశీల వామపక్ష లౌకిక శక్తులను ఐక్యపరిచి అడ్డుకట్ట వేయాలని పిలుపునిచ్చారు. పాలకవీడు మండల కేంద్రంలో వివిధ శాఖలకు ప్రభుత్వ భవనాలు లేక అద్దె భవనాలు నడుపుతున్నారని ఈమధ్య కాలంలోనే ప్రభుత్వ భవనాలకు గత మూడు నెలల క్రితం మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి శంకుస్థాపన చేశారని వెంటనే వాటి నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని ఆయన కోరారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యప కేంద్రాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా మార్చి డాక్టర్లను నర్సులను తగిన సిబ్బందిని కేటాయించి వైద్య సేవలు అందించే విధంగా మంత్రి కృషి చేయాలని ఆయన కోరారు.అనంతరం సిపిఎం పాలకవీడు గ్రామ శాఖ కార్యదర్శిగా మాతంగి ఏసురత్నంను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది

ఈ మహాసభలో పిఎసిఎస్ వైస్ చైర్మన్ పగడాల మట్టేష్ మాజీ సర్పంచ్ మీసాల కాశయ్య మాతంగి ఏసురత్నం దాసరి సైదులు పొదిల అంజి పొదిల సైదులు,పాస్టర్ సైదులు, మీసాల మట్టయ్య కుక్కడం వెంకటేశ్వర్లు, మీసాల సోములు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి మండలానికి ఒక ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

**♦ అధికారులతో అదనపు కలెక్టర్ సమావేశం**




మహబూబాబాద్ జిల్లా, అక్టోబర్ 01 (తీన్మార్ న్యూస్): మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు స్థానిక సంస్థలు, రెవెన్యూ లెనిన్ వత్సల్ టోప్పో, డేవిడ్, అడిషనల్ ఎస్పీ చెన్నయ్య, సంబంధిత అధికారులతో కలిసి (వానాకాలం) ఖరీఫ్ సీజన్ 24-25, సంవత్సరానికి జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఐకెపి 64, సహకార శాఖ 153, గిరిజన కోపరేటివ్ కార్పొరేషన్ 11, ఇతరులు ఆరు, మొత్తం (234) ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సిద్ధంగా ఉండాలని, ప్రభుత్వ సూచనల మేరకు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు, గన్ని సంచులు, ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్లు, ప్యాడి క్లీనర్స్, టార్పాలిన్లు, రవాణా కు లారీలు, తదితర సౌకర్యాలకు సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు.

**ప్రతి మండలానికి ఒక ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు**

ప్రభుత్వ సూచనల మేరకు సన్న, దొడ్డు ధాన్యం కేంద్రాలు వేరు, వేరుగా ఏర్పాటు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద హమాలీలను సిద్ధంగా ఉంచుకొని వైద్య క్యాంపులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు. రైతులకు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్, త్రాగునీరు, తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు, మహబూబాబాద్ ఆర్డీవోలు నరసింహారావు, అలివేలు, డిసిఓ వెంకటేశ్వర్లు, వ్యవసాయ శాఖ అధికారిని విజయనిర్మల, డిఎం సివిల్ సప్లై కృష్ణవేణి, డి ఆర్ డి ఓ మదన్మోహన్ రాజు, మెప్మా, మార్కెటింగ్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ పున ప్రారంభానికి చర్యలు తీసుకోవాలి

**■ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**





గణపురం, అక్టోబర్ 01 (తీన్మార్ న్యూస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన మిల్లెట్ (చిరుధాన్యాల) ప్రాసెసింగ్ యూనిట్ పున ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం గణపురం మండలం చిలుకూరు శివారులో మహిళా గ్రామ సమాఖ్య సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ ను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. యూనిట్ లోని యంత్రాలను పరిశీలించి, చిరు ధాన్యాలతో చేసిన ఆహారాలను రుచి చూశారు. చాలా బావుందని మహిళా సమాఖ్య సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చెల్పూరులో ఏర్పాటు చేసిన మహిళా మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ ను పున ప్రారంభించాలని తెలిపారు. 65 లక్షల రూపాయల వ్యయంతో యూనిట్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ కు మంచి పేరు ప్రఖ్యాతులు రావాలని రావాలని తెలిపారు. ప్రస్తుత మార్కెట్ లో మిల్లెట్ లకు మంచి డిమాండ్ ఉందని అన్నారు. మిల్లెట్ల ద్వారా చేసిన తిను బండారాలను మార్కెట్ లో విక్రయించొచ్చని తెలిపారు. ప్రభుత్వం తరపున మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ నిర్వహణకు సహకారం అందిస్తామని తెలిపారు. మిల్లెట్ యూనిట్ ద్వారా తయారు చేయబడిన ఆహార వస్తువులు జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాలకు, మహిళా శక్తి కాంటీన్లకు సరఫరా చేసే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. మార్కెటింగ్ సౌకర్యం కల్పనకు చర్యలు చేపట్టాలని డిఆర్డీఓకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిపిఓ నారాయణ రావు, డిఆర్డిఓ అవినాష్, డిపిఎం రవి, ఎస్బిఎం కోఆర్డినేటర్లు వెంకటేష్ ,భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తల ధర్నాగా మారిన బీఆర్ఎస్ రైతు ధర్నా

**- బీఆర్ఎస్ చేపట్టిన ధర్నాల్లో రైతులు ఎవరు లేరు**
**- కాంగ్రెస్ ప్రభుత్వం మీద రైతులకు విశ్వాసం ఉంది**
**- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గౌని యుగెందర్ రెడ్డి**



పెబ్బేరు, అక్టోబర్ 01 (తీన్మార్ న్యూస్): సోమవారం పెబ్బేరులో బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన రైతు ధర్నా కాస్త కార్యకర్తల ధర్నాలుగా మారిపోయాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గౌని యుగెందర్ రెడ్డి ఎద్దేవా చేశారు. అందుకే బీఆర్ఎస్ చేపట్టిన ధర్నాల్లో రైతులు ఎవరు పాల్గొనలేదన్నారు. అసలు ప్రతిపక్ష పార్టీ ఉనికి కోసమే ధర్నా చేపట్టిందంటూ బీఆర్ఎస్ పార్టీ నాయకులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక పెబ్బేరు పట్టణంలో చేసిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు చేపట్టిన ధర్నాకు ప్రజల నుంచి స్పందనే లేదన్నారు .కాంగ్రెస్ ప్రభుత్వం మీద రైతులు విశ్వాసం ఉంచారని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు ఒకేసారి రూ. 2 లక్షల రుణమాఫీ చేసిన ఘనత తమ కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ట్రాప్‌లో ఎవరు పడవద్దంటూ ఈ సందర్భంగా రైతులకు కాంగ్రెస్ నాయకులు యుగంధర్ రెడ్డి సూచించారు. అయినా బీఆర్ఎస్‌ను నమ్మే పరిస్థితుల్లో రైతులు లేరన్నారు.

# కార్పొరేట్ హెయిర్ సెలూన్ ను వ్యతిరేకిస్తూ నిరసన

**- నాయి బ్రాహ్మణుల పొట్ట కొట్టొద్దు**
**- కార్పొరేటర్ సెలూన్ ఏర్పాటుకు వ్యతిరేకంగా సంఘం ఆధ్వర్యంలో సమావేశం**



నేరేడుచర్ల, అక్టోబర్ 01 (తీన్మార్ న్యూస్): నేరేడుచర్ల మండల కేంద్రంలోని మండల నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో కార్పొరేటర్ హెయిర్ సెలూన్ ను వ్యతిరేకిస్తూ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షుడు మొగరాల వాసు మాట్లాడుతూ నేరేడుచర్లలో గత 30 సంవత్సరాలుగా నివసిస్తూ వృత్తిపరంగా హెయిర్ సెలూన్ ను నాయి బ్రాహ్మణ కుటుంబీకులు నిర్వహిస్తున్నారని వారి యొక్క వృత్తికి ఆటంకం కలిగిస్తూ గత కొంతకాలంగా ఇతర కులాలకు చెందిన వారు కార్పొరేటర్, హెయిర్ సెలూన్ ను ఏర్పాటు చేయడం దురదృష్టకరమని ఆయన అన్నారు. కార్పొరేటర్ హెయిర్ సెలూన్ వలన వృత్తిపరమైన నాయి బ్రాహ్మణులకు తగినంత పని లేక ఆర్థికంగా తీవ్ర నష్టం జరుగుతుందని చిత్తశుద్ధితో తక్షణమే ఇతర కులాలవారు ఇట్టి వృత్తిని మానుకోవాలని ఆయన అన్నారు. అదేవిధంగా నాయి బ్రాహ్మణులలో ఆర్థికంగా బలపడిన వారు కూడా కార్పొరేట్ హెయిర్ సెలూన్ మానోకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఒక చట్టం జీవో చేయాలి మానవుడు పుట్టుక నుండి చావు వరకు సేవలందిస్తున్న వారికి చివరికి వృత్తిపరంగా అన్యాయం జరుగుతుంది. నాయి బ్రాహ్మణ ను రాజకీయ ఆర్థికంగా విద్యా వైద్యం అవకాశాలు కల్పించాలి. 50 సంవత్సరాల పైబడిన వారికి పింఛన్ మరియు హెల్త్ కార్డ్స్ ఏర్పాటు చేయాలని కోరారు. నేరేడుచర్ల నాయి బ్రాహ్మణ సేవా అధ్యక్షులు మొగరాల వాసు, గౌరవ అధ్యక్షులు మొగరాల సత్య నారాయణ, ప్రధాన కార్యదర్శి కాపర్తి శీను, ఉపాధ్యక్షులు రాచమల్ల కృష్ణ, కార్యదర్శి మేడిపల్లి నాగయ్య, కోశ అధికారి. పిల్లుట్ల లక్ష్మణ్, వీరస్వామి, ఉదయ్, రాంప్రసాద్ తిరుమలగిరి నాగేశ్వరరావు, తిరుమలగిరి నాగయ్య, మోగరాల సుందర్, పయ్యావుల వెంకన్న, పేరూరి నాగయ్య, నాగరాజ్, సతీష్, తిరుమలగిరి ఉపేందర్, కార్తీక్, నాగరాజు, వీరబాబు, ధన మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# టిజిఎస్ఎస్ కు ఎంపికైన విద్యార్థినీలు

**♦ అభినందించిన స్కూల్ కరస్పాండెంట్ ఖాజామైనద్దిన్**



దేవరకద్ర, అక్టోబర్ 01(తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా మదనాపురం మండలం దుప్పల్లి గ్రామంలో భారతి టాలెంట్ స్కూల్ లో విద్యార్థినీలు పల్లెపాగ శ్రావ్య,అక్కల శ్రీనిజ తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ కు ఎంపికయ్యారు. మంగళవారం పాఠశాల కరస్పాండెంట్ ఎండి ఖాజా మైనద్దిన్ ఉపాధ్యాయ సిబ్బందితో కలిసి వారిని అభినందించి మాట్లాడారు. ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఆటల పోటీలలో ప్రతిభను కనపరచి హాకింపేటలో రాష్ట్ర స్థాయి ఆటలో ఆడారని గుర్తు చేశారు. కోచ్ ల సమక్షంలో అత్యంత రూపకల్పనలో ఏర్పాటు చేసిన ఈవెంట్స్ లలో కూడా ఉత్తమ ప్రతిభను కనపరచి జిల్లాలోనే ఐదు మంది బాలబాలికల్లో దుప్పల్లి గ్రామ భారతి టాలెంట్ స్కూల్ విద్యార్థినీలు ఉండటం ఎంతో సంతోషకరమన్నారు. రాష్ట్రంలో హకింపేట, కరీంనగర్, ఆదిలాబాద్ మూడు చోట్ల ఉన్న స్పోర్ట్స్ పాఠశాలలలో మన పాఠశాల బాలికలకు హకింపేట స్పోర్ట్స్ స్కూల్ లో సీట్లు దక్కడం హర్షణీయం అని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది రజియా బేగం, సత్యావతమ్మ, అలివేలు, మమత, తదితరులు పాల్గొన్నారు.

# నారాయణ పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**- తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ**
**- నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ కోహిత**





మిర్యాలగూడ, అక్టోబర్ 01 (తీన్మార్ న్యూస్): దసరా సెలవుల నేపథ్యంలో మిర్యాలగూడ మండల కేంద్రంలోని నారాయణ హై స్కూల్ లో మంగళవారం ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీలు, మహిళా ఉపాధ్యాయులు వివిధ రకాల పుష్పాలతో బతుకమ్మలను సర్వాంగా సుందరంగా అలంకరించి గౌరమ్మకు ప్రత్యేక పూజలు చేసి కలిసి బతుకమ్మ ఆడారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే సంబురాల్లో చిన్నారులు ఉత్సాహం పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కోహిత మాట్లాడుతూ తెలంగాణ సాంప్రదాయ పండుగలను ప్రతి ఒక్కరూ ఘనంగా జరుపుకుంటారని, మన రాష్ట్ర పండుగ అయిన బతుకమ్మ పండుగ గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. అలాగే విద్యార్థులు బాగా చదివి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు. అనంతరం పాఠశాల ఏవో సైదిరెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ వేడుకలు విద్యార్థులలో సమైఖ్యత, పరస్పర



సహకారం, మానసిక విలువలు, వికాసాన్ని పెంచుతాయని, భారతీయ సంస్కృతి సంప్రదాయాలను విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు పండుగలను పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏడి వెంకన్న, వైస్ ప్రిన్సిపాల్స్ అనూష, శ్వేత ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# పేదలందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

**సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పారేపల్లి శేఖర్ రావు**



నేరేడుచర్ల, అక్టోబర్ 01 (తీన్మార్ న్యూస్): అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పారేపల్లి శేఖర్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నేరేడుచర్ల మండలంలోని మేడారం గ్రామంలో జరిగిన సిపిఎం పార్టీ గ్రామ మహాసభలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ముఖ్యంగా పేద ప్రజలు రేషన్ కార్డులు లేక సొంత గృహాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, గత పది సంవత్సరాల నుండి తెలంగాణలో రేషన్ కార్డులు జారీ చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే రేషన్ కార్డుల జారీ చేపట్టాలన్నారు. రైతు భరోసా ఎకరాకు 7500 చొప్పున వెంటనే విడుదల చేసి రైతాంగాన్ని అప్పుల పాలు కాకుండా ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి సిరికొండ శ్రీను సీనియర్ నాయకులు అరబండి శ్రీరామయ్య, అరబండి భూషయ, కట్టా మధు, మామిడి నాగ సైదులు, మామిడి జానకి రాములు, లొడంగి వీరబాబు, సెనగాని సైదులు, మండలి భిక్షం, ఖమ్మంపాటి పాపులు, అరి బండి జగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో బతుకమ్మ సంబరాలు



నేరేడుచర్ల, అక్టోబర్ 01 (తీన్మార్ న్యూస్): దిర్శించర్ల ఉన్నత పాఠశాల మరియు ప్రాథమిక పాఠశాలల్లో ఉమ్మడిగా బతుకమ్మ సంబరాలను పాఠశాల విద్యార్థులు మరియు పాఠశాల ఉపాధ్యాయ బృందం బతుకమ్మ సంబరాలను పాఠశాలలో ఘనంగా జరుపుకున్నారు బతుకమ్మ సంబరాలను విద్యార్థులు ఉపాధ్యాయ బృందం బతుకమ్మ పాటలతో అబ్బురంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల జిహెచ్ఎం పి సత్యనారాయణ రెడ్డి ప్రాథమిక పాఠశాల ఎల్ఎఫ్ఎల్ హెడ్మాస్టర్ మామిళ్ల శ్రీనివాస్ రెడ్డి సీనియర్ ఉపాధ్యాయులు జి శ్రీదేవి వి శ్రీనివాసరావు జై శ్రీనివాసరావు చల్లా ప్రభాకర్ రెడ్డి ఏ అశోక్ ఎన్ విజయకుమార్ బి శ్రీనివాస్ నూర్జహాన్ సైదాబీ సబియా పి సంధ్య వి నాగమణి నెల్సన్ రాములు ఇందిరా అంగన్వాడీ టీచర్స్ విద్యార్థులతో కలిసి బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించడం జరిగింది.

## పాఠశాలలో బతుకమ్మ వేడుకలు



పెబ్బేరు, అక్టోబర్ 01(తీన్మార్ న్యూస్): పిత్రు అమావాస్య పెద్దరమాసం నుండి మొదలయ్యే బతుకమ్మ ఉత్సవాలను పెబ్బేరు మండలంలోని ఆయా గ్రామాల పాటశాలలో బాలబాలికలు వివిధ రకాల పూలను తీసుకువచ్చి పాఠశాలలో బతుకమ్మలను పేర్చి అట్టహాసంగా బతుకమ్మ సంబరం జరుపుకున్నారు. రంగాపురం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినీలు బతుకమ్మ పాటలకు అనుగుణంగా నృత్యం చేశారు. పెబ్బేరు పట్టణంలో మాస్టర్ మైండ్స్ పాఠశాల నందు ఉపాధ్యాయులు బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా జరిపారు. బుధవారం నుండి పాఠశాలలు, కళాశాలకు దసరా సెలవుల సందర్భంగా చివరి పనిదినం కావడంతో విద్యాసంస్థలో అందరూ కలిసి జరుపుకున్న ఈ పండుగ సందర్భంగా, బతుకమ్మ పాటలు, విద్యార్థుల కేరింతలతో ఆ పాఠశాలలో బతుకమ్మ సంబరాలు అంబరాన్ని అంటాయి. గ్రామస్తులు వీక్షించి ఆనందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల భద్రతే షీ టీం లక్ష్యం

కమాన్ పూర్: మహిళల భద్రతే షీ టీం లక్ష్యమని చీటీ ఇన్చార్జులు ఏఎస్ఐ మల్లన్న స్నేహలతలు అన్నారు.
రామగుండం సి.పి ఆదేశాల మేరకు ధర్మారం లోని కేజీబీవీ స్కూల్ విద్యార్థులకు షీ టీం ఇంచార్జ్ ఏ ఎస్ ఐ మల్లన్న ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు నిర్వహించడం జరిగినది. అందులో భాగంగా షీ టీం ఉమేన్ కానిస్టేబుల్ స్నేహలత మాట్లాడుతూ మహిళల భద్రత మరియు ఆన్లైన్ మోసాలపై మరియు ఆంటీ డ్రగ్స్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్ మరియు ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిరంతరంగా ఉంచడం జరుగుతుందని , ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే అత్యాశకు పోయి సైబర్ క్రైమ్ ఆన్లైన్ మోసాలు ,లోన్ యాప్స్ గురవుతున్నారని వాటికి జోలికి పోకుండా ఉండాలని, ఎవరైనా ఆన్లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సమాచారం ఇవ్వాలని, అలాగే మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100 నంబర్ కు డయల్ చేయాలని తెలిపారు. మరియు ఆకతాయిల నుండి ఎలా రక్షణగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో షీ టీం సిబ్బంది సురేష్ తో పాటు గా మేడం విజయలక్ష్మి మరియు ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

## స్కూల్ లో దొంగలు పడ్డారు

నిర్మల్: నిర్మల్ జిల్లా కేంద్రంలోని వైయస్సార్ నగర్ కాలనీ లో గల ప్రభుత్వ ప్రాథమిక ఉర్దూ మీడియం, తెలుగు మీడియం పాఠశాలలో నిన్న అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగలు పాఠశాల గేటు, డోరు తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించి బీరువాలో గల ల్యాప్టాప్ తో పాటు విద్యార్థులు కూడా పెట్టుకున్న వెయ్యి రూపాయల నగదును దొంగలించుకుని పారిపోయారు, పాఠశాలలోని సీలింగ్ ఫ్యాన్ లను సైతం దొంగిలించడానికి ప్రయత్నం చేయగా వీలు కాక పోవడంతో ఉదయించారు
ఉదయం పూట పాఠశాలకు వచ్చిన సిబ్బంది తాళాలు పగలగొట్టి ఉండడాన్ని చూసి గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు, దీంతో ఘటనస్థలికి చేరుకున్న పోలీసులు దొంగతనం జరిగిన తీరును పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు

# ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం వివరాలు పక్కాగా సేకరించాలి

**- ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తులు పరిష్కరించాలి**
**- రెండు పడక గదులు పంపిణీ చేయాలి**
**- కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి**
**- వీడియో కాన్ఫరెన్స్లో రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**
**- హాజరైన కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**



మహబూబాబాద్ జిల్లా, అక్టోబర్ 01 (తీన్మార్ న్యూస్): ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం వివరాలు పక్కాగా సేకరించాలని ఆయా జిల్లా కలెక్టర్లను రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డు, ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తులు, రెండు పడక గదులు, కొనుగోలు కేంద్రాల ఏర్పాటు అంశాలపై ఆయా జిల్లాల కలెక్టర్లతో మంత్రి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం నిర్వహించగా, జిల్లా నుంచి అదనపు కలెక్టర్లు స్థానిక సంస్థలు, రెవెన్యూ లెనిన్ వత్సల్ టోప్పో, డేవిడ్, లతో కలిసి కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ హాజరయ్యారు. ఈ నెల 3వ తేదీ నుంచి ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం పైలట్ ప్రాజెక్టు కింద రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలోని ఒక మున్సిపల్, గ్రామంలో కుటుంబాల వివరాలు ఇంటింటికీ తిరిగి సేకరించాలని, దీనికి నోడల్ ఆఫీసర్ ను నియమించాలని సూచించారు. సర్వే సందర్భంగా ఆయా కుటుంబాల్లో పుట్టిన, మరణించిన వారి వివరాలు తీసుకొని ఎంట్రీ చేయాలని ఆదేశించారు. ఈ నెల 8 వ తేదీ వరకు ఇది పూర్తి చేయాలని, 9 వ తేదీ స్క్రూటినీ ఉంటుందని, 10 వ తేదీన రిపోర్ట్ సబ్మిషన్ ఉంటుందని తెలిపారు. ఈ పైలట్ ప్రాజెక్టు ఆధారంగా రాష్ట్ర వ్యాప్తంగా మిగితా సర్వే పనులపై ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. అనంతరం ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తులు ఏ ఏ జిల్లాలో ఎన్ని ఉన్నాయి? ఎన్ని పూర్తి చేశారో అడిగి తెలుసుకున్నారు. ఆయా దరఖాస్తులు నిబంధనల ప్రకారం పరిష్కరించాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ని రెండు పడక గదులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయో వివరాలు తెలుసుకున్నారు. ఇంకా ఏమైనా పనులు చేయాల్సి ఉంటే వెంటనే పూర్తి చేసి, త్వరలో పంపిణీ చేసేందుకు సిద్ధం చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. సన్న వడ్లకు రాష్ట్ర ప్రభుత్వం క్వింటాలుకు రూ. 500 అదనంగా అందజేయనుందని తెలిపారు. సన్న, దొడ్డు వడ్ల సేకరణకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సన్న వడ్ల లో దొడ్డు వడ్లు కలవకుండా చూసుకోవాలని, వ్యవసాయ అధికారి పరిశీలించిన తర్వాత వాటిని పంపాలని పేర్కొన్నారు. రైతులకు ఏ ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి, సీఎస్ ఆదేశించారు.
ఈ సమావేశంలో తొర్రూరు, మహబూబాబాద్ ఆర్డీవోలు నరసింహారావు, అలివేలు, ఏడిఎస్ఎల్ఆర్ నరసింహ మూర్తి , జెడ్పిసిఓ నర్మద, డిపిఓ హరిప్రసాద్, మున్సిపల్ కమిషనర్లు శాంత కుమార్, వెంకటేశ్వర్లు, నరేష్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల అధికారి కృష్ణవేణి, డీటీసీపీఓ తదితరులు పాల్గొన్నారు.

# పోటీ పరీక్షలకు విద్యార్థులు పగడ్బందీగా సన్నద్ధం కావాలి

**- 7, 8, 9, 10వ తరగతి విద్యార్థులకు జీకే బుక్కులు పంపిణీ**
**- తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్ రెడ్డి**




తాడ్వాయి, అక్టోబర్ 01 (తీన్మార్ న్యూస్): పోటీ పరీక్షలో విజయం సాధించే దిశగా విద్యార్థులు పగడ్బందీగా సన్నద్ధం కావాలని తాడ్వాయి ఎస్సై ననిగంటి శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని 12 ప్రభుత్వ పాఠశాలలో 7, 8, 9, 10వ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్ (జీకే) బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలకు నేటి నుండి, రెండవ తారీకు నుండి దసరా సెలవులు ఉన్నందున విద్యార్థులు చెడు అలవాట్లకు చెడు వ్యసనాలకు లోను కాకుండా సెలవుల్లో జనరల్ నాలెడ్జి పుస్తకాలు చదివి జనరల్ నాలెడ్జిలో తెలివితేటలు పెంచుకోవాలని సూచించారు. పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని తెలిపారు. సెలవు దినాల్లో చెరువులు కుంటల వద్దకు ఈతకు వెళ్ళరాదని సూచించారు. దసరా సెలవులు ముగిసిన అనంతరం అక్టోబర్ నెల చివర్లో నవంబర్ నెల మొదటి వారంలో ఆయా పాఠశాలలోని ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులతో జనరల్ నాలెడ్జ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన 30 మంది విద్యార్థినీ విద్యార్థులకు పోలీస్ ఉన్నతాధికారుల చేత మూమెంట్, బహుమతులు ప్రధానం చేయునట్లు తెలిపారు. విద్యార్థినిలు దసరా సెలవు దినాలలో చెడువేషణాలకు లోను కాకుండా జీకే బుక్స్ రిపేరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నేర్చుకున్న జనరల్ నాలెడ్జ్ పోటీ పరీక్షలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, స్థానిక పోలీసులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందజేత

ఆత్మకూర్, అక్టోబర్ 01 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం వీర రాఘవపురం గ్రామ బిఆర్ఎస్ ఎస్సీ సెల్ వెంకటన్న మాతృమూర్తి శంకరమ్మ అనారోగ్య కారణం చేత మృతి చెందారు. ఇట్టి విషయాన్ని తెలుసుకున్న ఆత్మకూరు మండల బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ఎం.రవి కుమార్ యాదవ్ శంకరమ్మ పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తము ఐదువేల రూపాయల ఆర్థిక సహాయని అందజేశారు. వీరి వెంట ఆత్మకూరు మున్సిపల్ కౌన్సిలర్ మండ్ల రామకృష్ణ, ఆత్మకూరు మండలం బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వీరేశలింగం, రఘు వర్ధన్ రెడ్డి, రేచింతల సింగిల్ విండో అధ్యక్షులు లక్ష్మీ కాంత్ రెడ్డి,మాజీ ఉపసర్పంచ్ శారద నరేష్, బి ఆర్ ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు పి కొండన్న, ఉపాధ్యక్షులు మొగిలన్న,యూత్ ప్రెసిడెంట్ మహేష్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# బస్సు ప్రయాణీకులకు బిగ్ షాక్..

హైదరాబాద్: అక్టోబర్ 1 నుంచి టికెట్లు బుక్ చేసుకుంటే డబుల్ ఛార్జీలు చెల్లించాల్సిందే. ఇప్పటివరకు హైదరాబాద్ నుంచి విశాఖపట్టణానికి నాన్ ఏసీ బస్సులో రూ.1000కి టికెట్ లభిస్తే.. రేపు అదే బస్సులో టికెట్ రూ.1500 నుంచి రూ.2000కు పెరగనుంది. మీరు వారంతాల్లో లేదా పండుగలకు ఊరువెళ్లాలంటే ప్రయివేట్ ట్రావెల్స్ బస్సుల్లో ప్రయాణిస్తున్నారా.. ఆర్టీసీతో సమాన ధరలకే మీరు ఇప్పటివరకు టికెట్లు బుక్ చేసుకున్నారా.. అయితే మీకు ఇది తప్పకుండా బ్యాడ్ న్యూస్. ఇక నుంచి మీ జేబులకు చిల్లు పడనుంది. ఓ వైపు దసరా సీజన్ ప్రారంభం కానుండటంతో ప్రయివేట్ ట్రావెల్స్ టికెట్ల ధరలను అమాంతం పెంచేశాయి. దాదాపు వంద నుంచి రెండు వందల శాతం ధరలను పెంచేశాయి. పండుగకు 10 రోజుల ముందు నుంచే పెరిగిన టికెట్ల ధరలు అందుబాటులోకి రానున్నాయి. అక్టోబర్ 1 నుంచి టికెట్లు బుక్ చేసుకుంటే డబుల్ ఛార్జీలు చెల్లించాల్సిందే. ఇప్పటివరకు హైదరాబాద్ నుంచి విశాఖపట్టణానికి నాన్ ఏసీ బస్సులో రూ.1000కి టికెట్ లభిస్తే.. రేపు అదే బస్సులో టికెట్ రూ.1500 నుంచి రూ.2000కు పెరగనుంది. అక్టోబర్ 4,5,6 తేదీల్లో ఈ టికెట్ ధరలు మరింత ఎక్కువగా ఉండనున్నాయి. అంతేకాదు నవంబర్లోనూ బస్సు టికెట్ ధరలు అధికంగా చూపిస్తున్నాయి. ఎటువంటి పండుగలు లేకపోయినా నవంబర్, డిసెంబర్ నెలలో ఏసీ సీటర్ హైదరాబాద్ నుంచి విశాఖకు రూ.2900 ఉండగా.. స్లీపర్ రూ.3,100 చూపిస్తుంది. ఇదే బస్సులో సెప్టెంబర్ 30వ తేదీన స్లీపర్ టికెట్ ధర రూ.1200 ఉండగా నవంబర్, డిసెంబర్లో దాదాపు రూ.3,000 చూపిస్తుంది. ఇదే బస్సులో అక్టోబర్ 1న స్లీపర్ టికెట్ రూ.1400 చూపిస్తుంది. అక్టోబర్ 1 నుంచి ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు టికెట్ ధరలు భారీగా పెరగనున్నాయి.
హైదరాబాద్ నుంచి యానం, హైదరాబాద్ నుంచి విశాఖపట్టణం వెళ్లే ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు ధరలు సరాసరి సెప్టెంబర్ 30వ తేదీన నాన్ ఏసీ టికెట్ రూ.800 నుంచి 1500 వరకు ఉండగా.. అక్టోబర్ ఒకటి నుంచి ఒక్కో టికెట్పై రెండు వందల నుంచి ఐదు వందల వరకు పెరగనుంది. హైదరాబాద్ నుంచి విశాఖపట్టణం వరకు ఒక్కో టికెట్పై రూ.300 నుంచి 500 వరకు పెరగనుంది. ఏపీఎస్ఆర్టీసీ, టీఎస్ఆర్టీసీ బస్సులో అక్టోబర్ 5వ తేదీన ఏసీ స్లీపర్ టికెట్ రూ.1500 నుంచి రూ.1700 ఉండగాఅదే తేదీన ప్రయివేట్ ట్రావెల్స్లో స్లీపర్ టికెట్ ధర రూ.3వేల వరకు ఉంది. ప్రధానంగా దసరా పండుగ నేపథ్యంలో బస్సు టికెట్ ధరలు భారీగా పెరగనున్నాయి. ఓవైపు రైలు టికెట్లు ఖాళీ లేకపోవడం, స్పెషల్ ట్రైన్స్లో టికెట్లు మొత్తం బుక్ కావడంతో తప్పకుండా ప్రయాణం చేయాల్సిన వ్యక్తులు బస్సులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఆర్టీసీ బస్సులు పరిమిత సంఖ్యలో ఉండటంతో ఇక ప్రయివేట్ ట్రావెల్స్లోనే ప్రయాణం చేయడం అనివార్యం కావడంతో బస్సు టికెట్ ధరలను పెంచినట్లు తెలుస్తోంది.

## డీఎస్సీలో ఆత్మకూరు అభ్యర్థి టాప్ వన్



ఆత్మకూర, అక్టోబర్ 01 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన చిన్న బట్టల వ్యాపారి ఖాజ ఫిర్ కుమారుడు మహమ్మద్ పాషా తెలంగాణ డీఎస్సీ ఫలితాలలో వనపర్తి జిల్లా నందు న్కూల్ అసిస్టెంట్ మ్యాథమెటిక్స్ సబ్జెక్టులో మొదటి స్థానం సాధించాడు. మార్కులు 73.93 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచాడు.దీంతో పట్టణవాసులు పలువురు మహమ్మద్ పాషా కు అభినందనలు తెలిపారు.

## కరెంటు సమస్యలపై తహసీల్దారుకు వినతిపత్రం



పెబ్బేరు, అక్టోబర్ 01 (తీన్మార్ న్యూస్): పెబ్బేరు మండలం శాఖాపూర్ (వై) గ్రామంలో కరెంటు కోతలు ఎక్కువై కరెంటు ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొన్నది. నిరంతరం కరెంటు కోతలతో గ్రామ ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, శాఖాపూర్ గ్రామానికి కరెంటు కష్టాలు తొలగిపోవాలంటే తోమాలపల్లె సబ్ స్టేషన్ త్వరగా ప్రారంభించి శాఖాపూర్ (వై),గ్రామంతోపాటు తోమాలపల్లె, రాంపురం, రామమ్మపేట, గ్రామాల కూడా కరెంటు సమస్యలను తీర్చాలని తహసీల్దార్, విద్యుత్ ఏఈ లకు వారి కార్యాలయా లలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో శాఖాపూర్ గ్రామ ప్రజలు వి.వెంకటన్న గౌడ్, సందకేశవ్, పరమేష్ నాయి, గువ్వలగోపి, మరాటిరాకేష్, వడ్లవెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## బీఎస్యు జిల్లా కన్వీనర్ గా మచ్చ పవన్



హన్మకొండ, అక్టోబర్ 01 (తీన్మార్ న్యూస్): హనుమకొండ, జిల్లా కన్వీనర్ గా వేలం పెల్లి గ్రామానికి చెందిన మచ్చ పవన్ నూ ఎన్నుకున్నట్టు బహుజన స్టూడెంట్స్ యూనియన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు మంద సురేష్ ప్రకటించడం జరిగింది. కమిటీని ఉద్దేశించి సురేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అనేక హామీలు ఇచ్చి అమలు చేయకపోవడంలో విఫలమైందన్నారు. విద్యాశాఖకు మంత్రిని కేటాయించకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి కాలయాపన చేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో స్కూళ్లల్లో కాలేజీలలో ఫీజులు నియంత్రణ కమిటీని ఏర్పాటు చేసే విధంగా చొరవ తీసుకోవాలని కోరారు విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఐదు లక్షల విద్య అర్హత కార్డు అమలు చేయాలన్నారు. ప్రతి మండలంలో ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కమిటీని ఉద్దేశించి అనేక సమస్యలపై మంద సురేష్ మాట్లాడడం జరిగింది.

## హైదరాబాద్ లో ముజ్రా పార్టీ

హైదరాబాద్: టాస్క్ ఫోర్స్ పోలీసులు హైదరాబాద్ నగరంలో ముజ్రా పార్టీని భగ్నం చేశారు. మొత్తం 12 మందిని టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిలో నలుగురు ట్రాన్స్జెండర్ యువతులు, 8 మంది యువకులు ఉన్నారని తెలిపారు. పాతబస్తీ బండ్లగూడలో ముజ్రా పార్టీ జరుగుతుందని సౌత్ జోన్ కమిషనర్ టాస్క్ ఫోర్స్ టీమ్ కు సమాచారం అందింది. బండ్లగూడ గౌస్నగర్లోని లేక్వ్యూ హిల్స్లో ఓ ఫ్లాట్ లో గుట్టు చప్పుడు కాకుండా అసాంఘిక కార్యకలాపాలకు ప్లాన్ చేశారు నిర్వాహకులు. ముజ్రా పార్టీ నిర్వహించి, అందులో అశ్లీల నృత్యాలు చేపిస్తున్నారు. సాధారణంగా ఇతర రాష్ట్రాల నుంచి యువతలను రప్పించి ఇలాంటివి చేస్తుంటారు. లేకపోతే డబ్బు కోసం ఆశచూపి స్థానిక యువతులను, జిల్లాల నుంచి సిటీకి వచ్చే యువతులతో ఇలాంటివి చేపిస్తారు.
కానీ ఇక్కడ జరిగింది వెరైటీ. ట్రాన్స్ జెండర్లతో అసభ్యకరమైన నృత్యాలు వేపిస్తుండగా, యువకులు వారితో కలిసి చిందులు వేస్తూ ఎంజాయ్ చేయసాగారు.పెద్దగా సౌండ్ పెట్టుకుని, తమకు ఇష్టంవచ్చినట్లుగా నిర్వాహకులు ముజ్రా పార్టీకి ప్లాన్ చేశారు. సరిగ్గా అదే సమయంలో టాస్క్ ఫోర్స్ అక్కడికి వెళ్లి అసభ్యకరంగా ఉండి, చిందులు వేస్తున్న వారిని అరెస్ట్ చేసి ముజ్రా పార్టీని భగ్నం చేశారు. నలుగురు ట్రాన్స్ జెండర్లు, ఎనిమిది మంది యువకులను అరెస్ట్ చేసి పీఎస్ కు తరలించారు. ఎప్పటినుంచి ఇది జరుగుతోంది, గతంలోనూ నిర్వహించారా అనే వివరాలపై ఆరా తీస్తున్నారు. పార్టీలో డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలు తీసుకున్నారా అనే కోణంలోనూ విచారణ చేపట్టారు.

# కార్మిక హక్కులు కాలరాయడం దేశద్రోహమే

**- వారి శ్రమేలేకుంటే అభివృద్ధి అసాధ్యం**

**- శ్రామికులు బాగుంటేనే దేశ ఆర్థిక వ్యవస్థ మెరుగు**

**- కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగభద్రత, హక్కులు కల్పించాల్సిందే : సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు**

**- యాజమాన్యాల ఒత్తిడితోనే కనీస వేతనాలు పెంచడం లేదు : పాలడుగు భాస్కర్**

**- సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ధర్నా**



హైదరాబాద్: పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తల కోసం పాలకులు కార్మికుల హక్కులను కాలరాయడం దేశద్రోహమే అవుతుందని సీఐటీయూ అఖిలభారత కోశాధికారి ఎం.సాయిబాబు అన్నారు. దేశంలో కార్మికులకు భద్రత లేకుంటే పారిశ్రామిక రంగానికి, దేశ ఆర్థిక వ్యవస్థకు స్థిరత్వం ఉండదని నొక్కి చెప్పారు. కార్మికులు, కూలీలు లేకుండా దేశ అభివృద్ధి ఎలా సాధ్యమని ప్రశ్నించారు. దేశాభివృద్ధిలో కీలకంగా మారిన కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఇతర విభాగాల కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం, హక్కులు కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనాలి వ్వాలనీ, కార్మిక చట్టాలు అమలు చే యాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ లోని రాష్ట్ర కార్మిక శాఖ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడు తూ కార్మికులకు భద్రత, యూనియన్లు అవసరం లేదన్నట్టు కేంద్రంలోని బీజేపీ కూటమి ప్రభుత్వం వ్యవహరిం చడాన్ని తప్పుబట్టారు. కార్మికులు లేకుంటే పారిశ్రా మికవేత్తలకు బతుకు లేదనీ, దేశ ఆర్థిక వ్యవస్థ నిలబడదని చెప్పారు. ప్రతి రంగంలోనూ కాంట్రా క్టు కార్మికులు పని చేస్తున్నారనీ, వారి శ్రమ లేకుండా దేశ ఆర్థికవ్యవస్థ ఎద గడం ఎలా సాధ్యమని ప్రధానిని ప్రశ్ని ంచారు. పోరాటాల ద్వారా సాధించు కున్న కనీస వేతనాలు, గ్రాట్యూటీ, పీఎఫ్, బోనస్ తదితర హక్కులను మోడీ సర్కారు కోడ్‌ల పేరుతో కాల రాయాలని చూస్తున్నదని విమర్శించా రు. 8 గంటల పని విధానాన్ని 12 గంటకు పెంచడం దుర్మార్గమన్నారు. యజమానులకు అనుకూలంగా కార్మిక శాఖను మార్చటాన్ని తప్పుబట్టారు. పర్మినెంట్ ఉద్యోగ వ్యవస్థను క్రమంగా తగ్గిస్తూ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, క్యాజువల్, తాత్కాలిక, డైలీవేజ్, అప్రెం టీస్, పీస్ రేటెడ్, హౌమ్ బేస్డ్ వర్కర్ల విధానాలతో కార్మికులను శ్రమ దోపిడీకి గురి చేస్తోందని వాపోయా రు. మోడీ సర్కారు అప్రెంటీస్ లను 30 శాతం పెంచుకోవడానికి అవకాశ మిచ్చిందని విమర్శించారు.

ఆరు, మూడు నెలల కాలానికి ఒప్పందంతో ట్రైనీ వ్యవస్థను విస్తరిస్తూ శాశ్వత కార్మికులకు అన్యాయం చేయాలని చూస్తున్న తీరును వివరించారు. దీంతో రెగ్యులర్ ఉద్యోగుల సంఖ్య ఐదు శాతానికి పడి పోయిందన్నారు. పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక వేత్తలకు రాయితీలపై రాయితీలిస్తూ ఉత్పత్తిలో కీలకంగా ఉన్న కార్మికులకు మాత్రం కనీస వేతనాలు పెంచడం లేదని విమ ర్శించారు. వలస కార్మిక చట్టం ప్రకా రం వేతనాలు, ఉద్యోగ భద్రత, నివా సం, ఆరోగ్యం లాంటి సౌకర్యాలు అమ లు కావడం లేదన్నారు. వారికి రక్షణ కల్పించే చర్యలకు కార్మిక శాఖ పూను కోవాలని కోరారు. పర్మినెంట్ ఉద్యోగు లతో సమానంగా పనిచేస్తున్న కాంట్రా క్టు, ఔట్‌సోర్సింగ్, ఇతర విభాగాల కార్మికులకు సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికుల ఉద్యోగాలకు భద్రత కల్పించాలని కోరారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాల్సి ఉ ండగా కార్మిక శాఖ రూ.18 వేలు నిర్ణయించిందనీ, యాజమాన్యా ల ఒత్తిడితో దాని నుంచీ కాంగ్రెస్ సర్కారు వెనక్కి తగ్గిందని విమర్శిం చారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, ఔట్ సో ర్సింగ్, ఇతర విభాగాల కార్మికుల సమ స్యలు పరిష్కరించాలనీ, వారికి ఉద్యోగ భద్రత కల్పించి రూ.26 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించ కుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధా న కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, ఎస్వీ.రమ, జె. మల్లిఖార్జున్,కె. ఈశ్వర్‌రావు, జె.చంద్ర శేఖర్, వీఎస్. రావు,రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు, రాష్ట్ర కార్యదర్శు లు జె. వెంకటేష్, బి. మధు, పద్మశ్రీ, కూరపాటి రమేష్, ఎం. వెంకటేష్, బి. మల్లేష్, కాసు మాధవి పాల్గొన్నారు.

# కనిపించనున్న రింగ్ ఆఫ్ ఫైర్

హైదరాబాద్: భూమి, సూర్యుని మధ్య చంద్రుడు వెళ్ళినప్పుడు సూర్య గ్రహణం ఏర్పడుతుంది. ఈ సమయంలో సూర్యుడు పూర్తిగా కానీ పాక్షికంగా కానీ భూమికి కనిపించదు. ఈ ఖగోళ ఘటనను సూర్యగ్రహణం అని అంటారు. ఈ ఏడాది(2024) రెండో సూర్య గ్రహణం ఏర్పడనుంది. ఈ ఏడాదికి ఇదే చివరి సూర్యగ్రహణం కూడా. సూర్యగ్రహణం ఏర్పడినప్పుడల్లా ఆకాశంలో కొన్ని అరుదైన దృశ్యాలు కనిపిస్తూనే ఉంటాయి. వీటిలో రింగ్ ఆఫ్ ఫైర్ కూడా ఒకటి. ఈసారి కూడా సూర్యగ్రహణం సమయంలో సూర్యుడు చుట్టూ అగ్ని వలయంలా కనిపించానుంది. ఈ అరుదైన దృశ్యం భారతదేశంలో కూడా కనిపిస్తుందో లేదో తెలుసుకుందాం.సూర్యగ్రహణం గురించి మాట్లాడుతే మొత్తం 3 రకాలు ఉన్నాయి. మొదటి సూర్యగ్రహణాన్ని సంపూర్ణ సూర్యగ్రహణం అంటారు.

సంపూర్ణ సూర్యగ్రహణంలో చంద్రుడు భూమిని పూర్తిగా కప్పేస్తాడు. ఈ సమయంలో చంద్రుడు భూమికి చాలా దగ్గరగా ఉంటాడు. భూమిపై సూర్యుడి వెలుగు పడకుండా చంద్రుడు కప్పెయ్యండతో పూర్తి అంధకారం కమ్ముకుంటుంది.రెండవ గ్రహణాన్ని పాక్షిక సూర్యగ్రహణం అంటారు. ఇందులో చంద్రుడు సూర్యుడిని పూర్తిగా కవర్ చేయడు. చంద్రుడి నీడ సూర్యుడిలోని కొంత భాగాన్ని కప్పి ఉంచితే సూర్యుడి నీడ పాక్షికంగా భూమిపై పడుతుంది. ఈ పరిస్థితిని పాక్షిక సూర్యగ్రహణం అంటారు.ఈ సమయంలో సూర్యుడి కొంత భాగమే కనిపిస్తుంది. మిగతా భాగం నల్లగా ఉంటుంది.మూడవ సూర్యగ్రహణాన్ని వార్షిక సూర్యగ్రహణం అంటారు. ఇందులో చంద్రుడు సూర్యుడికి, భూమికి మధ్య చాలా దూరంలో వెళతాడు. చంద్రుని స్పష్టమైన వ్యాసం సూర్యుని కంటే తక్కువగా ఉన్నప్పుడు వార్షిక సూర్యగ్రహణం ఏర్పడుతుందివార్షిక సూర్యగ్రహణం సమయంలో చంద్రుని నీడ సూర్యునిపై పడినప్పుడు రింగ్ ఆకారంలో దృశ్యం కనిపిస్తుంది. దీని కాంతి చాలా ప్రకాశవంతంగా ప్రకాశిస్తుంది. సైన్స్ భాషలో దీనిని యాన్యులర్ సోలార్ ఎక్లిప్స్ అని కూడా అంటారు. అయితే ప్రతి గ్రహణంలోనూ ఈ దృశ్యం కనిపించాల్సిన అవసరం లేదు. ఒక్కోసారి ఇలాంటి అరుదైన దృశ్యం ఏడాదికి ఒకసారి కనిపిస్తూ ఉంటుంది. ప్రజలు కూడా ఈ దృశ్యాన్ని ఆస్వాదించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

**రింక్ ఆఫ్ ఫైర్ భారత్ లో కనిపిస్తుందా?**

సూర్యగ్రహణం అక్టోబర్ 2 రాత్రి 9.13 గంటలకు ప్రారంభమై మర్నాడు అంటే అక్టోబర్ 3 మధ్యాహ్నం 3.17 గంటలకు ముగుస్తుంది. ఈ సూర్యగ్రహణం సంభవించినప్పుడు, భారతదేశంలో రాత్రి సమయం ఉంటుంది. అందువల్ల ఈ సూర్యగ్రహణం భారతదేశంలో కనిపించదు. ఖగోళంలో అరుదైన ఘటన రింగ్ ఆఫ్ ఫైర్‌ను భారతీయులు చూడలేరు. ఇది అర్జెంటీనా, పెరూ, దక్షిణ అమెరికా, ఇతర ప్రదేశాలలో కనిపిస్తుంది. సూర్యగ్రహణం రాత్రి పడే సమయం వల్ల భారతదేశంలో సూతకాల కాలం ఉండదు. సూత కాలం అంటే ఏదైనా శుభ కార్యాలు నిషేధించబడిన సమయం. ఈ కాలంలో దేవాలయాల తలుపులు కూడా మూసివేయబడతాయి. అయితే ఈసారి భారతదేశంలో సూర్య గ్రహణం ప్రభావం చూపదు కనుక..సూత కాలం ఉండదు.

# అక్టోబర్ 3 నుండి 5 వరకు జి-స్పార్క్ 2024 గ్లోబల్ సౌత్ కాన్ఫరెన్స్

హైదరాబాద్: అక్టోబర్ 3 నుండి 5 వరకు హైదరాబాద్ నగరం లో జి-స్పార్క్ 2024 గ్లోబల్ సౌత్ కాన్ఫరెన్స్ ను నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ అకాడమీ అధ్యక్షుడు మరియు జి-స్పార్క్ చైర్‌మెన్ డాక్టర్ రంగారెడ్డి బుర్రి, కో-చైర్, ఆర్. గోవింద్ హరి తెలిపారు.సోమవారం హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో వారు మాట్లాడుతూ నగరంలోని మాదాపూర్‌లోని హైటెక్‌సిటీలోని శిల్పకళా వేదికలో అక్టోబరు 3 నుంచి 5వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సు తెలంగాణా రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరాయి ప్రారంబిస్తారని వారు తెలిపారు..అలాగే ఈ సదస్సుకు గౌరవ అతిథిగా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ దామోదర రాజనర్సింహ హాజరుకానున్నారు.ఈ సదస్సులో తెలంగాణ రాష్ట్ర యాంటీమైక్రోబయల్ రెసిస్టన్స్ ప్లాన్‌ను ముఖ్యమంత్రి ప్రకటించనున్నారు. భారతదేశంలో కేవలం ఆరు రాష్ట్రాలు ఈ ప్రణాళికను కలిగి ఉన్నాయి మరియు ఈ ప్రణాళిక ప్రారంభించిన తర్వాత తెలంగాణ భారతదేశంలో 7వ రాష్ట్రంగా అవతరిస్తుంది.శ్రీ రేవంత్ రెడ్డి సదస్సును ప్రారంభించి, రాష్ట్ర యాంటీమైక్రోబయల్ రెసిస్టన్స్ ప్లాన్‌ను ప్రారంభిస్తారు. భారతదేశంలోని ఆరు రాష్ట్రాలు ఈ ప్రణాళికను అమలు చేస్తున్నాయి మరియు ముఖ్యమంత్రి రాష్ట్ర కార్యాచరణ ను ప్రకటించిన తర్వాత భారతదేశంలో ఏఎంఆర్ ప్రణాళికను కలిగి ఉ న్న 7వ రాష్ట్రంగా తెలంగాణ అవతరిస్తుంది.కాన్ఫరెన్స్ యొక్క లక్ష్యం, వారి ప్రకారం, ఇన్ఫెక్షన్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ (ఎఖఅ), యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) మరియు గ్లోబల్ సౌత్ (ఆసియా, ఆఫ్రికా, మిడిల్ ఈస్ట్, సౌత్‌లోని వనరుల-పరిమిత దేశాలు) నుండి పేషెంట్ సేఫ్టీ వాటాదారులకు ఒక వేదికను అందించడం ఈ సదస్సు ముఖ్య ఉద్దేశ్యం. ఎఖఅ, ంఓూ మరియు చియాఊ (నీరు, పారిశుద్ధ్యం మరియు పరిశుభ్రత) మరియు కోవిడ్ లాంటి మహమ్మారి సంసిద్ధతపై మెరుగైన విధానాలు, పరిశోధన, అనుకూల పరిష్కారాలు మరియు అభ్యాసాల కోసం సహకరించడానికి తోడ్పడుతుంది. యాంటీ మైక్రోబయాల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) అన్ని వయసుల ప్రజలను ప్రభావితం చేస్తుందని మరియు సరిహద్దులను దాటి, ప్రతి దేశాన్ని ప్రభావితం చేస్తుందని నిర్వాహకులు హైలైట్ చేశారు. అయినప్పటికీ, అభివృద్ధి చెందుతున్న దేశాలు మరియు హాని కలిగించే జనాభాపై భారం అసమానంగా ఎక్కువగా ఉంటుంది. ఇది గ్లోబల్ సౌత్ ఎదుర్కొంటున్న ప్రత్యేక సవాళ్లను పరిష్కరించడానికి తగిన పరిష్కారాలు అవసరం. అందువల్ల, ఏఎంఆర్ వంటి ప్రపంచ ఆరోగ్య ప్రమాదాలను ఎదుర్కోవడంలో సహకార ప్రయత్నాలు మరియు దక్షిణ-దక్షిణ సహకారం అవసరం.అని తెలిపారు.

జి-స్పార్క్ 2024 ను ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ అకాడమీ ఆఫ్ ఇండియా (ఎఈఅంఎ), యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రగ్యాన్ సస్టైనబుల్ హెల్త్ అవుట్‌కమ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వందమందికి పైగా అకాడెమియా, పరిశ్రమలు, ఆరోగ్య సంరక్షణ సంస్థలు మరియు ప్రొఫెషనల్ పార్టనర్‌ల మద్దతుతో నిర్వహిస్తోంది. రెడ్‌హిల్స్‌లోని ఎఫ్‌టిసిసిఐలో డాక్టర్ రంగారెడ్డి విలేకరుల సమావేశంలో ప్రసంగిస్తూ, 'ఏఎంఆర్'తో పోలిస్తే కోవిడ్ ఏమీ లేదన్నారు. కోవిడ్‌కి ప్రారంభం మరియు ముగింపు ఉన్నాయి. ఒఒఖీ అలా కాదు.ఇది నెమ్మదిగా వచ్చే మహమ్మారి మరియు ఇది శాశ్వతమైన మహమ్మారి అని ఆయన తెలిపారు. జి-స్పార్క్ 2024 హాజరయ్యే నిపుణులు ఈ అనేక ఇతర విషయాలను చర్చిస్తారని ఆయన తెలిపారు

# అక్రమ కట్టడాల కూల్చివేతలపై సరికొత్త ప్లాన్

హైదరాబాద్: హైడ్రా.. ఈ మధ్య కాలంలో ఇంతలా వినిపించిన పేరు మరొకటి లేదు. తెలుగు రాష్ట్రాల్లో ప్రతి చోట వినిపిస్తున్న పేరు ఇది. చెరువులు, కుంటలు ఆక్రమించి కట్టుకున్న నిర్మాణాలపై ఉక్కుపాదం మోపుతున్న హైడ్రాపై భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీలోనే చాలా మంది ఎమ్మెల్యేలు దీన్ని వ్యతిరేకిస్తున్నారు. ప్రతిపక్షం సరే సరే. ఏకంగా హైడ్రా బాధితుల పేరిట ఓ ఉద్యమాన్నే సిద్ధం చేసింది బీఆర్ఎస్. ఆ బాటలోనే పయణిస్తోంది బీజేపీ కూడా. ఇప్పటి వరకు హైడ్రా తీసుకుంటున్న చర్యలు సమర్థిస్తూ వస్తున్నప్పటికీ ఈ మధ్య కాలంలో మాత్రం తీవ్ర దుమారం రేపుతున్నాయి. కాయ కష్టం చేసి కట్టుకున్న ఇళ్లను నిట్టనిలువునా కూల్చేస్తుంటే కొందరు పేదలు రోడ్డున పడుతున్నారు. అధికారులు అన్ని అనుమతులు ఇచ్చిన ఇళ్లపై కూడా హైడ్రా బుల్డోజర్లు చేయి వేస్తుంటే తట్టుకోలేకపోతున్నారు. అందుకే కూల్చివేతల టైంలో హైడ్రామాలు చూస్తున్నాం. ఈ హైడ్రా చర్యలకు తోడు ఈ మధ్య మూసి నిర్వాసితులు కూడా చేరారు. మూసీ ప్రక్షాళన కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై కూడా విమర్శలు వెల్లువెత్తున్నాయి. మూసీ నదిలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను గుర్తించి రెడ్ మార్క్ వేస్తున్నారు అధికారులు. దీన్ని చాలా మంది వ్యతిరేకిస్తున్నారు. ఇలా ఓవైపు హైడ్రా, రెండో వైపు మూసీ ప్రక్షాళన పేరుతో ప్రజలను రోడ్డున పడేస్తోంది ప్రభుత్వం అని ప్రతిపక్షాలు ఉద్యమ బాట పట్టాయి. బీఆర్ఎస్, బీజేపీ పోటాపోటీన ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నాయి. ఇప్పటి వరకు సాఫీగా సాగిన ఈ యజ్ఞంలో ఇప్పుడు సమస్యలు వచ్చి పడుతున్నాయి. ఇన్నాళ్లూ సైలెంట్‌గా ఉన్న అధికార పార్టీ వాళ్లు కూడా స్వరాలు సవరించుకుంటున్నారు. అన్నింటినీ గమనించిన ప్రభుత్వం సరికొత్త వ్యూహాన్ని సిద్ధం చేసింది. హైడ్రా విషయంలో ప్లాన్ మార్చినట్టు తెలుస్తోంది. మరోవైపు మూసీ ప్రక్షాళన విషయంలో కూడా పునరాలోచనలో పడ్డట్టు చెబుతున్నారు. వదిలేసి పేదల కట్టడాలనే కూలుస్తుందనే అపవాదును మూటగట్టుకుంటున్న హైడ్రా ఇకపై పెద్దలపై ఫోకస్ పెట్టింది. చెరువులు ఆక్రమించి, బఫర్ జోన్‌లో, ఎఫ్‌టీఎల్‌లో నిర్మించిన బడా బాబుల నిర్మాణాలపైకి బుల్డోజర్లు వెళ్లనున్నాయి. అలాంటి వారి కట్టడాలపై చర్యలు తీసుకున్న తర్వాత మిగతా వాటి గురించి ఆలోచిస్తామని హైడ్రా అధికారులు చెబుతున్నారు. మొదట్లో ఇలాంటి కట్టడాలను కూల్చేసి అందరి దృష్టిలో పడ్డ హైడ్రా తర్వాత వాటి సంగతి మర్చిపోయిందనే విమర్శ ఉంది. అందుకే ఆలాంటి విమర్శలు, ఆరోపణలకు చెక్ పెట్టేందుకు పెద్ద తలకాయల కట్టాడలపై ఫోకస్ పెట్టిందట. మరోవైపు ఆపరేషన్ మూసీ విషయంలో కూడా ఆచితూచి ముందడుగు వేయాలని ప్రభుత్వం భావిస్తోంది. మూసీ చుట్టు ఉన్న బడా బాబుల నిర్మాణాల పని పట్టనుంది. ఆ తర్వాత మిగతా ప్రజల కట్టడాల జోలికి వెళ్లనుంది. వారితో మాట్లాడి ఒప్పించి కూల్చేందుకు కార్యచరణ సిద్ధం చేసింది. మూసీ నిర్వాసితులకు ఇచ్చే ప్యాకేజీ, ఇతర సదుపాయాలపై విస్తృత ప్రచారం కల్పించిన తర్వాత ముందుకెళ్లాలనే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది.

# బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

సికింద్రాబాద్: బాధిత కుటుంబాలకు బాసటగా నిలిచి ఆదుకోవాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు. మోండా మార్కెట్ లోని ఓల్డ్ జైల్ ఖానా వద్ద షాపులు కూలిపోయి నష్టపోయిన బాధితులకు మేరు సంఘం ఆధ్వర్యంలో కుట్టు మిషన్ లు, ఆర్థిక సహాయాన్ని మోండా మార్కెట్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 70 సంవత్సరాలు గా ఇక్కడే తమ వృత్తి టైలరింగ్ ను చేసుకుంటూ జీవనం సాగిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ఊహించని ప్రమాదంతో షాపులు, మిషన్ లు, దుస్తులను నష్టపోయారని పేర్కొన్నారు. కష్టాల్లో ఉన్న కుటుంబాలకు చేయూత అందించిన మేరు సంఘం ప్రతినిధులను అభినందించారు. రెడీమేడ్ దుస్తుల రాకతో సరైన ఉపాధి లేక అవస్థలు పడుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. బాధితులను ఆదుకోవాలని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా రెవెన్యూ అధికారులు వచ్చి పంచనామా నిర్వహించిన విషయాన్ని వివరించారు. వెంటనే ప్రభుత్వం బాధిత కుటుంబాలను ఆదుకోవాలని, కూలిపోయిన షాపుల స్థానంలో నూతన షాపులను ప్రభుత్వమే నిర్మించి పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆకుల రూప,బీఆర్ఎస్ పార్టీ నాయకులు తలసాని స్కై లాబ్ యాదవ్, నాగులు, బన్సీలాల్ పేట డివిజన్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, మేరు సంఘం అధ్యక్షుడు కృష్ణ, హన్మంతరావు, రవీందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నైతికతే నిజమైన స్వేచ్ఛ"

కమాన్ పూర్: నైతికతే నిజమైన స్వేచ్ఛా అని ఆయిషా సిద్ధిఖా- మహిళా విభాగం ఉద్యమ కన్వీనర్ అన్నారు. సోమవరం 5 ఇంక్లైన్ కాలనీ లో ఉద్యమ ముగింపు , స్త్రీల సమావేశంలో వారు మాట్లాడుతూ నైతికతే నిజమైన స్వేచ్ఛ.. దాని వల్ల కలిగే మేలు

మనం నైతికత కలిగి ఉంటే సరైన నిర్ణయాలు తీసుకొనే శక్తి సామర్థాలు కలిగి ఉంటాం. అలాంటి నిర్ణయాలు మన చక్కని భవిష్యత్తుకు పునాదిని ఏర్పరుస్తాయి. వ్యక్తులు, సమాజాలు నైతిక విలువలను పాటిస్తే సమాజంలో సామరస్య వాతావరణం ఏర్పడుతుంది. దీని ద్వారా ఒకరినొకరు పరస్పరం గౌరవించుకొంటూ జీవించే పరిస్థితులను సృష్టించుకోవచ్చు. మనం నైతిక విలువలకు కట్టుబడితే మన ధార్మిక బాధ్యతలను మరింత శ్రద్ధగా నిర్వహించవచ్చు. మనమంతా నైతిక విలువలు పెంపొందించుకొంటే సమాజంలో సమానత్వం, దయ, జాలి గుణాలు పెరుగుతాయి. నిజమైన స్వేచ్ఛ అపరాధ భావన, సామాజిక ఒత్తిళ్లు, నైతిక గందరగోళం నుండి మనకు విముక్తిని కలిగిస్తుంది. మనం సంతృప్తికరమైన, అర్ధవంతమైన జీవితాలను గడపడానికి వీలు కల్పిస్తుంది. నైతికత మనలో అభద్రతను తొలగిస్తుంది. ఉన్నతంగా ఆలోచించే సద్గుణాన్ని ప్రసాదిస్తుంది.

**మితిమీరిన స్వేచ్ఛ, విశృంఖలత్వం వల్ల కలిగే దుష్పరిణామాలు**

మితిమీరిన స్వేచ్ఛ, విశృంఖలత్వం వివాహేతర సంబంధాలకు, వివాహేతర లైంగిక సంబంధాలకు, స్వలింగ సంపర్కాలకు, మాదక ద్రవ్యాల సేవనానికి దారి తీస్తుంది. ఇవి మన భావోద్వేగాలను, మానసిక, శారీరక ఆరోగ్యాలను దెబ్బ తీస్తాయి. ఈ దుర్గుణాలు మొత్తం సమాజాన్ని అస్థిరపరుస్తాయి. మితిమీరిన స్వేచ్ఛ వల్ల కోరికలకు నియంత్రణ లేకుండా పోతుంది. ఈ క్రమంలో నైతిక విలువలన్నీ విస్మరించబడతాయి. కుటుంబ వ్యవస్థ దెబ్బ తింటుంది. రక్త సంబంధాలు, మానవ సంబంధాల పవిత్రత తగ్గిపోతుంది. సమాజంలో ఒకరి పట్ల ఒకరికి అప నమ్మకం ఏర్పడుతుంది. సమాజంలో అస్థిర వాతావరణం ఏర్పడుతుంది. నీతివంతులు సైతం భౌతికవాదులుగా మారిపోతారు. నగ్నత్వం, అశ్లీలత, మద్యపానం కూడా స్వేచ్ఛగా భావించబడతాయి.

**స్వేచ్ఛ పేరుతో మహిళలు ఎలా మోసపోతున్నారు?**

పాశ్చాత్య సంస్కృతి చెప్పే స్వేచ్ఛ పేరుతో మహిళలు మానసిక బానిసత్వంలోకి నెట్టి వేయబడుతున్నారు. "నా శరీరం, నా ఎంపిక" అనే తప్పుడు నినాదానికి ఆకర్షితులై తమ కుటుంబాలను, నీతి నియమాలను, వినయాన్ని, స్వచ్ఛతను విస్మరిస్తున్నారు. సంతోషాలను




బయట వెతుక్కుంటున్నారు. బాయ్ ఫ్రెండ్, గర్ల్ ఫ్రెండ్ సంస్కృతికి ఆకర్షితులవుతున్నారు. పిల్లల కోసం తల్లి త్యాగాలు ఎందుకు చేయాలి అని ఆలోచించే స్థాయికి దిగజారుతున్నారు. తమ స్త్రీ తత్వాన్ని అవమానంగా భావించి పురుషులుగా మారాలని ప్రయత్నించే స్థాయికి దిగజారుతున్నారు. సంప్రదాయ వస్త్రధారణపై ఆసక్తి తగ్గించుకుంటున్నారు. ఆధునిక, కురచ దుస్తులపై ఆసక్తి పెంచుకొంటున్నారు. స్త్రీ - పురుషుల మధ్య తగిన దూరం ఎందుకు ఉండాలి? లైంగిక సంబంధాల కోసం వివాహం అవసరమా? అనే హీనమైన ఆలోచనలు చేసే స్థాయికి వస్తున్నార నీ వారు తెలిపరు - ××ముస్లింల కోసమే కాకుండా సర్వమానవాళికి రుజమార్గం చూపేందుకు ప్రవక్త ×× ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం - వచ్చారని శ్రీమతి సబీరా నాజ్ - అధ్యక్షురాలు -

అన్నారు.వారు మాట్లాడుతు ఆయన బోధనలు మానవాళికి దిశానిర్దేశం చేశాయన్నారు. పేదలను ప్రేమించడం, మహిళల పట్ల గౌరవంగా ఉండాలని తెలిపరు. కార్మికవర్గం హక్కులపై కూడా తన బోధనలో పొందుపర్చారనీ వెల్లడించారు. కార్మికున్ని కూలికి తీసుకున్నప్పుడే తన కూలిని నిర్ణయించాలని, పనిచేసిన తర్వాత శ్రమకు తగిన వేతనాన్ని చెల్లించాలని ప్రవక్త తనబోధనల్లో క్లుప్తంగా వివరించారని తెలిపారు- జమాత్ ఇ ఇస్లామీ హింద్ - ఉద్యమ కన్వీనర్-శ్రీమతి ఆయిషా సిద్దిక్వా , సొసైటీ సేవలు, సంగం బలోపేతానికి నేను ఆకర్షితురాలినై అసోసియేట్ గా కొన సాగుతున్ననని శ్రీమతి పుష్పలత యోగా టీచర్ -హెల్త్ వెల్‌నెస్ కోచ్ వారి అభిప్రాయం తెలియ చేసారు

# సిద్దిపేట నియోజకవర్గ వర్గ ఆటో కార్మికుల సమావేశం

**సమావేశానికి హాజరై ఆటో కార్మికుల కు ఖాకీ యూనిఫాం లను అందజేసిన ఎమ్మెల్యే హరీష్ రావు**

సిద్దిపేట: సిద్దిపేట నియోజకవర్గ వర్గ ఆటో కార్మికుల సమావేశానికి ఎమ్మెల్యే హరీష్ రావు హాజరైయారు,. హరీష్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ లకు అతీ గతీ లేదు.నెలకు 10 వేల రూపాయలు 1లక్ష 50 వేలు పెట్టి మూసి సుందరీకారణ చేస్తా అంటుండు. 5 వేల ఇండ్లు కూల్చేస్తాడట. ఎన్నో ఏండ్లు గా ఇండ్లు కట్టుకొని నివసిస్తున్న పేద ప్రజలు కన్నీరు మున్నీరావుతున్నరు. సీఎం రేవంత్ రెడ్డి గుండె కరగడం లేదు. వేల కుటుంబాలను ప్రభుత్వం ఆగం చేస్తున్నది. బతుకు ముఖ్య మా సుందరీకరణ ముఖ్యమా లక్ష మంది రోడ్డున పడే పరిస్థితి వచ్చింది. హైడ్రా పేరిట డ్రామాలు ఆపు రేవంత్ రెడ్డి. రేవంత్ రెడ్డికి కూల్చడం తప్ప నిర్మించడం రాదని అన్నారను. ముందు గ్రామాల్లో అభివృద్ధి చూడు. అసెంబ్లీ లో ప్రభుత్వాన్ని ని లాదీస్తాం, 56 మంది ఆటో కార్మికులు చనిపోతే ఒక్క కుటుంబాన్ని పరామర్శించ లేదు. ఒక్క కుటుంబాన్ని ఆదుకోలేదు. ఆరుగ్యారెంటీలు ఏమయ్యాయి. ఒక్కటి కూడా అమలు కాలేదు. రైతు బంధు ఏది. కల్యాన లక్ష్మీ తులం బంగారం ఏమయ్యింది.. నిరుద్యోగ భృతి ఏమయ్యిందని అన్నారు. రుణమాఫీ ఏమయ్యింది. సగం మందికి రుణమాఫీ కాలే. సిగ్గు లేకుండా నన్ను రాజీనామా చెయ్య మంటున్నాడు. మూసీ సుందరీకరిస్తే ఎవరి బతుకులు బాగు పడతాయి. గ్రామ పంచాయితీ ల్లో స్థాంభాలకు బల్బులు పెట్టడానికి పైస లివ్వవు. సిద్దిపేట ఆటో సొసైటీ దేశానికే ఆదర్శం. 2 లక్షల ఇన్సూరెన్స్ ఇస్తున్నాం. అవసరం ఉన్న వారికి తక్కువ వడ్డీ కి ఋణం అందిస్తున్నాం. 2 కోట్ల 10 లక్షల రుణాలు ఇచ్చాము. 26 మంది ఆటో కార్మికులు చనిపోతే 2 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వడం జరిగింది. ఆటో కార్మికులు మద్యం, గుట్కా అలవాట్లు మానుకోండి. కుటుంబాలను బాగా చూసుకోవాలి మన ఇల్లు మనమే చక్కదిద్దు కోవాలి. కాంగ్రెస్ పార్టీ మెడలు వంచి మికు న్యాయం జరిగే విధంగా కొట్లాడుతా. సిద్దిపేట ఆటో కార్మికుల కోసం పెట్రోల్ బంక్ మంజూరు చేయిస్తానని అన్నారు. ఈ కార్యక్రమం లో సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పాల సాయిరాం, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో వినూత్న ఆఫర్లు

నల్గొండ: దసరా పండగ సమీపిస్తుండటంతో అప్పుడే గ్రామాల్లో సందడి మొదలైంది. దసరా పండుగకు పలు వ్యాపార, వాణిజ్య సంస్థలు తమ వస్తువులపై ఆఫర్లు ప్రకటించడం సర్వసాధారణమే. కానీ ఈసారి గ్రామాలలో బంపర్ ఆఫర్లు నడుస్తున్నాయి. 51 రూపాయలు కొట్టు.. మేకను పట్టు, రెండు ఫుల్ బాటిల్స్, రెండు కడకనాథ్ నాటు కోళ్ళు, కాటన్ బీర్లు అంటూ సోషల్ మీడియాలో వెరైటీ ప్రచారం సాగుతోంది. తెలంగాణలో దసరా పండుగను చాలా గ్రాండ్ గా జరుపుకుంటారు. కొత్త బట్టలు సుక్క.. ముక్క లేనిదే నడవదు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని పలు ప్రాంతాల్లో లక్కీ డ్రా పేరుతో విచిత్రమైన దసరా ఆఫర్లు కొనసాగుతున్నాయి. చిట్యాల, మర్రిగూడ, చౌటుప్పల్ తదితర ప్రాంతాల్లో సోషల్ మీడియాలో దసరా ఆఫర్లు సందడి చేస్తున్నాయి. గ్రామాల్లో కొందరు యువకులు 51 రూపాయలు కొట్టు.. మేకను పట్టుకో అని ప్రచారం చేస్తున్నారు. ఈ స్కీంలో 51 రూపాయలు చెల్లించి కూపన్ తీసుకుంటే.. కూపన్ల నుంచి డ్రా తీస్తారు. మొదటి బహుమతిగా పన్నెండు కిలోల మేక, రెండో బహుమతిగా రెండు లిక్కర్ బాటిళ్లు, మూడో బహుమతిగా మరో రెండు లిక్కర్ బాటిళ్లు, నాలుగో బహుమతిగా రెండు కడక్నాథ్ నాటు కోళ్లు, ఐదో బహుమతిగా కాటన్ బీర్లు ఇచ్చేట్లు సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో వంద రూపాయలు కొట్టు.. మేకను పట్టు అంటూ సరికొత్త స్కీం ప్రారంభించారు. మొత్తంగా నల్గొండ జిల్లాలో దుమ్మురేపుతున్న ఈ ఆఫర్ రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాలకు విస్తరించింది. మాయ లేదు మోసం లేదు.. పూర్తిగా లక్ అంటూ..లక్కీ డ్రా లో మీరే గెలుచు కుంటారు అంటూ పెద్ద ఎత్తున గ్రామాలలో దసరా ఆఫర్లు కొనసాగుతున్నాయి. అయితే 50 రూపాయలు, 100 రూపాయలేగా పోతే పోయేది.. వస్తే మాత్రం అంతకు మించిన విలువైనవి వస్తాయి.. అదృష్టం బాగుంటే మేకనే మన సొంతం అవుతుందని చాలా మంది దసరా సందర్భంగా అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఈ దసరా ప్రచారాలపై దసరా పండుగను కూడా సొమ్ము చేసుకుంటున్న సదరు లక్కీ డ్రా ల నిర్వాహకుల పైన పోలీసులు దృష్టి సారించారు.

# నేపాల్ లో భారీ వర్షాలు

ఖాట్మాండు: నేపాల్‌లో భారీ వర్షాలు, వరదలు ముంచెత్తాయి. కొన్ని చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. వేర్వేరు ఘటనల్లో ఇప్పటి వరకు 150 మందికి పైగా మృతి చెందినట్లు అక్కడి అధికార వర్గాలు వెల్లడించాయి. వరదల్లో మరో 56 మంది గల్లంతుకాగా.. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. నేపాల్ తీర్పు ప్రాంతంలో శుక్రవారం నుంచే కుండపోత వర్షాలు దంచి కొడుతున్నాయి. నదులు పొంగి ప్రవహిస్తుండటంతో పరివాహక ప్రాంతాల్లోని వందలాది ఇళ్లు నీటమునిగాయి. కాట్మాండుకు సమీపంలోని భక్తపూర్‌లో కొండచరియలు విరిగిపడి ఒక ఇల్లు కూలిపోయింది. ఈ దుర్ఘటనలో ఆ ఇంట్లోని గర్భిణీ స్త్రీ, నాలుగేళ్ల బాలికతో సహా ఐదుగురు మరణించారు. వరదల్లో చిక్కుకున్న దాదాపు 3 వేల మందిని రక్షించిన ఆ దేశ ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

నేపాల్‌లో ఈ స్థాయిలో వర్షాలు, వరదలు గత 40–45 ఏళ్లలో ఎప్పుడూ చూడలేదని కొందరు ప్రత్యక్ష సాక్షులు మీడియాకు తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో నేపాల్ ప్రభుత్వం.. పాఠశాలలు, కళాశాలలకు 3 రోజుల సెలవు ప్రకటించింది. మంగళవారం వరకు వర్షాలు కొనసాగే అవకాశముందని ఆ దేశ వాతావరణ శాఖ అంచనావేసింది. నేపాల్‌లోని వరదల ప్రభావంతో బిహార్ కూడా తల్లడిల్లుతోంది. కోసి, గండక్, గంగా నదులు పొంగిపొర్లుతుండటంతో రాష్ట్రంలోని 38 జిల్లాలకు ప్రభుత్వం హైఅలర్ట్ ప్రకటించింది. నేపాల్ లో భారీ వర్షాల కారణంగా గండక్ బ్యారేజీలో 5.40 లక్షల క్యూసెక్కుల నీటిని, కోసి బ్యారేజీకి 4.99లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు చంపారన్, గోపాల్ గంజ్, అరారియా, సుపాల్, కతిహార్, తదితర జిల్లాల్లోని లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు ప్రవేశించింది. కోసీ నదిలో వద్ద పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. పలు చోట్ల వంతెన పైనుంచి నీరు ప్రవహిస్తోంది. నది ఒడ్డున నివసించే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. దాదాపు 55 సంవత్సరాల తరువాత కోసి నదిలో భారీగా వరదనీరు చేరడం ఇదే తొలిసారి అని స్థానికులు చెబుతున్నారు. ఆకస్మికల వరదల కారణంగా బిహార్ ప్రజలు తల్లడిల్లుతున్నారు. వేల ఎకరాల్లో పంటనష్టం కారణంగా రైతులు లబోదిబోమంటున్నారు.

# హైడ్రా ...రూట్ మార్పు

హైదరాబాద్: హైడ్రా.. ఈ మధ్య కాలంలో ఇంతలా వినిపించిన పేరు మరొకటి లేదు. తెలుగు రాష్ట్రాల్లో ప్రతి చోట వినిపిస్తున్న పేరు ఇది. చెరువులు, కుంటలు ఆక్రమించి కట్టుకున్న నిర్మాణాలపై ఉక్కుపాదం మోపుతున్న హైడ్రాపై భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీలోనే చాలా మంది ఎమ్మెల్యేలు దీన్ని వ్యతిరేకిస్తున్నారు. ప్రతిపక్షం సరే సరే. ఏకంగా హైడ్రా బాధితుల పేరిట ఓ ఉద్యమాన్నే సిద్ధం చేసింది బీఆర్ఎస్. ఆ బాటలోనే పయణిస్తోంది బీజేపీ కూడా. ఇప్పటి వరకు హైడ్రా తీసుకుంటున్న చర్యలు సమర్థిస్తూ వస్తున్నప్పటికీ ఈ మధ్య కాలంలో మాత్రం తీవ్ర దుమారం రేపుతున్నాయి. కాయ కష్టం చేసి కట్టుకున్న ఇళ్లను నిట్టనిలువునా కూల్చేస్తుంటే కొందరు పేదలు రోడ్డున పడుతున్నారు. అధికారులు అన్ని అనుమతులు ఇచ్చిన ఇళ్లపై కూడా హైడ్రా బుల్డోజర్లు చేయి వేస్తుంటే తట్టుకోలేకపోతున్నారు. అందుకే కూల్చివేతల టైంలో హైడ్రామాలు చూస్తున్నాం. ఈ హైడ్రా చర్యలకు తోడు ఈ మధ్య మూసి నిర్వాసితులు కూడా చేరారు. మూసీ ప్రక్షాళన కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై కూడా విమర్శలు వెల్లువెత్తున్నాయి. మూసీ నదిలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను గుర్తించి రెడ్ మార్క్ వేస్తున్నారు అధికారులు. దీన్ని చాలా మంది వ్యతిరేకిస్తున్నారు. ఇలా ఓవైపు హైడ్రా, రెండో వైపు మూసీ ప్రక్షాళన పేరుతో ప్రజలను రోడ్డున పడేస్తోందీ ప్రభుత్వం అని ప్రతిపక్షాలు ఉద్యమ బాట పట్టాయి. బీఆర్ఎస్, బీజేపీ పోటాపోటీన ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నాయి. ఇప్పటి వరకు సాఫీగా సాగిన ఈ యజ్ఞంలో ఇప్పుడు సమస్యలు వచ్చి పడుతున్నాయి. ఇన్నాళ్లూ సైలెంట్‌గా ఉన్న అధికార పార్టీ వాళ్ల కూడా స్వరాలు సవరించుకుంటున్నారు. అన్నింటినీ గమనించిన ప్రభుత్వం సరికొత్త వ్యూహాన్ని సిద్ధం చేసింది. హైడ్రా విషయంలో ప్లాన్ మార్చినట్టు తెలుస్తోంది. మరోవైపు మూసీ ప్రక్షాళన విషయంలో కూడా పునరాలోచనలో పడ్డట్టు చెబుతున్నారు. పెద్దలను వదిలేసి పేదల కట్టడాలనే కూలుస్తుందనే అపవాదును మూటగట్టుకుంటున్న హైడ్రా ఇకపై పెద్దలపై ఫోకస్ పెట్టింది. చెరువులు ఆక్రమించి, బఫర్ జోన్‌లో, ఎఫ్‌టీఎల్‌లో నిర్మించిన బడా బాబుల నిర్మాణాలపైకి బుల్డోజర్లు వెళ్లనున్నాయి. అలాంటి వారి కట్టడాలపై చర్యలు తీసుకున్న తర్వాత మిగతా వాటి గురించి ఆలోచిస్తామని హైడ్రా అధికారులు చెబుతున్నారు. మొదట్లో ఇలాంటి కట్టడాలను కూల్చేసి అందరి దృష్టిలో పడ్డ హైడ్రా తర్వాత వాటి సంగతి మర్చిపోయిందనే విమర్శ ఉంది. అందుకే ఆలాంటి విమర్శలు, ఆరోపణలకు చెక్ పెట్టేందుకు పెద్ద తలకాయల కట్టాడలపై ఫోకస్ పెట్టిందట. మరోవైపు ఆపరేషన్ మూసీ విషయంలో కూడా ఆచితూచి ముందడుగు వేయాలని ప్రభుత్వం భావిస్తోంది. మూసీ చుట్టు ఉన్న బడా బాబుల నిర్మాణాల పని పట్టనుంది. ఆ తర్వాత మిగతా ప్రజల కట్టడాల జోలికి వెళ్లనుంది. వారితో మాట్లాడి ఒప్పించి కూల్చేందుకు కార్యచరణ సిద్ధం చేసింది. మూసీ నిర్వాసితులకు ఇచ్చే ప్యాకేజీ, ఇతర సదుపాయాలపై విస్తృత ప్రచారం కల్పించిన తర్వాత ముందుకెళ్లాలనే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది.

# గులాబీల దారెటు...

హైదరాబాద్: జీహెచ్ఎంసీ ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ మూసీ ప్రక్షాళన అంశం చర్చకు వస్తుంది. 2020 నవంబర్‌లో ఎన్నికల సందర్భంగా అప్పటి సీఎం కేసీఆర్ చాలా చెప్పారు. గోదావరిని మూసీతో కలుపుతామన్నారు. మిమాయత్ సాగర్, గండిపేట జలాశయాలను గోదావరి నీళ్లతో నింపుతామని చెప్పారు. మూసీలో పిల్లలు బోటింగ్ చేసేలా తీర్చిదిద్దుతామన్నారు. ఫ్రాన్స్‌లో నది, లండన్ థేమ్స్ అంటూ ఏవేవో చెప్పుకొచ్చారు. కానీ, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా బీఆర్ఎస్ పాలనలో ఏం జరగలేదు. మూసీ అదే మురికి కూపంగా కనిపిస్తోంది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చీరాగానే మూసీ ప్రక్షాళన కోసం ఓ ప్రణాళికను తీసుకొచ్చింది. మూసీ నదిపరివాహక ప్రాంతాల్లో కబ్జాలకు గురైన ప్రాంతాన్ని గుర్తించి, అందులో ఉన్న నిర్మాణాలను ఖాళీ చేయిస్తోంది. ఈ క్రమంలో కొందరు ఆందోళనలకు దిగుతున్నారు. అయితే, వారితో బీఆర్ఎస్ పార్టీ రాజకీయం చేస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మూసీ నిర్వాసితులకు తెలంగాణ భవన్ కేరాఫ్‌గా మారింది. అక్కడి నివాసితులు మాజీ మంత్రులు హరీష్ రావు, సబితా ఇంద్రారెడ్డితో భేటీ అయ్యారు. తమ గోడును వెల్లబోసుకున్నారు. ఏ అవసరమొచ్చినా మా తలుపులు తెరిచే ఉంటాయి, 24 గంటలు మా న్యాయవాదుల బృందం తెలంగాణ భవన్‌లోనే ఉంటుందంటూ గులాబీ నేతలు భరోసానిచ్చారు. మీకు రక్షణ కవచంగా నిలబడతామని, సీఎం రేవంత్ రెడ్డి అనాలోచిత నిర్ణయాలు తీసుకుంటున్నారంటూ విమర్శలు చేశారు. మూసీపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ హామీలను పక్కదారి పట్టించే ప్రయత్నంగా కూల్చివేతలు కొనసాగుతున్నాయని విమర్శలు చేశారు. నిరాశ్రయులకు, నిస్సహాయులకు అండగా ఉండటంలో తప్పు లేదు. ఉండాలి కూడా. తప్పు జరిగితే ప్రశ్నించాలి. నిలదీయాలి. అవసరమైతే గల్లా పట్టుకొని ఎదిరించాలి. కానీ, బీఆర్ఎస్ తీరుపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. తెలంగాణ భవన్‌కు వెళ్లిన వారిలో చాలావరకు అద్దెకు ఉండేవాళ్లేనని తెలుస్తోంది. పైగా వాళ్లకు నోటీసులు వెళ్లింది లేదు, ఇళ్లకు మార్క్ చేసిందీ లేదు. అయితే, ధైర్యం చెప్పాల్సిన లీడర్లు వారిని రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తుండడంపై భిన్న వాదనలు జరుగుతున్నాయి. వారి భయాన్ని తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకునే యత్నాలు ఆపాలంటూ సోషల్ మీడియాలో బీఆర్ఎస్‌పై మండిపడుతున్నారు నెటిజన్లు. పైగా, హరీష్ రావు మూసీ పరివాహిక ప్రాంతాలలో పర్యటిస్తామని చెప్పడంపై మండిపడుతున్నారు. పదేళ్లలో పట్టించుకోనివారు ఇప్పుడొచ్చి డ్రామాలు చేయడం ఏమాత్రం కరెక్ట్ కాదని హితవు పలుకుతున్నారు. అద్దెకు ఉంటున్నవాళ్లు ఇప్పటికిప్పుడు ఖాళీ చేయిస్తే ఎక్కడకు వెళ్లాలంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకూ డబుల్ బెడ్రూం ఇవ్వాలంటున్నారు. వారిని బీఆర్ఎస్ నేతలు రెచ్చగొట్టే ధోరణితో వ్యవహరించడంపై నెటిజన్ల ఆగ్రహానికి కారణమైంది. ఓవైపు నిర్వాసితులతో బీఆర్ఎస్ రాజకీయాలు చేస్తుంటే, ఇంకోవైపు డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపులు కొనసాగుతున్నాయి. మూసీ ప్రక్షాళనలో భాగంగా నిర్వాసితులను అధికారులు ఖాళీ చేయిస్తున్నారు. వారికి ప్రత్యామ్నాయంగా రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించింది. మలక్ పేట్, శంకర్ నగర్‌కు చెందిన నిర్వాసితులకు సైదాబాద్ మండలంలోని డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించారు. సంబంధిత అధికారులు సహాయ సహకారాలు అందిస్తూ వారికి పత్రాలు అందజేశారు. ఆ ఇళ్లలో కరెంట్, తాగునీరు వంటి అన్ని సౌకర్యాలను కల్పించారు. తమకు డబల్ బెడ్రూం ఇళ్లు కేటాయించడం పట్ల మూసీ నిర్వాసితులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. మూసీ సుందరీకరణపై ప్రభుత్వానికి ఓ టార్గెట్ ఉంది. హైదరాబాద్‌లో వరదలను కంట్రోల్ చేయడానికే, ఇదంతా చేస్తున్నామని చెబుతోంది. ఎవరికీ అన్యాయం జరగనివ్వమని, మూసీ బాధితులందరికి అన్యాయం చేయమని అంటోంది. ఇదంతా ప్రజల కోసమే చేస్తున్నామని చెబుతోంది. కానీ, ప్రధాన ప్రతిపక్షం మాత్రం దీన్ని ఓ పొలిటికల్ ఎజెండానే చూస్తున్నట్టు కనిపిస్తోంది. ఈ అంశాన్ని ఓ అస్త్రంగా మలుచుకొని అధికార పక్షంపై పోరాటానికి ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో గులాబీ పార్టీ వైఖరి రైటా ? రాంగా ? అనేది ఆత్మపరిశీలన చేసుకోవాలనే సూచనలు వినిపిస్తున్నాయి.

# మీ ఇల్లు సేఫ్ జోన్ లా ఉందా... చెక్ చేసుకోండి ఇలా...

హైదరాబాద్: మొన్న ఇళ్లు కొన్నా.. నేడు హైడ్రా నోటీస్ వచ్చింది. ఇదేంది భయ్యా.. ఏమి అర్థం కావడం లేదు.. మోసపోయాను భయ్యా.. అనే మాటలు ఇటీవల మనకు హైదరాబాద్ లో వినిపిస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం మనం స్థలం కొనుగోలు చేసే ముందు ఆస్థలం చెరువులు, కుంటల పరిధిలో ఉందా లేదా అన్న విషయాన్ని మనం గ్రహించలేకపోవడమే. అయితే హైదరాబాద్ లో రాష్ట్ర ప్రభుత్వం భవిష్యత్ ను దృష్టిలో ఉంచుకొని, వరదల సమయంలో భారీ నష్టాలు చవిచూసే అవకాశం లేకుండా.. చెరువులు, కుంటల ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి సారించింది. అందుకై హైడ్రా అనే వ్యవస్థను ఏర్పాటు చేసి ఆక్రమణల కూల్చివేత పర్వాన్ని సాగిస్తోంది. అయితే హైడ్రాను మరింత బలోపేతం చేసి.. మున్ముందు ఇక ఎక్కడా ఆక్రమణలు జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటోంది తెలంగాణ సర్కార్. ఇలా హైడ్రా కూల్చివేతలు సాగుతుండగా.. కొందరి మోసపూరిత మాటలను నమ్మిన వారు.. అప్పటికప్పుడు బఫర్ జోన్, ఎఫ్టిఎల్ పరిధిలోకి గృహాలను కొనుగోలు చేస్తున్నారు. దీనితో హైడ్రా నోటీసులు అందుకున్న వారు అవాక్కవుతున్నారు. ఇటువంటి మోసాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రజలు ఏదైనా స్థలాన్ని, ఇంటిని కొనుగోలు చేసే సమయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని హైడ్రా కోరుతోంది. అయితే మనం కొనుగోలు చేసే స్థలం, ఇళ్లు గత 30 ఏళ్ల క్రితం ఎలా ఉందో తెలుసుకొనే అవకాశం మనకు వెబ్ సైట్ ద్వారా అందుబాటులోకి వచ్చింది. ఇది భూములు కొనుగోలు చేయాలనుకున్న వారికి ఒక వరమనే చెప్పవచ్చు. ఎందుకంటే కోట్లు వెచ్చించి స్థలాన్ని కొనుగోలు చేసి, ఆ తరువాత హైడ్రా నోటీసులు అందుకోవడం కన్నా.. ముందుగానే ఆ స్థలం చెరువు, కుంటలలో ఉందా అనే విషయం నిర్ధారించుకోవడం ఉత్తమం. స్థలం పూర్వ వివరాలు మనం తెలుసు కొనేందుకు ముందుగా మనం గూగుల్ లో ఐనీనీఐశ్రీవ వజీతీబిష్ట్ర జూతీనీ అని సెర్చ్ చేయాలి. అలా సెర్చ్ చేసిన అనంతరం ఎర్త్ వర్షన్ అంటూ మనకు కనిపిస్తుంది. ఆ లింకును క్లిక్ చేసిన తరువాత పైన మూడవ ఆప్షన్ గా గూగుల్ ఎర్త్ ప్రొ వెబ్ అంటూ కనిపిస్తుంది. ఇక అక్కడ మనం కొనుగోలు చేసే స్థలం ఉండే.. ప్రాంతం యొక్క పేరు టైప్ చేస్తే చాలు.. ఆ ప్రాంతం యొక్క ముఖచిత్రం మనకు కనిపిస్తుంది. అందులో పైన ఒక క్లాక్ సింబల్ కనిపిస్తుంది కదా.. ఇక ఆ సింబల్ ని మనం జరిపే కొద్దీ మనకు ఆ ప్రాంతం పూర్వ ముఖచిత్రం మనకు పూర్తిగా కనిపిస్తోంది ఉదాహరణకు 30 ఏళ్ల వరకు క్లాక్ ని జరిపితే.. మన స్థలం కుంట, చెరువులో ఉందా అనేది కూడా మనం వెంటనే తెలుసుకోవచ్చు. అలాగే ప్రభుత్వం సైతం హైడ్రా టార్గెట్ లో ఉన్న గృహాలు, స్థలాలు వాటి వివరాలను కూడా ప్రత్యేక వెబ్ సైట్ లో పొందుపరిచింది. మీరు గూగుల్ లోకి వెళ్లి హైడ్రా పరిధిలోకి వచ్చే స్థలాల పూర్తి జాబితా ఇలా వచ్చేస్తుంది. మరి ఇంకెందుకు ఆలస్యం.. మోసపూరిత మాటలు నమ్మి మోసపోవద్దు.. స్థలాన్ని కొనుగోలు చేసే ముందు ఒక్కసారి చెక్ చేసుకోండి.. లేకుంటే మీ డబ్బు గల్లంతే.

# సంగారెడ్డి- మియాపూర్ రోడ్డుకు మోక్షం

మెదక్: హైదరాబాద్ శివారుల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతోన్న ప్రాంతాల్లో పటాన్‌చెరు-సంగారెడ్డి కారిడార్ ఒకటి. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ జహీరాబాద్ వరకు విస్తరిస్తోంది. ఇదే నేపథ్యంలో ఈ మార్గంలో ట్రాఫిక్ సమస్య తీవ్ర స్థాయిలో ఉంటుంది. మియాపూర్ నుంచి పటాన్ చెరు వరకు పెద్దపెద్దగా షాపింగ్ మాల్స్ అందుబాటులోకి రావడంతో పాటు ఐటీ కారిడార్‌కు లింక్ ఉండడంతో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది. అయితే మరికొన్ని రోజుల్లో ఈ సమస్యకు ఫుల్ స్టాప్ పడనుంది.

సంగారెడ్డి- మియాపూర్ రోడ్డుపై వెళ్లే వారి ట్రాఫిక్ కష్టాలు అన్ని ఇన్ని కావు?రోజు, రోజుకు రద్దీ పెరిగిపోవడంతో గంటల తరపడి వేచి ఉండాల్సిన పరిస్థితి..ఒక రకంగా చెప్పాలంటే ఈ రోడ్డు పై ప్రయాణం అంటేనే వాహనదారులు వణికిపోయే పరిస్థితి. అందుకే అధికారులు ఈ ట్రాఫిక్ కష్టాలు పోయే విధంగా ప్రణాళికలు రూపొందించారు..సంగారెడ్డి కూడలి (పోత్రెడ్డిపల్లి చౌరస్తా) వరకు ప్రస్తుతం నాలుగు వరుసలుగా ఉన్న రోడ్డును ఆరు వరుసలుగా 60 మీటర్లకు విస్తరణ పనులు ప్రారంభం అయ్యాయి. 31 కి.మీ పొడవు ఉన్న ఈ రోడ్డు విస్తరణకు రూ.1,400 కోట్ల వ్యయం అవుతోంది. ఇందులో రోడ్డునిర్మాణ పనులకు రూ.వేయి కోట్లు, భూసేకరణ పరిహారానికి రూ.400 కోట్లు ఖర్చు కానుంది. ఈ మార్గంలోనే ఉన్న కూకట్‌పల్లి వద్ద అత్యంత రద్దీ ట్రాఫిక్ వాహనదారులను బెంబేలెత్తిస్తోంది. మెట్రోరైలు ప్రాజెక్టులో భాగంగా జీహెచ్ఎంసీ ఇప్పటికే మియాపూర్ వరకు రోడ్డును విస్తరించింది. అక్కడి నుంచి రోడ్డు విస్తరణ బాధ్యతను జాతీయ రహదారుల విభాగం తీసుకుంది. ఈ రోడ్డు 60 మీటర్లకు వెడల్పు కానుంది. ప్రధాన క్యారేజ్ వే, దాని పక్కన సర్వీస్ రోడ్లు కలిపి 200 అడుగుల విశాలంతో రోడ్డు ఏర్పడుతుంది. విశాలంగా ఉన్న ప్రధాన రోడ్డు ఇదే కానుంది. మరోవైపు ఈ రహదారిలో వాహనాలకు క్రాసింగ్ రోడ్లతో ఇబ్బంది లేకుండా అవసరమైన చోట్ల ఫ్లైఓవర్లను నిర్మించనున్నారు. బీహెచ్ఈఎల్‌తో పాటు పటాన్‌చెరు, ఇస్నాపూర్, ముత్తంగి, రుద్రారం, కంది ప్రాంతాల్లో ఫ్లైఓవర్లను నిర్మించనున్నారు. ఈ రోడ్డును రెండేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. నగరంలో ప్రస్తుతం రోడ్డు విస్తరణకు వీలుగా 60 మీటర్ల స్థలం అందుబాటులో ఉండగా. కొన్ని ప్రాంతాల్లో తప్ప పెద్దగా నిర్మాణాలు అడ్డుగా లేవు. బీహెచ్ఈఎల్ దాటిన తర్వాత చాలా ప్రాంతాల్లో నిర్మాణాలను తొలగించాల్సి ఉంది. ఇలా ఈ రోడ్డు పూర్తి అయితే ముంబయి,షిర్డీ, షోలపూర్, గుల్బార్గా, మహారాష్ట్ర, కర్ణాటక వెళ్లే వారికి ట్రాఫిక్ ఇబ్బందులు తీరనున్నాయి.

# నేతలకు నడ్డా ఫుల్ క్లాస్

హైదరాబాద్: పార్టీ శ్రేణులపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అసంతృప్తి వ్యక్తం చేశారు. సభ్యత్వ నమోదుపై నడ్డా ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు సభ్యత్వ నమోదు 50 లక్షల టార్గెట్ ఇచ్చింది జాతీయ నాయకత్వం. అయితే, 15 రోజుల్లో నేతలు 9 లక్షల సభ్యత్వాన్ని మాత్రమే పూర్తి చేశారు. మిగిలిన 40 లక్షల టార్గెట్ ని 15 రోజుల్లో పూర్తి చేయాలన్నారు నడ్డా. నేతలంతా రెగ్యులర్ గా ప్రజల మధ్యన ఎందుకు ఉండటం లేదని ప్రశ్నించారు. అధికార పార్టీ హామీలపై పోరాటం చేయాలని నేతలకు సూచించారు నడ్డా. ఎమ్మెల్యే అభ్యర్థులు, ఎంపీ అభ్యర్థులు పార్టీకి ఎమ్మెల్యేలు, ఎంపీలతో సమానం. మీరు క్షేత్రస్థాయికి వెళ్ళండి. శక్తి కేంద్రాల వేదికగా బలోపేతం చేయండి. ప్రజల్లో ఉండండి. పార్టీని శక్తిమంతంగా తయారు చేయండి. మీరెందుకు రెగ్యులర్ గా ప్రజల మధ్య ఉండడం లేదు..? అధికార పార్టీ హామీలపై పోరాటం చేయాలి కదా. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేపట్టిన కార్యక్రమాలను, వైఫల్యాలను కూడా ప్రజలకు గుర్తు చేయాలి కదా..? సభ్యత్వ నమోదు కూడా స్పీడ్ గా కావడం లేదు. ఎందుకిలా? 50 లక్షల టార్గెట్ పెట్టుకుని ఇప్పటివరకు 9 లక్షలు మాత్రమే చేస్తారా.?" అని పార్టీ శ్రేణులపై ఆగ్రహం వ్యక్తం చేశారు జేపీ నడ్డా. 15 రోజుల్లో లక్ష్యాన్ని పూర్తి చేయాలని నడ్డా చెప్పారు. ఎంపీలు, పోటీ చేసిన వారు మండలానికి వెళ్లి సభ్యత్వం కోసం పని చేయాలి. శక్తి కేంద్రం వరకు ఎమ్మెల్యేలు వెళ్లాలి. సభ్యత్వ నమోదు డ్రైవ్ కు మంచి స్పందన వస్తోంది. తెలంగాణలో ఎక్కువ సభ్యత్వం చేయాలని, అధికారంలోకి వచ్చేలా పని చేయాలని అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేలా పని చేయాలన్నారు. 15 రోజుల అనంతరం మరోసారి సమావేశం అవుతానని నడ్డా చెప్పారు. కేవలం సభ్యత్వం నమోదు కోసమే నడ్డా ఇక్కడికి వచ్చారు. మూడు ఎమ్మెల్సీ ఎన్నికల సభ్యత్వం కోసం కూడా పని చేయాలన్నారు". బీజేపీ ముఖ్య నేతలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పోటీ చేసిన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సమావేశమయ్యారు. ప్రధానంగా బీజేపీ సభ్యత్వ నమోదు, పార్టీ బలోపేతంపై ఫోకస్ చేశారు నడ్డా. పార్టీ నేతల నుంచి వివరాలు రాబట్టారు. అదే సమయంలో వారికి దిశానిర్దేశం చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా అవతరించాలన్న లక్ష్యంతో బీజేపీ ముందుకెళ్తోంది. ఈ క్రమంలో తెలంగాణలో 50 లక్షల సభ్యత్వ నమోదు చేయాలనే టార్గెట్ పెట్టుకుంది. నెల రోజుల్లో ఈ లక్ష్యాన్ని పూర్తి చేయాలని దిశానిర్దేశం చేసింది. అయితే, 15 రోజులు అవుతున్నా కేవలం 9 లక్షల సభ్యత్వాలు మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన 40 లక్షల చిల్లర సభ్యత్వాలు పూర్తి కాకపోవడంపై నడ్డా కొంత అసంతృప్తి వ్యక్తం చేశారు. వరుసగా పండుగలు వస్తున్న నేపథ్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం స్పీడ్ అందుకోలేంటూ పార్టీ శ్రేణులు జేపీ నడ్డా దృష్టికి తీసుకెళ్లిన పరిస్థితి ఉంది. వచ్చే 15 రోజుల్లో సభ్యత్వ నమోదు డ్రైవ్ ని వేగవంతం చేయాలని, వీలైనంత తొందరగా ఇచ్చిన టార్గెట్ ను పూర్తి చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు జేపీ నడ్డా.

# హైకోర్టును ఆశ్రయించిన మూసీ నిర్వాసితులు..

## ఇళ్ల ముందు వెలసిన కోర్టు స్టే బోర్డులు..

హైదరాబాద్: మూసీ పరివాహక ప్రాంత నిర్వాసితులు హైకోర్టును ఆశ్రయించారు. తమ ఇళ్లను కూల్చివేయద్దంటూ ఫణిగిరి నగర్ బాధితులు హైకోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారు. గతంలో ఆక్రమణలకు మార్క్ వేసిన పెయింటింగ్ ను ఇళ్ల యజమానులు తొలగించేస్తున్నారు. తమ ఇళ్లను కూల్చివేయద్దంటూ ఇళ్ల ముందు హైకోర్టు స్టే బోర్డులను ఏర్పాటు చేసుకున్నారు. అటు చైతన్యపురి కొత్తపేటలోనూ మూసీ నిర్వాసితులు వంటా-వార్పు నిర్వహించారు. మూసీ పరివాహక ప్రాంతాలకు సంబంధించిన సర్వేలో ఇంకా గందరగోళం కొనసాగుతోంది. మూసీ రివర్ బెడ్ ఏరియాకు సంబంధించి ఇళ్లకు మార్కింగ్ వేయగా.. వారంతా కోర్టుకెళ్లి స్టే తెచ్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. హైదరాబాద్, మేడ్చల్ జిల్లాలలో రెవెన్యూ అధికారులకు స్థానికుల నుంచి తీవ్ర నిరసన సెగలు ఎదురవుతున్నాయి. మేడ్చల్ జిల్లాకు సంబంధించి ఉప్పల్ తహశీల్దార్ పరిధిలో ఇప్పటికే ఇళ్లకు మార్కింగ్ వేశారు అధికారులు. అయితే తమ ఇళ్లను కూల్చకుండా నిర్వాసితులు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. గడిచిన 4 రోజులుగా సర్వే చేస్తున్న అధికారులను అడుగడుగునా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. చైతన్యపురికి సంబంధించి న్యూ మారుతీనగర్, గణేశ్ నగర్, వినాయక్ నగర్, ఫణిగిరి నగర్ కు చెందిన మూసీ నిర్వాసితులు హైకోర్టు బాట పడుతున్నారు. కోర్టు నుంచి స్టే తెచ్చుకుని తమ ఇళ్లను అధికారులు కూల్చకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. తమ ఇళ్లను కూల్చకుండా హైకోర్టు నుంచి స్టే తెచ్చుకునేందుకు పిటిషన్లు వేశామంటూ ఫ్లెక్సీలు చాలా చోట్ల వెలిశాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు సంబంధించి సుమారు 45 కిలోమీటర్ల మేర సర్వే కొనసాగుతోంది. హైదరాబాద్ జిల్లాకు సంబంధించి 30శాతం మంది నిర్వాసితులు.. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న పునరావాస కేంద్రాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నా? రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు సంబంధించి మూసీ రివర్ బెడ్ ఏరియాలో అనేక మంది శాశ్వత నిర్మాణాల్లో ఉన్నారు, లక్షల రూపాయల విలువ చేసే ప్రాపర్టీ కలిగి ఉన్నారు. దాంతో వారంతా తమ ఇళ్లను ఖాళీ చేసే వెళ్లేందుకు ఒప్పుకోవడం లేదు. మేడ్చల్ జిల్లాకు సంబంధించి ఉప్పల్ తహశీల్దార్ పరిధిలో ఉన్న రివర్ బెడ్ ఏరియాలో నిర్వాసితులను తరలించడం రెవెన్యూ అధికారులకు కొంత తలనొప్పిగా మారింది. బాధితులకు బాసటగా బీఆర్ఎస్ పార్టీ రంగంలోకి దిగింది. మూసీ పరివాహక ప్రాంతాల్లో పర్యటించిన బీఆర్ఎస్ నేతలు.. నిర్వాసితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ నేతలు బాధితులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చిన నేపథ్యంలో రేపు సర్వే ఏ విధంగా కొనసాగుతుంది, నిర్వాసితుల తరలింపు ఉంటుందా లేదా అన్నది ఉత్కంఠగా మారింది. మొత్తంగా నాలుగో రోజు కేవలం పునరావాస కేంద్రాలకు బాధితులను తరలింపు వరకే రెవెన్యూ అధికారులు పరిమితమయ్యారు.

# హైడ్రా చుట్టూ రాజకీయాలు

హైదరాబాద్: తెలంగాణ రాజకీయానికి కేంద్ర బిందువుగా మారిపోయింది హైడ్రా. తెలంగాణాలోని మూడు ప్రధాన పార్టీలిప్పుడు మైలేజీ కోసం హైడ్రా చుట్టూనే పావులు కదుపుతున్నాయి. అధికారంలో ఉన్న కాంగ్రెస్‌తోపాటు ప్రతిపక్షాలు బీఆర్ఎస్, బీజేపీ కూడా హైడ్రా కేంద్రంగానే పొలిటికల్ యాక్టివిటీస్ ను పెంచుతున్నాయి. ఓవరాల్‌గా చెప్పాలంటే రాష్ట్రంలో మిగిలిన పొలిటికల్ యాక్టివిటీస్ అన్నీ హైడ్రాతో పక్కకెళ్లిపోయాయి. ఇప్పుడు రాజకీయ పార్టీలకు హైడ్రానే ఆయుధంగా మారింది. విపక్షాన్ని ఇబ్బంది పెట్టాలనుకున్న అధికార పార్టీ హైడ్రాను అస్త్రంగా ప్రయోగిస్తుంటే?. అధికార పక్షాన్ని టార్గెట్ చేసేందుకు విపక్షాలు కూడా హైడ్రానే ఆయుధంగా మల్చుకుంటున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూకుడు హైడ్రా ఆక్రమణదారుల్లో గుబులు పుట్టిస్తుండగా, కూల్చివేతలతో నష్టపోయిన వారికి అండగా నిలుస్తూ ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధమవుతున్నాయి బీజేపీ, బీఆర్ఎస్. ఇందులోనూ బీజేపీ తరఫున ఎంపీ ఈటల రాజేందర్, బీఆర్ఎస్ తరఫున మాజీమంత్రి హరీశ్ దూకుడు పెంచుతూ హైడ్రాను టార్గెట్ చేస్తున్నారు. ఇలా మూడు పార్టీలు హైడ్రానే ఇప్పుడు కేంద్ర బిందువుగా మారడం చర్చనీయాంశంగా మారుతోంది. హైదరాబాద్ నగరంలో ముంపు లేకుండా ఉండాలంటే చెరువులు, నాలాల ఆక్రమణలు తొలగించాలని భావించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైడ్రాకు ప్రాణం పోశారు. తొలుత కొద్ది మంది పెద్దల ఆక్రమణలను తొలగించి ప్రజల్లో మంచి ఇమేజ్ సంపాదించుకున్న హైడ్రా? కాలక్రమంలో బడుగులు, మధ్య తరగతి వారి ఇండ్లనూ కూల్చివేస్తుండటంతో విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తోంది. కానీ, భవిష్యత్‌పై భరోసా కోసం హైడ్రా ఉండాల్సిందేనని భావిస్తున్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. హైడ్రా వల్ల రాజకీయంగా నష్టపోతామని మంత్రి వర్గ సహచరులు చెబుతున్నా, సీఎం వినలేదంటున్నారు. చెరువులు, నాలాల ఆక్రమించుకున్నవారు ఎంతటి వారైనా కూల్చాల్సిందే అంటూ సీఎం దూకుడు చూపుతున్నారు. ఇందులో భాగంగానే కాంగ్రెస్ పార్టీకే చెందిన కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు కుటుంబానికి చెందిన భవనాలు సైతం నేలమట్టం చేశారు. ఇదే ఊపులో మాజీ మంత్రి కేటీఆర్ లీజుకు తీసుకున్న జన్వాడ ఫాంహౌస్ కు కూడా నోటీసులు ఇచ్చేసింది హైడ్రా. ఐతే ప్రతిపక్షాలను లొంగదీసుకోడానికే హైడ్రా అంటూ మొదట్లో విమర్శలు చేసిన బీఆర్ఎస్, బీజేపీ.. ఆ తర్వాత కొంత సైలెంట్ అయిపోయాయి. అయితే ఇప్పుడు హైడ్రా దూకుడు పెంచడం.. సామాన్యులు తిరుగబడుతుండటంతో మళ్లీ ప్రజల తరఫున పోరాట పంథా ఎంచుకోవడం ఆసక్తికరంగా మారింది. ఎవరు అడ్డు చెప్పినా, హైడ్రాకు అపరమిత అధికారాలు కల్పించిన సీఎం రేవంత్ రెడ్డి? బీఆర్ఎస్, బీజేపీ అస్త్రాలను ఎలా ఎదుర్కొంటారనేది ఆసక్తి రేపుతోంది. ముఖ్యంగా ఎక్కడ కూల్చివేతలు ఉంటే అక్కడ క్షణాల్లో వాలిపోతున్న ఈటల రాజేందర్ ప్రభుత్వ వ్యతిరేకత పెంచేలా చాప కింద నీరులా వ్యవహరిస్తున్నా రంటున్నారు. కొన్ని రోజులుగా ఇతర రాజకీయ కార్యక్రమాలను పక్కన పెట్టిన ఈటల పూర్తిగా హైడ్రాపై యుద్ధానికే సమయం కేటాయిస్తున్నారని అంటున్నారు. ఈ ఇష్యూలో బీజేపీకి మైలేజ్ పెరుగుతుందనే అంచనాతో ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం కూడా ఈటలను ప్రోత్సహిస్తూ.. మిగిలిన నేతలు కూడా బాధితుల తరఫున పోరాడాలని పిలుపునిస్తోంది. మరోవైపు ఎంఐఎం నేతల భవనాల జోలికి ఎందుకు వెళ్లడం లేదని ప్రభుత్వాన్ని నిలదీస్తోంది. ఇలా ప్రభుత్వంపై బీజేపీ ఒత్తిడి పెంచుతుండగా, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ కూడా ప్రజల గొంతు వినిపించేందుకు భారీ ప్రణాళిక రచిస్తోంది. ముఖ్యంగా మూసీ పరివాహక ప్రాంతాన్ని ఖాళీ చేయించాలనే ప్రభుత్వ లక్ష్యానికి సవాల్ విసురుతోంది. మూసీ నది తీరంలో పర్యాటక ప్రాజెక్టు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నుంచి ప్రయత్నిస్తోంది. ఈ ప్రాజెక్టు కోసం విదేశాల్లో పర్యటించి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దాలంటే మూసీని ప్రక్షాళించాలని భావిస్తున్నారు. ఐతే మూసీ తీరంలో ఎక్కువగా పేదలు ఇల్లు నిర్మించుకుని నివసిస్తుండటంతో వారిని ఖాళీ చేయించడం సవాల్‌గా మారిందంటున్నారు. వీరిపైకి హైడ్రా బుల్డోజర్ వెళితే ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే మూసీ తీరంలో సర్వే జరుగుతుండగా, స్థానికుల తరఫున పోరాటానికి బీఆర్ఎస్ నేత హరీశ్ రావు రంగంలోకి దిగారు. అసలే హరీశ్ రావుకు క్రౌడ్ పుల్లర్ అనే పేరుంది. ఆయన ఓల్డ్ సిటీలో హైడ్రాకు వ్యతిరేకంగా పోరాడితే పరిస్థితులు ఎటుదారి తీస్తాయోననే భయం వ్యక్తమవుతోంది. అధికారం కోల్పోయిన తర్వాత ప్రభుత్వంపై పోరాడటానికి బీఆర్ఎస్‌కు సరైన ఆయుధంగా హైడ్రా ఉపయోగ పడే అవకాశం ఉందంటున్నారు. ఇక పాతనగరంలో హైడ్రా బాధితులతో హరీశ్‌రావు చేతులు కలిపితే పార్టీకి మైలేజ్ పెరుగుతుందని అంచనాలో ఉంది గులాబీ దళం. ఇలా మూడు పార్టీల నేతలు హైడ్రా చుట్టూనే రాజకీయం చేస్తున్నారు. పాజిటివ్ టాక్‌తో ప్రజల మనసు గెలవాలని కాంగ్రెస్? బాధితుల బాధలను తెరపైకి తెచ్చి హైడ్రా నిర్దయగా వ్యవహరిస్తోందని నిరూపించేలా ప్రతిపక్షాలు పావులు కదుపుతున్నాయి. మరి ఈ యుద్ధంలో అంతిమ విజేత ఎవరన్నది ఉత్కంఠ రేపుతోంది. మొత్తానికి టాక్ ఆఫ్ ద స్టేట్‌గా మారిన హైడ్రా మున్ముందు ఎలా వ్యవహరిస్తుందనేది చూడాల్సివుంది.

# కేబీఆర్ పార్కు చుట్టూ 6 కొత్త జంక్షన్లు

హైదరాబాద్: హైదరాబాద్ లో ఉన్న కేబీఆర్ పార్క్ చుట్టూ సరికొత్త నిర్మాణాలు రాబోతున్నాయి. పార్క్ చుట్టూ 6 జంక్షన్ల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రూ.826 కోట్లతో ఈ జంక్షన్లను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఇందుకు సంబంధించిన డిజైన్ ఫొటోలను జీహెచ్ఎంసీ పోస్ట్ చేసింది. హైదరాబాద్ నగరంలో ఉన్న కేబీఆర్ పార్కు చుట్టూ 6 కొత్త జంక్షన్లు రాబోతున్నాయి. వీటిని నిర్మించేందుకు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ చేసింది. ఇందుకు సంబంధించిన డిజైన్లు కూడా ఖరారయ్యాయి. హైదరాబాద్ నగరంలో ఉన్న కేబీఆర్ పార్కు చుట్టూ 6 కొత్త జంక్షన్లు రాబోతున్నాయి. వీటిని నిర్మించేందుకు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ చేసింది. ఇందుకు సంబంధించిన డిజైన్లు కూడా ఖరారయ్యాయి. ఐఃఖీ పార్క్ చుట్టూ ఫ్లైఓవర్లు, అండర్ పాస్ లు ఉంటాయని జీహెచ్ఎంసీ తెలిపింది. హైదరాబాద్ కేబీఆర్ పార్కు చుట్టూ రూ.826 కోట్లతో 6 జంక్షన్లను ప్రభుత్వం నిర్మించనుందని పేర్కొంది. రెండు ప్యాకేజీలుగా నిర్మించే ఈ ప్రాజెక్ట్ మొదటిగా 2 ఫ్లైఓవర్లు, 3 అండర్ పాస్ లు నిర్మిస్తారు. ఇక సెకండ్ ప్యాకేజీలో 4 ఫ్లైఓవర్లు, 4 అండర్ పాస్ లు అభివృద్ధి చేస్తారనివివరించింది. ఈ నిర్మాణాల వల్ల బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ నుంచి హైటెక్ సిటీ, మాదాపూర్, కొండాపూర్, యూసుఫ్ గూడా ప్రాంతాలకు వెళ్లే వారికి ట్రాఫిక్ సమస్యలు తొలగనున్నాయిని జీహెచ్ఎంసీ వివరించింది. ఫస్ట్ ప్యాకేజీలో భాగంగా రూ.421 కోట్లతో జూబ్లీహిల్స్ చెక్ పోస్టు జంక్షన్, కేబీఆర్ ఎంట్రెన్స్ జంక్షన్ అభివృద్ధి చేస్తారు. ఇక 2వ ప్యాకేజీలో రూ.405 కోట్లతో జంక్షన్ల అభివృద్ధి పనులు చేపడుతారు

ఎయిర్ పోర్టు మెట్రోలో మార్పులు

హైదరాబాద్ మెట్రోకు సంబంధించి కీలక అడుగు ముందుకుపడింది. మెట్రో రెండో దశ పనులు అతిత్వరలోనే పట్టాలెక్కనున్నాయి. వీటికి సంబంధించిన డీపీఆర్‌లకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇటీవలే మెట్రో సెకెండ్ ఫేజ్ డీపీఆర్‌ల తయారీపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా మెట్రో ఎండీ.. కారిడార్ల అలైన్మెంట్ తో పాటు కీలకమైన అంశాలపై ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈ క్రమంలో గతంలో నిర్ణయించిన ఎయిర్ పోర్ట్ మెట్రో అలైన్‌మెంట్ మారుస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆరాంఘర్-బెంగళూరు హైవే కొత్త హైకోర్టు మీదుగా విమానాశ్రయానికి మెట్రో లైనును ఖరారు చేసింది. వివిధ ప్రత్యామ్నాయాల గురించి లోతైన చర్చల తర్వాత, మెట్రో రెండో దశ కారిడార్‌ల డీపీఆర్‌లను ఆమోదం తెలపనుంది. మొత్తం ఆరు కారికార్లలతో మెట్రో సెకెండ్ ఫేజ్ ఉండనుంది.

కారిడార్ 4.. నాగోల్ నుండి శంషాబాద్ విమానాశ్రయం వరకు దాదాపు 36.6 కి.మీ పొడవు.. ఎల్ బి నగర్, కర్మన్‌ఘాట్, ఒవైసీ హాస్పిటల్, డిఆర్డిఓ, చంద్రాయన్ గుట్ట, మైలార్‌దేవ్‌పల్లి, ఆరంఘర్, న్యూ హైకోర్టు, శంషాబాద్ జంక్షన్ ద్వారా నేషనల్ హైవే మీదుగా ఈ మార్గం ఉంటుంది. మొత్తం 36.6 కిలీమీటర్ల పొడవులో, 35 కిలోమీటర్ల ఎలివేట్ చేయబడుతుంది. అలాగే 1.6 కిలీమీటర్ల మార్గం భూగర్భంలో వెళ్తుంది.

కారిడార్ 5.. రాయదుర్గ్ మెట్రో స్టేషన్ నుండి కోకాపేట్ నియోపోలిస్ వరకు బయోడైవర్సిటీ జంక్షన్, ఖాజాగూడ రోడ్, నానక్ రామ్ గూడ జంక్షన్, విప్రో సర్కిల్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కోకాపేట్ నియోపోలిస్ మీదుగా బ్లూ లైన్ ను పొడిగిస్తారు. కారిడార్ 6.. ఎంజీబీఎస్ నుండి చంద్రాయన్ గుట్ట వరకు గ్రీన్ లైన్ పొడిగింపు.. ఎంజీబీఎస్ నుండి ఈ 7.5 కి.మీ లైన్, ఓల్డ్ సిటీలోని మండి రోడ్ మీదుగా దారుల్‌షిఫా జంక్షన్, శాలిబండ జంక్షన్, ఫలక్‌నుమా మీదుగా ప్రయాణిస్తుంది. కారిడార్ సాలార్‌జంగ్ మ్యూజియం, చార్మినార్ నుండి 500 మీటర్ల దూరంలో ఉన్నప్పటికీ, ఈ పేర్లనే వాటి చారిత్రక ప్రాముఖ్యత కారణంగా స్టేషన్ పేర్లుగా చేర్చనున్నారు.

కారిడార్ 7.. ముంబై హైవేపై రెడ్ లైన్ పొడిగింపు.. ప్రస్తుతం ఉన్న మియాపూర్ మెట్రో స్టేషన్ నుండి ప్రారంభించి, పటాన్‌చెరు వరకు ఉన్న ఈ 13.4 కిలీమీటర్ల లైన్ ఆల్విన్ ఎక్స్ రోడ్, మదీనాగూడ, చందానగర్, బిహెచ్ఈఎల్, ఇక్రిసాట్ మీదుగా వెళ్తుంది.

కారిడార్ 8.. విజయవాడ హైవేపై ఎల్ బి నగర్ వైపు నుండి రెడ్ లైన్ పొడిగింపు.. ఎల్ బి నగర్ నుండి హయత్ నగర్ వరకు ఈ 7.1 కిమీ కారిడార్ చింతలకుంట, వనస్థలిపురం, ఆటోనగర్, ఆర్టీసీ కాలనీ మీదుగా వెళుతుంది. ఇది పూర్తిగా ఎలివేటెడ్ కారిడార్‌లో సుమారు 6 స్టేషన్లు ఉంటాయి. సీఎం ప్రత్యేక దృష్టి సారించిన ఫోర్త్ సిటీ మెట్రో కనెక్టివిటీ లైన్ కోసం అనేక ఆకర్షణీయమైన ఫీచర్లతో వినూత్న రీతిలో డిపిఆర్ తయారు చేస్తున్నామని చెప్పారు మెట్రో ఎండీ? ఈ కొత్త లైన్ డీపీఆర్ మినహా మిగిలిన డీపీఆర్ లను త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నారు.

# కరీంనగర్ కాంగ్రెస్ లో గజిబిజీ...

కరీంనగర్: అధికార పార్టీ కాంగ్రెస్ కరీంనగర్ లో హస్తవ్యస్తంగా మారింది. సరైన నాయకుడు లేక, ఇన్ చార్జి కానరాక పార్టీ శ్రేణుల్లో అయోమయం నెలకొంది. ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరు మంత్రులు, ఇద్దరు ప్రభుత్వ విప్ లు, ఒక ఎంపీ, నలుగురు ఎమ్మెల్యేలు ఓ ఎమ్మెల్సీ ఉన్నప్పటికీ కరీంనగర్ లో పార్టీని నడిపే సరైన నాయకుడు లేని దుస్థితి ఏర్పడింది. పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ కరీంనగర్ లో ప్రతిపక్ష పాత్రనే పోషిస్తుంది. కరీంనగర్ జిల్లా కేంద్రంలో బిజెపి కి చెందిన ఎంపీ, బిఆర్ఎస్ చెందిన ఎమ్మెల్యే ఉండడంతో కాంగ్రెస్ కు కనీసం ఇంచార్జి లేని పరిస్థితి వచ్చిందని కాంగ్రెస్ శ్రేణులు ఆవేదన చెందుతున్నాయిఅధికార పార్టీ కాంగ్రెస్ కరీంనగర్ లో సరికొత్త సమస్య ఎదుర్కొంటుంది. పార్టీ అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్నా దశాబ్దం నాటి ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నట్లే ప్రస్తుతం నెలకొంది. గంపెడు మంది నాయకులు ఉన్నా కరీంనగర్ ను పట్టించుకునే వారు కానరాక పార్టీ పరిస్థితి గందరగోళంగా ఉంది. ముందుండి పార్టీని నడిపే నాయకుడు లేక దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీకి బలమైన క్యాడర్ ను, లీడర్ ను అందిస్తూ వచ్చిన కరీంనగర్ లో ఇప్పుడు కార్యకర్తలు తమకు దిక్కెవరు అని ప్రశ్నించుకునే పరిస్థితులు నెలకొన్నాయి. పేరుకు అధికార పార్టే కానీ, కార్యకర్తల్లో భరోసా నింపే కార్యక్రమం ఒక్కటి కూడా లేకపోవడం పార్టీ పరిస్థితికి అద్దం పడుతుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెనువెంటనే లోక్ సభ ఎన్నికల హడావుడి ముగిసిన తర్వాత ఇప్పటి వరకు నగరంలో కాంగ్రెస్ పార్టీపరంగా సందడి వాతావరణం అలుముకోకపోవడం పార్టీ శ్రేణులను నిరాశకు గురి చేస్తోంది. రెండు దశాబ్దాలకు పైగా నగరానికి పెద్ద దిక్కుగా ఉన్న శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ ఇద్దరు ఇప్పుడు కేబినెట్ లో కీలక మంత్రులుగా ఉన్నా పార్టీ బలోపేతం పై చిన్నచూపు చూస్తున్నారనే అభిప్రాయం బలంగా వ్యక్తమవుతోంది. కరీంనగర్ కు చెందిన పొన్నం ప్రభాకర్ సిద్దిపేట జిల్లా పరిధిలోని హుస్నాబాద్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై మంత్రి అయి బిజీగా మారారు. గతంలో ఎంపీగా పార్లమెంట్ నియోజకవర్గ ఇన్ చార్జి ఉన్నంత కాలం నగరంలో పార్టీని ఏకతాటిపై నడిపించారనే పేరుంది. ప్రస్తుతం సిద్దిపేట జిల్లా నుంచి రాష్ట్ర మంత్రి వర్గంలో ప్రాతినిధ్యం వహిస్తున్న అక్కడ ఎక్కువ కాన్సెంట్రేషన్ చేయడంతో కరీంనగర్ పై పెద్దగా శ్రద్ధ చూపడం లేదనే భావన క్యాడర్ లో నెలకొంది. పొన్నం సిద్దిపేట, మరో మంత్రి శ్రీధర్ బాబు పెద్దపల్లి జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తుండడంతో కరీంనగర్ పై దృష్టి సారించే నాథుడే లేకుండా పోయారని కాంగ్రెస్ కార్యకర్తలు వాపోతున్నాయి. ఒకప్పుడు కాంగ్రెస్ కు కంచుకోటగా ఉన్న కరీంనగర్ లో నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా, మూడు పర్యాయాలు ఎంపీ గా ఓటమి పాలయింది. బిఆర్ఎస్ కు చెందిన గంగుల కమలాకర్ వరుసగా నాలుగుసార్లు కరీంనగర్ అసెంబ్లీ స్థానం నుంచి ఎమెల్యేగా గెలుపొంది కాంగ్రెస్ పార్టీ విజయ అవకాశాలను దెబ్బతీశారు. గడిచిన మూడు అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మూడవ స్థానంలో నిలువడం పార్టీ నాయకత్వ వైఫల్యానికి అద్దంపడుతోంది. చుట్టుపక్కల ఎక్కడా కానరాని బీజేపీ ఒక్క కరీంనగర్ అసెంబ్లీ స్థానం పరిధిలోనే వరుసగా మూడుసార్లు రెండవ స్థానంలో నిలువడం విశేషం. 2004లో మాజీ మంత్రి ఎమ్మెస్సార్ తర్వాత 2009 నుంచి కరీంనగర్ లో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి రోజురోజుకు పడిపోతూ వస్తోంది. ఈ కారణంగానే 2020 లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఒక్క డివిజన్ కూడా కాంగ్రెస్ పార్టీ గెలుచుకోలేకపోయింది. గత అసెంబ్లీ ఎన్నికలప్పటి నుంచి కరీంనగర్ నియోజకవర్గ ఇన్ చార్జిగా పురమల్ల శ్రీనివాస్ కొనసాగుతున్నారు. వ్యక్తిగత కారణాలతో పార్టీ కార్యక్రమాల్లో చుట్టపుచూపుగా వ్యవహరిస్తున్నారని కార్యకర్తలు ఆవేదన చెందుతున్నారు. బొమ్మకల్ మాజీ సర్పంచ్ అయిన శ్రీనివాస్ పార్టీ కార్యక్రమాలకు తనవంతుగా హాజరు కావడమే తప్ప స్వంతంగా ఏ ఒక్క కార్యక్రమం చేపట్టిన దాఖలాలు లేవని చెబుతున్నారు. అలాగే ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన వెలిచాల రాజేందర్ రావు సైతం మీడియా ప్రకటనలు మినహాయిస్తే నగరంపై ప్రత్యేకించి దృష్టి పెట్టిన సందర్భాలు లేవని పార్టీ శ్రేణులు గుర్తు చేస్తున్నారు. అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆ ఇద్దరు నేతలు కనీసం సమీక్షా సమావేశాలు కూడా నిర్వహించలేదని కార్యకర్తలు వాపోతున్నారు. ఆయా ఎన్నికలకు ముందే కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా మారిన నేపథ్యంలో పార్టీ క్యాడర్ కు, ఇన్ చార్జిలకు మధ్య అగాధం ఏర్పడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కరీంనగర్ నుంచి నామినేటెడ్ పదవిని దక్కించుకున్న ఏకైక నాయకుడు నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి. మూడు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో విస్తరించి ఉన్న సుడా చైర్మన్ పదవిని చేపట్టి సుడా కార్యక్రమాల్లో ఫుల్ బిజీగా మారారు. కార్యాలయానికి సంబంధించి పనులే విపరీతంగా ఉండటంతో అడపాదడపా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ సుడా చైర్మన్ పదవికి న్యాయం చేసే పనిలో నిమగ్నమయ్యారు. పీసీసీ చీఫ్ గా మహేష్ కుమార్ గౌడ్ బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో త్వరలోనే మరొకరు నగర అధ్యక్ష బాధ్యతలు చేపడతారనే ఆలోచనతో నరేందర్ రెడ్డి పార్టీ వ్యవహారాల కంటే పాలనా వ్యవహారాలకు అధిక సమయం కేటాయిస్తూ వస్తున్నారని తెలుస్తోంది. పార్టీ కార్యకర్తలకు అత్యవసర పరిస్థితుల్లో నగర అధ్యక్షుడు నరేందర్ రెడ్డి ఒక్కరే దిక్కు కావడంతో ఏదైనా అవసరం పడితే కార్యకర్తలు సుడా కార్యాలయానికి క్యూ కడుతున్నారు. 2020లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కార్పొరేషన్ పరిధిలో బీఆర్ఎస్, బీజేపీ మధ్యనే పోరు సాగింది. కాంగ్రెస్ పార్టీ ఎక్కడా కూడా గట్టిపోటీనివ్వలేకపోయింది. రెండో స్థానంలో నిలిచిన డివిజన్లు కూడా తక్కువగానే ఉన్నాయి. అయితే ఈసారి పార్టీ అధికారంలో ఉన్నందున మేయర్ పదవి తమదేనని ధీమాతో ఉన్న కార్యకర్తలు రోజులు గడుస్తున్నా కొద్ది ఆందోళన చెందుతున్నారు. పార్టీ అధికారంలోకి రాగానే గతంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన నేతలందరూ వరుసగా కాంగ్రెస్ పార్టీలో చేరుతూ వచ్చారు. 11 మంది కార్పొరేటర్లు, సర్పంచులు, జడ్పీటీసీలు సహా పెద్ద ఎత్తున మాజీ ప్రజాప్రతినిధులు కూడా కాంగ్రెస్ పార్టీలో మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు.

అంతకు మించి పార్టీపరంగా జరిగిన కార్యక్రమాలేవీ లేవని కార్యకర్తలు అభిప్రాయపడుతు న్నారు. పార్టీలో చేరిన నేతలు కూడా పార్టీతో సంబంధం లేనట్టుగా ఎవరి పనుల్లో వారు నిమగ్నమైపోవడంతో నగరంలో పార్టీ పరిస్థితి త్రిశంకుస్వర్గంలా మారింది. మరో ఆరు నెలల్లో మున్సిపల్ ఎన్నికలు, ఎమ్మెల్సీ ఎన్నికలు, పంచాయతీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అసెంబ్లీ నియోజకవర్గానికో... నగరానికో బలమైన నేత లేకపోవడంతో ఆ ఎన్నికలను ఎలా ఎదుర్కొగలుగుతామన్న ఆందోళన పార్టీ శ్రేణుల్లో నెలకొంది. ఇప్పటికైనా పార్టీ అధిష్టానం బలమైన వ్యక్తికి బాధ్యతలు అప్పగించి, కొత్త కమిటీలు వేసి పార్టీని గాడిలో పెట్టాలని కార్యకర్తలు కోరుతున్నారు.

## మహిళల భద్రతపై అవగాహన

పెద్దపల్లి: మహిళల భద్రతపై అవగాహన సదస్సును పట్టణంలోని మూన్ ఫంక్షన్ హాల్ నిర్వహించారు. ఇందులో మహిళలకు నైతికతే నిజమైన స్వేచ్ఛ అనే అంశంపై జరిగిన కార్యక్రమంలో మహిళల భద్రత అవగాహన సదస్సులో భాగంగా షీ టీం ఇంచార్జ్ ఏ ఎస్ ఐ మల్లన్న మాట్లాడుతూ మహిళల భద్రత, ఆన్లైన్ మోసాలు, ఆంటీ డ్రగ్స్ తదితర అంశాలపై వివరించారు. మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్, ప్రధాన చౌరస్తాలో జన సమీకరణప్రాంతాలు, కాలేజీల వద్ద షీ టీం నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. అలాగే అత్యాశకు పోయి సైబర్ క్రైమ్ ఆన్లైన్ మోసాలు ,లోన్ యాప్స్ గురవుతున్నారని వాటికి జోలికి పోకుండా ఉండాలని, ఎవరైనా ఆన్లైన్ మోసాలకుగురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సమాచారం ఇవ్వాలని, అలాగే మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100నంబర్ కు డయల్ చేయాలని తెలిపారు. ఆకతాయిలనుండి ఎలా రక్షణగా ఉండాలో తెలిపారు. ఈ కార్యక్రమంలో షీ టీం సిబ్బంది స్నేహ లత, కానిస్టేబుల్ సురేష్, మహిళలు పాల్గొన్నారు.

## లారీ ఓనర్స్ సమస్యలు పరిష్కరించాలి




### - రాష్ట్ర అధ్యక్షులు అంజిరెడ్డి

పెద్దపల్లి ప్రతినిధి:
రాష్ట్రంలో లారీ ఓనర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్రప్రభుత్వం పరిష్కరించా లని తెలంగాణ లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సి. అంజిరెడ్డి డిమాండ్ చేశారు. పెద్దపల్లి లారీ అసోసియేషన్ కార్యాలయంలోరాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్క్రాప్ పాలసీ, క్వార్టర్లీ టాక్స్ మాఫీ, సింగిల్ పర్మిట్, లోకల్ లారీలకు ఇన్స్యూరెన్స్ రుసుం తగ్గింపు, 15 ఏళ్లు దాటిన కార్తీక ఫిట్ నెస్ ఫీజు తగ్గింపు, తదితరఅంశాలపై చర్చించి ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించుకునే వరకు లారీ ఓనర్స్ ఐక్యంగా కదలి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో అసోసియేషన్ ఛైర్మన్ రామినేని శ్రీనివాస రావు, ప్రధాన కార్యదర్శి దుర్గా ప్రసాద్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, పెద్దపల్లి లారీ ఓనర్స్ అధ్యక్షులు షేక్ అబ్దుల్ భారీ, కార్యదర్శి బూత్కూరి తిరుపతి, ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి ఎండి జహంగిర్, కోశాధికారి ఎండి అఫ్జల్, రాష్ట్ర, జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

## పెద్దచెరువు కబ్జాను పరిశీలించిన ఎమ్మెల్యే

భువనగిరి: అధికారులు నిర్లక్ష్యం వల్ల భువనగిరి పెద్ద చెరువు పూర్తిస్థాయిలో కబ్జాకు గురైందని స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. చెరువుకు ఆనుకొని ఇంక్రీడపుల్ ఇండియా అనే రియల్ ఎస్టేట్ సంస్థ చెరువుని పూర్తిస్థాయిలో కబ్జాకు గురిచేసి అక్రమంగా ప్లాట్లు ఏర్పాటు చేసిందని అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. పూర్తిగా చెరువుకు ఆనుకొని న్నగోడనికూల్చివేయాలని ఆదేశాలు జారీ చేశారు. కనీసం మనిషి మరణిస్తే అంతక్రియలకైనా స్థలం లేదని, అంత్యక్రియలకు సంబంధించి అన్ని రకాల వసతులు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భువనగిరి పెద్ద చెరువు పూర్తిగా 240 ఎకరాలు దీనిలో ఎఫ్టిఎల్ బఫర్ జోన్ చెరువు శిఖం భూమిని కబ్జా చేశారని అన్నారు. గతంలో పెద్ద చెరువుకు రాస కాలువ ద్వారా నీరు వచ్చి చేరేదని కానీ ఇప్పుడున్న పరిస్థితుల ప్రకారం వర్షాలు ఎక్కువగా కురిసిన నీరు మాత్రం చెరువులోకి రాలేదని స్థానికులు అంటున్నారు. ప్రకృతిని మనం నష్టపరిస్తే ముందు తరాలకు ప్రకృతిని అందించలేక పోతామని స్థానిక ఎమ్మెల్యే అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం హైడ్రా పేరుతో చెరువులు కుంటలు కబ్జాకు గురైన వాటిని తొలగించడం మంచి పరిణామం అని అన్నారు. తెలంగాణ వ్యాప్తంగా హైడ్రా పూర్తిస్థాయిలో పనిచేస్తుందని పేద ప్రజల కోసం ప్రత్యేకంగా కల్పించిన తర్వాతనే హైడ్రా పూర్తిస్థాయిలో కొనసాగుతుందని అన్నారు.

## ఆర్టీసీ బస్సులోనే ప్రసవం

కోదాడ: ఓ మహిళకు పురిటి నొప్పులు రావడంతో ఆర్టీసీ బస్సులోనే కాన్పు చేసిన సంఘటన సూర్యాపేట జిల్లా మునగాల మండలం తాడ్వాయి వద్ద చోటు చేసుకుంది. అనంతగిరి మండలం మొగలైకోట గ్రామానికి చెందిన అలివేలు అనే మహిళా ఏడో నెల గర్భవతి. ఆమె వైద్య పరీక్షల నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహించుకుని తిరిగి స్వగ్రామానికి కోదాడ డిపోకు చెందిన పల్లె వెలుగు ఆర్టీసీ బస్సులో వెళుతుండగా మునగాల మండలం తాడ్వాయి వద్దకు రాగానే ఆమెకు పురిటి నొప్పులు ఎక్కువ అయ్యాయి పక్కనే ఉన్న ప్రయాణికులు 108కు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న 108 సిబ్బంది పరిస్థితి చూసి ఆర్టీసీ బస్సులోనే కాన్పు చేశారు. ఏడో నెలలోనే బాబు పుట్టి అతనికి సీరియస్ గా ఉండటంతో సూర్యాపేట ఏరియా వైద్యులకు సమాచారం అందించి అక్కడి నుంచి 108 వాహనంలో సూర్యాపేటలో తరలిస్తుండగా మార్గమధ్యలో వైద్యులు చేరుకొని పుట్టిన బాబుకు సిపిఆర్ ఇతర పరీక్షలు చేస్తూ ఆసుపత్రికి తీసుకెళ్లి రక్షించారు. సమయానికి అక్కడికి చేరుకొని కాన్పు చేసి వైద్య పరీక్షలు చేస్తూ సూర్యాపేట ఏరియా హాస్పిటల్ కి తరలించి తల్లి,బాబును రక్షించిన 108 సిబ్బందిని సూర్యాపేట వైద్యులు, అలివేలు కుటుంబ సభ్యులు అభినందించారు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**